
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 20-06-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 171 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు, వెల : 6.50



ప్రజాసమస్యల ప్రస్తావన ఏదీ?

- పరస్పర ఆరోపణలు, విద్వేష ప్రసంగాలతో సరి



కీలకాంశాలు గాలికి.. పక్కదారి పట్టిన పౌరుల కష్టాలు

దేశంలో సార్వత్రిక ఎన్నికలు ముగిసి నూతన ప్రభుత్వం కొలువుదీరింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా అధికార పక్షం, ప్రతిపక్షాలు అనేక అంశాలను లేవనెత్తాయి. ప్రజలపై హామీల వర్షం కురిపించాయి. కానీ పలు ప్రజా సమస్యలు ప్రచారంలో ప్రస్తావనకు రాకపోవడం గమనార్హం. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన దృశ్యాలు ఇప్పటికీ కండ్ల ముందు కదలాడుతూనే ఉన్నాయి. కానీ వారి సమస్యలను పట్టించుకునే నాథుడే కన్పించడం లేదు. ముఖ్యమైన ప్రజా సమస్యలు పక్కదారి పట్టాయి. ఎన్నికల ప్రచారం యావత్తూ పరస్పర ఆరోపణలు, విద్వేష ప్రసంగాలతో సాగిపోయింది.




న్యూఢిల్లీ : పదేండ్ల పాలన చేసినా మోడీ ప్రభుత్వం ఇది ట్రైలర్ అంటోంది. ఇంకా పిక్చర్ మిగిలి ఉందంటోంది. అయితే ప్రజాసమస్యలను ఎన్డీఏ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య తాగునీరు. దురదృష్టవశాత్తూ అసలు దీని ప్రస్తావనే ఎన్నికల ప్రచారంలో ఎక్కడా రాలేదు. దేశంలోని 150 ప్రధాన రిజర్వాయర్లలో నీటి లభ్యత 25 శాతానికి పడిపోయింది. దక్షిణాదిన అయితే నీటి మట్టం 14 శాతం తగ్గిపోయింది. బెంగళూరు, చెన్నయ్ నగరాల్లో ప్రజలు బిందెడు ...15లో

అడ్డూ అదుపూ లేని మైనింగ్

దేశంలో అక్రమ మైనింగ్‌కు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఇనుప ఖనిజం, మాంగనీస్‌ను అక్రమంగా తవ్వితీయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు ఏటా వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోంది. దేశ సంపద దోపిడీకి గురవడంతో పాటు శాంతి భద్రతల పైనా ప్రభావం చూపుతోంది. ఇన్ని అనర్థాలు జరుగుతున్నప్పటికీ ఎన్నికలకు ముందు కర్నాటకలో అక్రమ మైనింగ్ నిందితుడు గాలి జనార్ధన రెడ్డిని బీజేపీలో చేర్చుకున్నారు. ఖనిజాలే కాదు... ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు కూడా దేశవ్యాప్తంగా జోరుగా సాగిపోతున్నాయి. నదీ తీర ప్రాంతాల్లో మట్టి, ఇసుక తవ్వకాలు జరపడంతో అనేక నదులకు నష్టం వాటిల్లి వరదలు సంభవించాయి.

క్షీణిస్తున్న వాయు నాణ్యత

మన దేశంలో వాయు నాణ్యత ఎంత దారుణంగా ఉంటోందో చెప్పనక్కరలేదు. క్షీణిస్తున్న వాయు నాణ్యత లక్షలాది మంది ప్రాణాలను హరిస్తోంది. భవిష్యత్ తరాల వారిలో ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని దెబ్బతీస్తోంది. వాయు కాలుష్యం కారణంగా 2019లో 16.7 లక్షల మంది భారతీయులు చనిపోయారని ఓ అధ్యయనం తెలిపింది. బీజేపీ, కాంగ్రెస్, డీఎంకే ...15లో



యూజీసీ నెట్ పరీక్ష రద్దు

ఎన్టీఏ ప్రకటన

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో జూనియర్ అధ్యాపకుల ఖాళీల భర్తీ కోసం, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిపల్ అర్హతను నిర్ణయించడం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మంగళవారం నిర్వహించిన యూజీసీ నెట్-2024 పరీక్షను రద్దు చేసింది. ఈ పరీక్షల నిర్వహణలో పలు అవకతవకలు జరిగినట్టు నిఘా సంస్థల నుంచి ప్రభుత్వానికి సమాచారం అందింది. దీంతో బుధవారం రాత్రి నెట్ పరీక్షను రద్దు చేసినట్లు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రకటించింది. తిరిగి పరీక్ష ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని పేర్కొంది. మంగళవారం నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్షకు 11 లక్షల 21 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 9 లక్షల 8 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా 317 నగరాల్లోని 1205 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. వైద్య విద్యలో ప్రవేశానికి ఉద్దేశించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో, తాజా పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. నీట్ పరీక్షలపై కూడా విచారణ జరుపుతామని, పరీక్షల పారదర్శకతకు కట్టుబడి ఉన్నామని కేంద్ర విద్యాశాఖ తెలిపింది.

14 పంటలకు ఎంఎస్పీ

కేంద్రమంత్రివర్గం ఆమోదం



క్యాబినెట్ వివరాలు వెల్లడిస్తున్న కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఖరీఫ్ సీజన్‌లో 14 పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ని నిర్ణయిస్తూ కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు బుధవారం నాడిక్కడ ...15లో

సమాఖ్యవాద సూత్రాలకు పూర్తి విరుద్ధం

- కువైట్ వెళ్ళేందుకు కేరళ ఆరోగ్య మంత్రికి అనుమతి నిరాకరణపై మోడీకి కేరళ సీఎం లేఖ

వివరాలు 6లో



బ్యాంకర్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల

రుణాల మంజూరులో మానవీయ కోణముండాలి

నిరుపేద, మధ్యతరగతికి రుణాలిచ్చేందుకు ముందుకు రావాలి

- లక్ష్యాల సాధనలో ప్రభుత్వ బ్యాంకులు వెనుకంజ
- బ్యాంకర్లకు పాజిటివ్ దృక్పథం లేకపోతే అభివృద్ధి అసాధ్యం
- దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం తెలంగాణ : రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి
- మంత్రి తుమ్మలతో కలిసి వార్షిక ప్రణాళిక ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బ్యాంకర్లకు సామాజిక, మానవీయ కోణముండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన 41వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు, నిరుపేదలు, బలహీన వర్గాలతో పాటు సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమలకు విరివిగా రుణాలిస్తేనే రాష్ట్రం సమాగ్రాభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. సబ్సిడీ పథకాలకు సంబంధించి ప్రభుత్వం తన వాటాను సకాలంలో విడుదల చేస్తున్నప్పటికీ, ...5లో

పది వేల మంది టీచర్లకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు

- మల్టీజోన్-1 పరిధిలో 19 జిల్లాల్లో ఉత్తర్వులు జారీ

వివరాలు 6లో

కామాంధ ఖాకీ

రివాల్వర్‌తో బెదిరించి లైంగికదాడి..

- తోటి మహిళా కానిస్టేబుల్‌పై ఎస్ఐ దారుణం
- రాష్ట్ర ప్రభుత్వం సీరియస్
- విధుల నుంచి తొలగింపు.. 14 రోజుల రిమాండ్ : మల్టీజోన్ ఐజీపీ ఏవి రంగనాథ్ వెల్లడి
- తప్పు చేసిన వారిని క్షమించేది లేదు : మంత్రి శ్రీధర్‌బాబు



(ఫైల్)

నవతెలంగాణ-మహాదేవపూర్

ప్రజలకు రక్షణగా నిలవాల్సిన బాధ్యత గల పోలీస్ అధికారి భక్షకుడిగా మారాడు. తోటి ఉద్యోగిపైనే దారుణానికి ఒడిగట్టాడు. రివాల్వర్ చూపించి మహిళా కానిస్టేబుల్‌పై రెండుసార్లు లైంగికదాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసు ఉన్నతాధికారులు స్పందించి రాజ్యాంగంలోని ఆర్టికల్ 311 ప్రకారం ఎస్ఐ భవాని సేన్‌ను విధుల నుంచి తొలగించడమే కాకుండా రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్ పరిధి కాళేశ్వరం పోలిస్ స్టేషన్‌లో బుధవారం వెలుగుజూసింది. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. వివరాల్లోకెళ్తే..

మహాదేవపూర్ మండలం కాళేశ్వరం ఎస్ఐ భవాని సేన్‌గౌడ్ తన ఇంటి దగ్గరలో ఉండే ఓ మహిళా కానిస్టేబుల్‌పై కన్నేశాడు. ఈ నేపథ్యంలో ఆమెకు ఫోన్ చేసి "ఇంట్లో జారి పడి కాలు విరిగింది.. లేవలేకపోతున్నాను.. వచ్చి సాయం చేయమని" ప్రాధేయపడ్డాడు. ఇంటికి వచ్చిన ఆమెని సర్వీస్ రివాల్వర్ చూపించి బెదిరించి లైంగికదాడి చేశాడు. ఎవరికైనా చెప్తే ఇదే నీ చివరి రోజు అని బెదిరించాడు. రెండ్రోజుల తర్వాత ...15లో

కన్న తండ్రే కాలయముడు

- కోరిక తీర్చలేదని కడతేర్చాడు

వివరాలు 15లో

కౌలు రైతులకిచ్చిన హామీలు అమలు చేయాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్

- ఖమ్మంలో రాష్ట్ర సదస్సు.. ర్యాలీ




మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

నవతెలంగాణ-తల్లాడ

కౌలు రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ అన్నారు. తల్లాడలో బుధవారం వాసవి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాదినేని రమేష్ అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ కౌలు రైతుల సంఘం రాష్ట్ర సదస్సులో పోతినేని ప్రసంగించారు. ప్రతి అరగంటకూ ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నారని, మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షా 67 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో 60శాతం మంది కౌలు రైతులేనని తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులను గుర్తిస్తామని, పంట బీమా ఇస్తామని వాగ్దానం చేసి వాటిని అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం కౌలుదారులను గుర్తించి కార్డులు ఇచ్చి ఎకరాకు రూ.7500 ఖాతాల్లో జమ చేసిందన్నారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంబించిన బీజేపీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. రైతాంగ పోరాటాలు జరిగిన రాష్ట్రాల్లో ఎన్నికల్లో బీజేపీకి ఎదురు దెబ్బ తగిలిందని, 20 శాతం ఓట్లను కోల్పోయిందని చెప్పారు. ఆ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని న్యాయమైన హక్కుల సాధన కోసం కౌలు రైతులు సంఘటితంగా పోరాడి హక్కులను సాధించాలని పిలుపునిచ్చారు.

సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో రెండు సంవత్సరాలు కౌలు రైతులకు ...5లో

పెరిగిన హత్యలు, లైంగికదాడులు



ఇకనైనా కండ్లు తెరవండి.. : ప్రభుత్వానికి మాజీమంత్రి హరీశ్ హితవు

- రాష్ట్రంలో పరిస్థితులపై ఆందోళన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో హత్యలు, లైంగికాదాడులు, అఘాయిత్యాలు, హింసాత్మక ఘటనలు పెరిగిపోతున్నాయని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లా ఉట్కూరు, హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలే ఇందుకు నిదర్శమని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా కండ్లు తెరవాలంటూ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి హితవు పలికారు. పెద్దపల్లి జిల్లాలో ఆరేండ్ల చిన్నారిపై లైంగికదాడి, హత్య ఘటనను మరిచిపోకముందే భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఎస్ఐ... మహిళా కానిస్టేబుల్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చిందని గుర్తు చేశారు. ఇలాంటి చర్యలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి, బాధ్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత పదేండ్లలో శాంతి భద్రతలకు చిరునామాగా మారిన తెలంగాణలో... ఇప్పుడు భయానక పరిస్థితులు నెలకొన్నాయని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటర్ విద్యపై సర్కారు నిర్లక్ష్యం...

ఇంటర్ విద్యపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని ...5లో

పింఛన్ మహో ప్రభో

డబ్బులందక రెండు నెలలు

- మందుగోలీలు లేక దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు
- అల్లాడుతున్న వృద్ధులు, వికలాంగులు
- సాయం కోసం ఒంటరి మహిళలు, వృత్తిదారులు
- చేయూత కింద రూ.4-6 వేల పింఛన్ ఎప్పుడో

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వికలాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, వృత్తిదారులు ఇలా ఏ ఆసరా లేనోళ్లంతా సర్కార్ పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. పింఛన్ పైసలొస్తే రోగానికి మందుగోలీలు, నాలుగు మెతుకులు దొరుకుతాయని ఆశతో ఉన్నారు. కానీ రెండు నెలలుగా వారికి పింఛన్ అందడం లేదు. అధికారంలోకి వస్తే చేయూత కింద రూ. 4 వేల పింఛన్ ఇస్తామన్న మాట పక్కన పెట్టి గతం నుంచీ ఇస్తున్న రూ.2 వేల పింఛన్ కూడా ఇవ్వడం లేదు. దీంతో పింఛన్ చేతికందక పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీగా మందులు, ఇంజక్షన్స్, వ్యక్తిగత అవసరాలకు చేతిలో చిల్లిగవ్వ లేక మనోవేదనకు గురవుతున్నారు. బ్యాంక్ ఖాతాలో పైసలు ఎప్పుడు పడతాయోనని ఎదురు చూస్తున్నారు.



రాష్ట్రంలో వివిధ రకాల పింఛన్‌దారులు

వృద్ధులు	1598729
వితంతువులు	1506707
వికలాంగులు	503613
బీడీ కార్మికులు	424585
ఒంటరి మహిళలు	142394
గీత కార్మికులు	65307
చేనేత కార్మికులు	37145
హెచ్ఐవీ బాధితులు	35998

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఏ ఆసరా లేని వాళ్లకు చేయూతనందించాలనే ఉద్దేశంతో అప్పటి పాలకులు పింఛన్ పథకాన్ని ప్రవేశపెట్టారు. సమాజంలో స్వశక్తితో తమ అవసరాలు తీర్చుకోలేక ఇతరుల ఆర్థిక సాయం ఉంటే తప్ప జీవితాల్ని నెట్టుకురాలేని పరిస్థితుల్లో ఉన్న వివిధ వర్గాల ప్రజలకు ప్రభుత్వం పింఛన్ అందజేస్తోంది. రూ.75తో ప్రారంభమైన పింఛన్ కాస్త తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో రూ.2016 అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం ...6లో

కొత్త నేర చట్టాలను వెనక్కి తీసుకోవాలి

వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే నేరమా? : ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజల హక్కులకు నష్టం చేకూర్చే మూడు కొత్త నేర చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. పౌర హక్కులను మరింతగా అణిచివేసే కొత్త నేర చట్టాలు ఎవరి ప్రయోజనాల కోసం? అనే అంశంపై బుధవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మహిళా, ట్రాన్స్‌జెండర్ల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జూలై ఒకటో తేదీ నుంచి ఐపీసీ-1860 స్థానంలో భారతీయ న్యాయ సంహిత చట్టం, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీపీసీ)1973 స్థానంలో భారతీయ సురక్ష సంహిత చట్టం(బీఎస్ ఎస్) ఇండియన్ ఎవిడెన్స్ (ఐఈఏ)-1872 స్థానంలో భారతీయ సాక్ష్య అధినియమం(బీఎస్ ఏ) లాంటి ప్రమాదకర చట్టాలు అమల్లోకి రాబోతున్నాయని వివరించారు. భారతీయ సాక్ష్య అధినియమం ప్రకారం సెర్చ్ వారెంట్ లేకుండానే ఇండ్లల్లో సోదాలు నిర్వహించే హక్కును పోలీసులకు కల్పించారని తెలిపారు. దీంతో పాలకులను ప్రశ్నించే వారి ఇండ్లపై రాజకీయ కక్షలో భాగంగా తరుచూ దాడులు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను న్యాయవాదులు వాదించే సమయంలో, న్యాయమూర్తులు తీర్పులను వెల్లడించే సమయంలోనూ పాత చట్టాలను, కొత్త చట్టాలను ముందు పెట్టుకుని చూడాల్సిన పరిస్థితి ఉందనీ, దీంతో గందరగోళం నెలకొనే అవకాశముందని వివరించారు. పాత కేసులను పూర్వ చట్టాల పరిధిలోనే పరిష్కరించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. కొత్త నేర చట్టాలపై ప్రజల్లో విస్తృత ప్రజాభిప్రాయ సేకరణ జరగాలనీ, న్యాయ వ్యవస్థల్లో భాగంగా ఉన్న అన్ని వ్యవస్థల అభిప్రాయాలను సేకరించాలని డిమాండ్ చేశారు. మూడు కొత్త చట్టాలపై పార్లమెంట్లో చర్చించాలనీ, పున:సమీక్షించాలని కోరారు. దేశ ప్రజలను పీడించే కొత్త చట్టాలను అమల్లోకి తీసుకురావడం సరిగాదన్నారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ..మూడు కొత్త నేర చట్టాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం, ప్రజాసమస్యలపై ప్రశ్నించడాన్ని కూడా నేరపూరితంగా చూపెట్టడం దారుణమన్నారు. ఆధునిక అవసరాల రీత్యా చట్టాలను మార్చే సందర్భంలో కొత్త చట్టాల్లో పొందుపరిచే ప్రతి అంశంపైనా చర్చ జరగాలనీ, అంతిమంగా అది ప్రజామోదం పొందేలా చూడాలని ఆకాంక్షించారు. డిజిటల్ సాక్ష్యాలు ఎలా పరిగణనలోకి తీసుకుంటారని ప్రశ్నించారు. డిజిటల్ వేదికగా జరుగుతున్న మోసాలను, తప్పుడు ప్రచారాలను ప్రస్తావించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు లేని సందర్భంలో ఈ చట్టాలు ఆమోదం పొందాయి కాబట్టి అంత చర్చనీయాంశం కాలేదేమో అని అభిప్రాయపడ్డారు. శాంతిభద్రతల విషయం ఉమ్మడి జాబితాలోనిది కాబట్టి రాష్ట్రాలను కనీసం సంప్రదించకుండా, చర్చించకుండా, ప్రజల్లో చర్చకు పెట్టకుండా చట్టాలను తీసుకురావడంపై ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఒకరిద్దరు సీఎంలు అభ్యంతరం తెలిపిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ చట్టాల పేరులో ఉన్న భారతీయతను కూడా తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రశ్నిస్తూ సంస్కృతం పేర్లు పెట్టడమేంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు కేంద్రంలో బలమైన ప్రతిపక్షం ఉన్నందున దీనిపై ప్రజల్లో చర్చపెట్టి దుర్మార్గాన్ని విడమర్చి చెప్పి చైతన్యపరిస్తే పార్లమెంట్ లోపల కూడా చట్టాలను వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి పెరుగుతుందన్నారు. ట్రాన్స్‌జెండర్ల సంఘం నుంచి రచన మాట్లాడుతూ..ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కల్పించామని పాలకులు సమర్థించుకుంటున్నారనీ, వాస్తవానికి అంతకు ముందున్న చట్టాల కంటే ప్రమాదకరంగా, క్రూరస్వభావంతో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ప్రధాన జీవనాధారం అయిన యాచక వృత్తిని నేరపూరితంగా చూపెట్టడం దారుణమన్నారు. తమకే కాకుండా మహిళలకు, సామాన్య పౌరులకు కూడా హాని కలిగించేలా, స్వేచ్ఛను హరించేలా చట్టాలున్నాయని వాపోయారు. మహిళా సంఘాలు, సామాజిక సంఘాల ప్రతినిధులు సంధ్య, విమల, ఝాన్సీ, సజయ, ఖలేదా మాట్లాడుతూ..ప్రజాస్వామిక భావ ప్రకటనా కార్య క్రమాలను కూడా ప్రభుత్వాలు నేరాలుగా చూపెట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కొత్త నేర చట్టాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తే దేశం ఫాసిస్టు రాజ్యంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాలరాజు, వసుంధర, జ్యోతి, కృష్ణకుమారి, పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

స్పెషల్ కమిషనర్ హనుమంతరావు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ చైర్మెన్లు అయిన జిల్లా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.వర్కింగ్ జర్నలిస్టుల కోసం ప్రతి రెండు సంవత్సరాలకోసారి అక్రిడిటేషన్ కార్డులను రాష్ట్ర సమాచార శాఖ జారీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ గడువు ఈ నెల జూన్ 30తో ముగుస్తుండగా, ఆ గడువు తేదీని సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్టు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రశ్నిస్తే కేసులా..?:టీజేఎఫ్

నవతెలంగాణ -హైదరాబాద్

ప్రజాసమస్యలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతే కేసులు పెట్టడాన్ని తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్(టీజేఎఫ్) ఖండించింది. విద్యుత్ సమస్యను ఎక్స్ వేదికగా సర్కారు దృష్టికి తీసుకుపోయిన జర్నలిస్టు రేవతిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయడాన్ని ప్రశ్నించింది. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా జర్నలిస్టులు ప్రయత్నం చేస్తారని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె రవికుమార్, ఉప ప్రధాన కార్యదర్శి మహేశ్వరం మహేంద్ర తెలిపారు.

కరీంనగర్ బస్‌స్టేషన్‌లో పుట్టిన చిన్నారికి జీవితకాలం ఉచిత బస్‌పాస్

మానవత్వం చాటిన ఆర్టీసీ సిబ్బందికి సజ్జనార్ సన్మానం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కరీంనగర్ బస్టేషన్‌లో పుట్టిన చిన్నారికి ఆర్టీసీ బస్సుల్లో జీవితకాలం ఉచితంగా ప్రయాణించేలా బస్‌పాస్‌ను అందిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్‌ఆర్టీసీ) యాజమాన్యం ప్రకటించింది. ఆర్టీసీ బస్సులు, బస్టేషన్లలో పుట్టిన పిల్లలకు జీవిత కాలం ఉచిత బస్‌పాస్‌ను ఇవ్వాలని గతంలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు కరీంనగర్ బస్టాండ్‌లో పుట్టిన ఆడపిల్లకు బర్త్ డే గిఫ్ట్‌గా లైఫ్ టైం ఫ్రీ బస్ పాస్‌ను మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. కరీంనగర్ బస్ స్టేషన్ లో పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణికి చీరను అడ్డుకట్టి కాన్పు చేసి, మానవత్వం చాటిన ఆర్టీసీ సిబ్బందిని బుధవారం హైదరాబాద్ బస్‌భవన్‌లో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ ఘనంగా సన్మానించారు. ఈ నెల 16న కుమారి అనే గర్భిణీ, భర్తతో కలిసి భద్రాచలం బస్సు కోసం కరీంనగర్ బస్టేషన్‌కు వచ్చారు. అక్కడ ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన ఆర్టీసీ సిబ్బంది వెంటనే 108కు కాల్ చేసి సమాచారం ఇచ్చి, చీరలను అడ్డుపెట్టి నార్మల్ డెలివరీ చేయగా ఆడపిల్ల పుట్టింది. అనంతరం అంబులెన్స్ సాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లిబిడ్డా క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి, సకాలంలో కాన్పు చేసిన ఆర్టీసీ సిబ్బంది సైదమ్మ, లావణ్య, స్రవంతి, భవాని, రేణుక, రజనీ కృష్ణ, అంజయ్యలను టీజీఎస్‌ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ మెచ్చుకున్నారు. ఆపద సమయంలో సేవాతత్పరతను చాటడం గొప్ప విషయమని చెప్పారు. ఈ సన్మాన కార్యక్రమంలో సంస్థ సీవోవో డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, చీఫ్ పర్సనల్ ఆఫీసర్ ఉషారాణి పాల్గొన్నారు.

నకిలీ సిమ్‌కార్డుల అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

వారి నుంచి పెద్ద ఎత్తున నకిలీ సిమ్‌లు స్వాధీనం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

నకిలీ సిమ్‌కార్డులతో పాటు బ్యాంకు అకౌంట్‌లను ట్యాగ్‌చేసి సైబర్‌క్రైమ్ నేరస్తులకు పెద్దఎత్తున విక్రయిస్తున్న ముఠా గుట్టును రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు రట్టు చేశారు. సుభానీ, నవీన్, ప్రేమ్‌కుమార్ అనే ముగ్గురు సభ్యులను అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి పెద్దఎత్తున సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. సీఐడీ అదనపు డీజీ సికాగోయల్ తెలిపిన వివరాల ప్రకారం...నకిలీ సిమ్‌కార్డులను తయారుచేస్తున్న ముఠా గురించి సమాచారం అందగానే సీఎస్‌బీకి చెందిన ఎస్పీ కేవీ ప్రసాద్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం రంగంలోకి దిగింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు చెందిన సుభానీ, నవీన్, ప్రేమ్‌కుమార్ సిమ్‌కార్డులను తయారుచేసేవారు. అదే సమయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సైబర్ నేరస్తుల నుంచి కూడా వాటిని కొనుగోలు చేసేవారు. వాటిని దుబాయికి చెందిన సైబర్ నేరస్తుడు విజయ్‌కు అమ్మేవారు. వాటిని తీసుకెళ్లడానికే విజయ్ తరుచూ హైదరాబాద్ వచ్చి వివిధ వ్యక్తుల బ్యాంకు అకౌంట్ పుస్తకాలను, సిమ్‌లను తీసుకెళ్లేవాడు. వాటికిగానూ ఒక్కోదానికి రూ.500 నుంచి రూ.1500 దాకా చెల్లించేవాడు. వాటిని చైనా, సింగపూర్, కాంబోడియా దేశాలకు చెందిన సైబర్ నేరస్తులకు విక్రయించేవాడు. ఈ విధంగా తయారు చేసిన నకిలీ సిమ్‌కార్డులు, బ్యాంక్ అకౌంట్ పుస్తకాల ఆధారంగా సైబర్‌నేరస్తులు పెద్దమొత్తంలో మోసాలకు పాల్పడేవారని తేలింది.

ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను తిరిగి పంపండి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి టీఎన్జీవో వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న తెలంగాణకు చెందిన 144 మంది ఉద్యోగులను స్వరాష్ట్రానికి తిరిగి పంపించాలని టీఎన్జీవో కేంద్ర సంఘం ఏపీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను బుధవారం అమరావతిలోని సచివాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. కమల్‌నాథన్ కమిటీ సిఫారసుల మేరకు తెలంగాణకు చెందిన 144 మంది ఉద్యోగులను ఏపీకి కేటాయించారని తెలిపారు. వారిని తిరిగి తెలంగాణకు పంపించాలని కోరారు. ఏపీ సీఎస్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ఎం సత్యనారాయణగౌడ్, కోశాధికారి రామినేని శ్రీనివాసరావు, నగర శాఖ అధ్యక్షులు కట్కూరి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, ఈ కొండల్‌రెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు మహేందర్, ఖాజా, రజనీ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో కులగణన చేపట్టాలి

కేంద్ర ప్రభుత్వానికి డిప్యూటీ సీఎం భట్టి డిమాండ్

దేశ సంపద అన్ని వర్గాలకు అందుతుంది

అప్పులు చేసైనా సంపద సృష్టిస్తాం... పేదలకు పంచుతామని వ్యాఖ్య



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ సర్కారు కుల గణన చేపట్టాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. అది విప్లవాత్మకమైన మార్పు అవుతుందని చెప్పారు. అలా చేస్తే జనాభా ప్రాతిపదిక అన్ని వర్గాలకు దేశ సంపద అందుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో అప్పులు చేసైనా సంపద సృష్టిస్తామనీ, ఆ సంపద ద్వారా పేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తామని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నాయకులు శివసేనారెడ్డి, అన్వేష్‌రెడ్డి, భవానిరెడ్డి, సంగిశెట్టి జగదీష్, డాక్టర్ లింగం యాదవ్, పద్మతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. మహిళా సంఘాలకు ఐదేండ్లలో లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలందిస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారి సమగ్ర వివరాలు అధిష్టానం వద్ద ఉన్నాయని చెప్పారు. త్వరలోనే అలాంటి నాయకులకు పార్టీ పదవులు అందుతాయని భరోసా ఇచ్చారు. ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేయాలనే వాగ్దానానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ విషయంలో ఎవరికి ఎలాంటి అనుమానాలు అక్కర్లేదన్నారు. కులగణన ద్వారా ఆయా వర్గాలను పరిపాలనలోనూ భాగస్వాములను చేయాలనేది తమ పార్టీ విధానమని చెప్పారు. మేడిగడ్డలో మేట వేసిన ఇసుకను తొలగిస్తేనే మరమ్మతు పనులు ప్రారంభమవుతాయని పునరుద్ఘాటించారు. కేంద్ర బడ్జెట్ ఆధారంగా రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడతామని చెప్పారు. విద్యుత్ కొనుగోళ్లపై న్యాయ విచారణ జరగాలంటూ నిండు సభలో మాజీ విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కోరారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం దానిపై న్యాయ విచారణకు ఆదేశిస్తే ఎందుకు ఉలిక్కి పడుతున్నారని ప్రశ్నించారు. దేశంలోని వనరులను దామాషా ప్రకారం పంచాలనే లక్ష్యంతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సుదీర్ఘ పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మన రాష్ట్రంలోనూ ఆయన ఆలోచనలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. రాహుల్ జన్మదినం సందర్భంగా మరోసారి ఈ విషయాన్ని చెబుతున్నట్టు తెలిపారు.

నేటినుంచి పాలిసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్

22 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

27 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశం

30న తొలివిడత సీట్ల కేటాయింపు

118 పాలిటెక్నిక్ కాలేజీల్లో 26,412 సీట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు పాలిసెట్ ప్రవేశాల కన్వీనర్, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం నుంచి ఈనెల 24 వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించొచ్చనీ, ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 22 నుంచి 25 వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. అదేనెల 22 నుంచి 27 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని పేర్కొన్నారు. ఈనెల 30న తొలివిడత పాలిసెట్ ప్రవేశాలకు సీట్లను కేటాయిస్తామని తెలిపారు. అదేనెల 30 నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకు ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం హ్‌జుం:7/స్రజూశీశ్రీఎవ్.అఐఏ.ఐఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. రాష్ట్రంలో 118 పాలిటెక్నిక్ కాలేజీల్లో 26,412 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో 24 కోర్సులున్నాయని తెలిపారు. డిప్లొమా ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)లో అత్యధికంగా 6,118 సీట్లు, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ)లో 5,203 సీట్లు, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ)లో 5,178 సీట్లు, అత్యల్పంగా డిప్లొమా ఇన్ ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్‌లో 40 సీట్లున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పాలిసెట్‌కు 92,808 మంది దరఖాస్తు చేస్తే, 82,809 మంది అభ్యర్థులు రాతపరీక్షకు హాజరయ్యారు. వారిలో 69,728 (84.20 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. 26,412 సీట్లుంటే, 69,728 మంది ఉత్తీర్ణులైన అభ్యర్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొంటున్నారు.

'ఒబెసిటీ' జాగ్రత్త...!



మందులకు ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి

- అనధికారిక మార్కెట్‌లోనూ జోరుగా విక్రయాలు
- విదేశాల నుంచి ఆన్‌లైన్‌లో దిగుమతులు
- ఖర్చు మాత్రం ఎక్కువే
- తక్కువ ధరకే లభిస్తున్న ప్రత్యామ్నాయ మందులు

న్యూఢిల్లీ : ఒబెసిటీతో బాధపడుతున్న వారి సంఖ్య మన దేశంలో అధికంగానే ఉంటోంది. ఈ సమస్య నివారణకు వైద్యులు అనేక రకాల చికిత్సలు చేస్తుంటారు. అయితే అధిక బరువును తగ్గించేందుకు ఒజెంపిక్ వంటి కొన్ని మందులు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. వీటి ఖరీదు మాత్రం చాలా ఎక్కువే. అయినప్పటికీ వీటి కోసం సెలబ్రిటీలు, సంపన్నులు ఎగబడుతుంటారు. కానీ ఇవి అంత తేలికగా లభించవు. అనధికారికంగా నడుస్తున్న ఔషధ మార్కెట్లలోనే ఇవి దొరుకుతాయి. 2030 నాటికి ఈ మందుల మార్కెట్ 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని ఓ పరిశోధనా సంస్థ అంచనా వేసింది.

ఒబెసిటీని తగ్గించే మందులు ఇప్పట్లో మన దేశంలో విరివిగా అందుబాటులోకి వచ్చే అవకాశాలు లేవు. అంతర్జాతీయ మార్కెట్‌లో వీటి సరఫరాలు తగినంతగా లేకపోవడమే దీనికి కారణం. ఈ మందుల కోసం ఇప్పుడు మన దేశంలోని సంపన్నులు ఎగబడుతున్నారు. ఇవి అనధికారిక (గ్రే) మార్కెట్‌లోనే దొరుకుతాయి. ఈ మార్కెట్‌లో విదేశాల నుండి దిగుమతి చేసుకున్న మందులు, ప్రత్యామ్నాయ మందులు లభిస్తాయి. వీటిని వాడితే అనారోగ్యం తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ ఎవరూ ఖాతరు చేయడం లేదు.

మూడో స్థానంలో భారత్

ప్రపంచంలో చైనా, అమెరికా తర్వాత మన దేశంలోనే ఒబెసిటీ వ్యాధిగ్రస్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. భారత్‌లో ఎనిమిది కోట్ల మంది ఒబెసిటీతో, 22.5 కోట్ల మంది అధిక బరువుతో బాధపడుతున్నారు. అంతేకాదు...11 శాతం మంది మధుమేహంతో, 15 శాతం మంది ప్రీ-డయాబెటిక్‌తోనూ బాధపడుతున్నారు. మరణాలకు కారణమవుతున్న వ్యాధుల్లో కిడ్నీ వ్యాధి ఎనిమిదో స్థానంలో ఉంది.

ప్రిస్క్రిప్షన్ల కోసం...

అధిక బరువు తగ్గే మందుల కోసం సెలబ్రిటీలు, సంపన్నులు, ఇతర దేశాల్లో నివసిస్తున్న భారతీయులు ఎక్కువగా క్యూ కడుతున్నారని న్యూఢిల్లీకి చెందిన వైద్యురాలు డాక్టర్ అంజలి హూడా చెప్పారు. 20 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల వయసు కలిగిన మహిళలు ఈ మందుల ప్రిస్క్రిప్షన్లు అడుగుతున్నారని ఆమె తెలిపారు. గత ఆరు నెలల్లో ఇలా వందలాది మంది ప్రిస్క్రిప్షన్లు అడిగారని అన్నారు. ఇప్పటికే ఒజెంపిక్ మందు వాడిన ఓ యువ పేషెంట్ మరో నాలుగు కిలోల బరువును త్వరగా కోల్పోవడానికి తనను ఆ మందు ప్రిస్క్రిప్షన్ అడిగాడని, తాను నిరాకరించానని చెప్పారు.

ఈ మందులే వాడతారు

2017 చివర్లో నోవో కంపెనీ ఒజెంపిక్ మందును మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. ఇది సాధారణంగా మధుమేహ రోగుల కోసం ఉద్దేశించిందే అయినప్పటికీ బరువు తగ్గడానికి కూడా వాడతారు. ఆ తర్వాత ఈ కంపెనీ కేవలం ఒబెసిటీ కోసం వెగోవీ అనే మందును కనిపెట్టింది.

ఈ రెండు మందుల కారణంగా ఆ కంపెనీకి కోట్లాది రూపాయల ఆదాయం వచ్చి పడింది. ఎలి లిల్లీ అనే మరో కంపెనీ గత సంవత్సరం డిసెంబరులో జెప్‌బౌండ్ మందును అమ్మడం మొదలు పెట్టింది. ఒజెంపిక్‌ను భారత్‌లో విక్రయించే ఆలోచన ఏదీ నోవో కంపెనీకి లేదు. వెగోవీ మందును మాత్రం భారతీయ మార్కెట్‌లో ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఒబెసిటీ కోసం నోవో నార్డిస్క్ కంపెనీ తయారు చేసిన రిబెల్సస్ పిల్ మాత్రమే ప్రస్తుతం మన దేశంలో అందుబాటులో ఉంది. దీనిని 2022 నుంచి విక్రయిస్తున్నారు. అయితే ఇంజక్షన్ రూపంలో లభిస్తున్న ఇతర బ్లాక్‌బస్టర్ మందులతో పోలిస్తే దీని సమర్థత కొంత తక్కువగానే ఉంటోంది.

ఎలా దొరుకుతుంది?

ప్రిస్క్రిప్షన్ ఉన్న రోగుల కోసం ఔషధ పంపిణీదారులు ఇంజక్షన్ రూపంలో ఉండే ఒబెసిటీ మందులను యూరప్ వంటి ప్రదేశాల నుంచి దిగుమతి చేసుకొని అమ్ముతున్నారు. అయితే ఇది చాలా ఖరీదైన వ్యవహారం. నెలకు సరిపడా మందులు కావాలంటే కనీసం 1,200 డాలర్లు ఖర్చు చేయాల్సిందే. ఇండియా మార్ట్ ఇంటర్‌మెష్ లిమిటెడ్, ఎక్స్‌పోర్టర్స్‌ఇండియా.కామ్ వంటి వేదికల ద్వారా దిగుమతిదారులు ప్రత్యామ్నాయ మందులను బుక్ చేసుకుంటారు. గ్రే మార్కెట్‌లో నెలకు సరిపడా ఒబెసిటీ మందు సుమారు పది వేల రూపాయలకే దొరుకుతుంది.

అమెరికా ధరలో ఇది పదో వంతు మాత్రమే. ఢిల్లీ, ముంబయి నగరాలకు చెందిన కొందరు మందుల షాపుల యజమానులు యూఏఈ, ఈజిప్ట్ నుంచి ఇంజక్షన్లను పెద్ద ఎత్తున తెప్పించి యిస్తున్నారు.

ఈ కంపెనీలు కూడా...

వెగోవీ మందుకు ప్రత్యామ్నాయంగా బంగ్లాదేశ్‌లో తయారవుతున్న ఫిటారో మన దేశంలో అధికారికంగా మార్కెట్ కాకపోయినప్పటికీ ఆన్‌లైన్ విక్రేతలు దానిని కొనుగోలుదారులకు సరఫరా చేస్తున్నారు. మన దేశంలో దొరికే రిబెల్సస్ పిల్ ఖరీదు 43 డాలర్లు. ఇది పది రోజులకు సరిపోతుంది. దేశంలో దీని అమ్మకాలు ఏప్రిల్‌తో ముగిసిన 12 నెలల కాలంలో 150 శాతం పెరిగాయి. బెంగాల్‌కు చెందిన ఓ రచయిత ఈ మందును వాడి ఏడు నెలల్లో 24 కిలోల బరువు తగ్గింది. మన దేశంలో వచ్చే సంవత్సరం నుంచి ఇంజక్షన్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఎలి లిల్లీ కంపెనీ మౌంజారో పేరుతో ఓ ఇంజక్షన్‌ను విడుదల చేయాలని చూస్తోంది. మన దేశంలో స్థానికంగా చూస్తే సన్ ఫార్మస్యూటికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ బరువు తగ్గించే మందును అభివృద్ధి చేస్తోంది. సిప్లా, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ సంస్థలు జెనరిక్ మందులపై పరిశోధనలు చేస్తున్నాయి. బయోకాన్ లిమిటెడ్, గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ కంపెనీలు ఇప్పటికే జనరిక్ మందుల తయారీలో ముందున్నాయి.

ఏదేమైనా ఒబెసిటీ నివారణ మందులను వైద్య నిపుణుల పర్యవేక్షణలోనే వాడాలని, అన్నింటికంటే ముఖ్యంగా అధిక బరువును తగ్గించుకోవడానికి ఇతర ప్రత్యామ్నాయ పద్ధతులు అనుసరిస్తే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

జులై 3 వరకు కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు జులై 3 వరకు పొడిగించింది. అయితే కేజ్రీవాల్ కస్టడీని పొడిగించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కోర్టును కోరింది. తదుపరి విచారణకు కేజ్రీవాల్ కస్టడీపై ఈడీ వాదనలు వినిపించింది. అయితే, ఆ వాదనలను కేజ్రీవాల్ తరపు న్యాయవాది వివేక్ జైన్ కొట్టిపడేశారు. ఈడీ కస్టడీ పొడిగింపు పిటిషన్ 'యోగ్యత లేనిది' అని పేర్కొన్నారు. మద్యం స్కాం కేసులో కేజ్రీవాల్‌ను ఈడీ మార్చి 21న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత నుంచి జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జైలులో ఉంటున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. ఆ తరువాత మరికొద్ది రోజులు మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని కోరగా, సుప్రీంకోర్టు నిరాకరించింది. దాంతో ఆయన మళ్లీ జూన్ 2న జైలులో లొంగిపోయారు. మరో వైపు ఇదే కేసులో నిందితుడు వినోద్ చౌహాన్ కస్టడీని జులై 3 వరకు పొడిగించారు. చౌహాన్‌ను మేలో అరెస్టు చేశారు.

నీటి సంక్షోభాన్ని తక్షణమే పరిష్కరించాలి

- మా వాటా నీళ్లివ్వకుంటే సత్యాగ్రహ దీక్ష
- 21 నుంచి నిరవధిక దీక్షకు దిగుతాం

ప్రధాని మోడీకి ఢిల్లీ మంత్రి అతిషి లేఖ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధానిలో కొనసాగుతున్న నీటి సంక్షోభాన్ని తక్షణమే పరిష్కరించకుంటే శుక్రవారం నుంచి నిరవధిక దీక్షకు దిగుతానని ఢిల్లీ రాష్ట్ర మంత్రి అతిషి అన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాశారు. ఢిల్లీ ప్రజానీకం ఎదుర్కొంటున్న నీటి కొరత, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వాటి పరిష్కారానికి తక్షణమే ప్రధాని జోక్యం చేసుకోవాలని కోరారు. బుధవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అతిషి తెలిపారు. "ఈరోజు ప్రధాన మంత్రికి నేను లేఖ రాశాను. ఢిల్లీలోని 28 లక్షల మంది ప్రజానీకానికి నీళ్లు రావడం లేదనే విషయాన్ని విన్నవించాను. సాధ్యమైనంత త్వరగా ప్రజలకు నీరందేలా సాయం చేయాలని కోరాను. 21 నాటికల్లా ఢిల్లీ ప్రజలకు దక్కాల్సిన నీటి వాటా రాకుంటే సత్యాగ్రహ దీక్షకు దిగడం మినహా మరో మార్గం లేదు" అని అతిషి తెలిపారు. జలాలకు సంబంధించిన సింహ భాగం వాటాను హర్యానా విడుదల చేయకపోవడంతో ఢిల్లీ నీటి సంక్షోభంలో పడిందన్నారు. మంగళవారం 613 మిలియన్ గ్యాలన్స్ పర్ డే(ఎంజీడీ)కు గాను 513 ఎంజీడీ జలాలను మాత్రమే హర్యానా విడుదల చేసిందని, ఒక్క ఎంజీడీ జలం 28,500 మందికి వెళ్తుందని, ఆ ప్రకారం 28 లక్షల మందికి నీరు అందడం లేదని ఆమె వివరించారు. ఢిల్లీ ప్రజలు తీవ్రమైన ఎండలతో పాటు నీటి కొరతను కూడా ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈ విషయాన్ని ప్రధాని దృష్టికి తెచ్చానని, రెండ్రోజుల్లోగా నీటి సమస్య పరిష్కరించకుంటే నిరవధిక నిరాహార దీక్షకు వెళ్తానని చెప్పారు. హర్యానా ప్రభుత్వానికి కూడా సమస్య పరిష్కారం కోసం చాలా లేఖలు రాసినట్టు తెలిపారు.

ఆప్ సర్కార్‌పై బీజేపీ ఎదురుదాడి

మరోవైపు, ఢిల్లీలో నీటి సంక్షోభానికి ఆప్ ప్రభుత్వమే కారణమంటూ బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్ర విభాగాలు నిరసనలు కొనసాగిస్తున్నాయి. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్, ఎంపీ బన్సూరి స్వరాజ్ బుధవారం ఇందిరా క్యాంప్ ఏరియాలో నిరసనలు చేపట్టారు. హర్యానా ప్రభుత్వం పూర్తి నీటి వాటాను యమునా నదిలోకి వదిలిందని, అయితే జలాలు ఢిల్లీలోకి అడుగుపెట్టగానే ట్యాంకర్ మాఫియా ఆ నీళ్లు దొంగిలిస్తోందని చెప్పారు. ట్యాంకర్ మాఫియాకు ఆప్ మంత్రులు, ఎమ్మెల్యేలు కొమ్ముకాస్తుండడమే ఇందుకు కారణమని సచ్‌దేవ ఆరోపించారు.

బాబు మార్పు..కూర్పు షురూ..

- శ్రీలక్ష్మి, ప్రవీణ్ ప్రకాశ్ జీఏడీకి అటాచ్..
- భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

అమరావతి: చంద్రబాబు సీఎం అయ్యాక..మార్పులు షురూ అయ్యాయి. మంత్రివర్గ విస్తరణ పూర్తయ్యాక.. వైఎస్ జగన్ హయాంలో చక్రం తిప్పిన అధికారులకు బదిలీ వేటు పడింది. ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఐఏఎస్‌లు బదిలీ అయ్యారు. పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌లను జీఏడీకి అటాచ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సాయిప్రసాద్, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శిగా శశిభూషణ్ కుమార్, వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, కార్మికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా గోపాలకృష్ణ ద్వివేది, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్ సింఘాల్, పౌరసరఫరాలశాఖ కమిషనర్‌గా సిద్ధార్థ్ జైన్, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా సౌరభ్‌గౌర్, నైపుణ్యాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శిగా సౌరభ్‌గౌర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శిగా కోన శశిధర్, ఐటీ, ఆర్టీజీఎస్ కార్యదర్శిగా కోన శశిధర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెట్టారు. ఉద్యాన, మత్స్యశాఖ సహకార విభాగాల కార్యదర్శిగా ఎ.బాబు, ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్‌గా కాటమనేని భాస్కర్, ముఖ్యమంత్రి కార్యదర్శిగా ప్రద్యుమ్న, ఆర్థిక వ్యయ విభాగం కార్యదర్శిగా ఎం. జానకి, పశు సంవర్ధకశాఖ కార్యదర్శిగా ఎం.ఎం.నాయక్, గనులశాఖ డైరెక్టర్, కమిషనర్‌గా ప్రవీణ్‌కుమార్, ఏపీఎండీసీ ఎండీగా ప్రవీణ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. మురళీధర్‌రెడ్డిని జీఏడీకి రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశాలు వచ్చాయి. ఆర్థికశాఖ కార్యదర్శిగా వి.వినయ్ చంద్‌ను నియమిస్తూ సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

దూషణలు.. దాడులు అయినా.. తట్టుకొని నిలిచిన రాహుల్

కాంగ్రెస్ అగ్రనాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన 'ఇండియా'



న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ 54వ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఇండియా కూటమిలోని పలు పార్టీల అధినేతలు, నాయకులు ఆయనకు విష్ చేశారు. రాజకీయాల్లో అనేక దూషణలు, దాడులు ఎదురైనా వాటిని తట్టుకొని ఆయన నిలబడ్డారని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాజ్యాంగం పట్ల రాహుల్ గాంధీ ధృఢమైన అంకితభావాన్ని, అణగారిన వర్గాల పట్ల ఆయనకున్న ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ సభ్యులందరూ భారీ వేడుకలకు దూరంగా ఉండాలనీ, బదులుగా దాతృత్వం, ఇతరులకు సహాయం చేయటంపై దృష్టి పెట్టాలని కోరారు.

ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక ప్రకటనలో.. ఖర్గే రాహుల్ గాంధీకి తన పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. "భిన్నత్వం, సామరస్యం, కరుణలో ఏకత్వం అనే కాంగ్రెస్ పార్టీ తత్వం మీ అన్ని చర్యలలో కనిపిస్తుంది. మీరు సుదీర్ఘమైన, ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షిస్తున్నాను" అని ఖర్గే ముగించారు.

తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె స్టాలిన్ రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఆయనను 'ప్రియమైన సోదరుడు' అని పిలుస్తూ, దేశ ప్రజల పట్ల ఆయన అంకితభావాన్ని కొనియాడారు.

యూపీ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్ కూడా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూడా రాహుల్‌కు విషెస్ చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు అండగా నిలవాలనే ఆయన నిబద్ధతను సీఎం ఎత్తిచూపారు. రాహుల్ గాంధీ నాయకత్వ లక్షణాలను గుర్తిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆయన పుట్టినరోజు శుభాకాంక్షలను 'ఎక్స్'లో తెలియజేసింది.

డైలమాకు ఎండ్ కార్డ్

- వయనాడ్‌కు రాహుల్ గాంధీ రాజీనామా
- యూపీలోని రాయ్‌బరేలీ ఎంపీగానే కొనసాగనున్న కాంగ్రెస్ అగ్రనేత
- వయనాడ్ నుంచి బరిలో ఆయన సోదరి ప్రియాంక

న్యూఢిల్లీ : కొన్ని రోజుల పాటు కొనసాగుతున్న డైలమాకు ఎండ్ కార్డ్ పడింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏ నియోజకవర్గ ఎంపీగా కొనసాగుతున్నది తేలిపోయింది. ఆయన కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి అధికారికంగా రాజీనామా చేశారు. యూపీలోని రాయ్‌బరేలీ ఎంపీగా కొనసాగనున్నారు. కాగా, వయనాడ్ ఎంపీ స్థానం నుంచి రాహుల్ సోదరి ప్రియాంక గాంధీ పోటీ చేయనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ రెండు స్థానాల్లో పోటీ చేశారు. ఒకటి వయనాడ్, మరోకటి రాయ్‌బరేలీ. ఈ రెండు స్థానాల్లో ఆయన బంపర్ మెజారిటీతో గెలిచారు రాహుల్. కానీ, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం రెండింటిలో ఏదో ఒక స్థానాన్ని మాత్రం రాహుల్ వదులుకోవాలి. దీంతో ఫలితాలు వచ్చిన రోజు నుంచి రాహుల్ ఏ స్థానానికి రాజీనామా చేస్తారు అనేదాని పైనే చర్చ జరిగింది. చివరగా, కాంగ్రెస్ ఈ విషయాన్ని తేల్చేసింది. రాహుల్ రాయ్‌బరేలీ ఎంపీగానే కొనసాగుతారనీ, వయనాడ్ నుంచి ప్రియాంక గాంధీ బరిలోకి దిగుతారని పేర్కొన్నది. దీంతో ఈ విషయానికి తెర పడినట్టయ్యింది.కాగా, యూపీలోని రాయ్‌బరేలీ అనేది ఏండ్లుగా గాంధీ కుటుంబానికి కంచుకోటగా, సెంటిమెంట్‌గా ఉన్నది. రాహుల్ తాత ఫిరోజ్ గాంధీ 1952లో రాయ్‌బరేలీ నుంచే పోటీ చేశారు. 1967లో ఇందిరాగాంధీ ఇక్కడి నుంచి మొదటిసారి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత 1971, 1980లో రాయ్‌బరేలీలో మళ్లీ గెలిచారు. 1989, 1991, 1999లో జరిగిన ఎలక్షన్స్‌లో కూడా ఈ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకున్నది. ఇక 2004 నుంచి 2024 వరకు సోనియాగాంధీ రాయ్‌బరేలీ ఎంపీగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో రాహుల్ గాంధీ పోటీ చేసి ఏకంగా 4 లక్షలకు పైగా మెజార్టీ సాధించారు. అందుకే ఈ నియోజకవర్గంతో గాంధీ కుటుంబానికి ప్రత్యేకమైన ఎమోషనల్ బాండింగ్ ఉన్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అలాగే, 2029లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల కంటే ముందు యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తదుపరి కేంద్రంలో ఏ ప్రభుత్వం రాబోతుందో ఈ ఎన్నికలు డిసైడ్ చేయనున్నాయి. అందుకే కాంగ్రెస్ దూరదృష్టితో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది.

26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక



న్యూఢిల్లీ : లోక్‌సభ స్పీకర్ ఎన్నికకు షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 26న సభాపతి ఎన్నిక జరుగుతుంది. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం నుండి ప్రకటన వెలువడింది. ఈ పదవికి ఎన్డీఏ తరపున పోటీ చేసే అభ్యర్థి పేరును ప్రధాని నరేంద్ర మోడీ 25వ తేదీన ప్రకటించే అవకాశం ఉంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఏకాభిప్రాయంతో స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఈసారి స్పీకర్ పదవికి పోటీ తప్పేలా లేదు. తమకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నట్లు సమాచారం. ఒకవేళ దానికి ఎన్డీఏ అంగీకరించకపోతే స్పీకర్ పదవికి అభ్యర్థిని నిలపాలని అవి యోచిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమికి మెరుగైన ఫలితాలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఉప సభాపతి స్థానం కోసం ప్రతిపక్షం డిమాండ్ చేస్తోంది. సంప్రదాయం ప్రకారం ఈ పదవి ప్రతిపక్షానికే చెందుతుంది. 17వ లోక్‌సభలో మాత్రం డిప్యూటీ స్పీకర్ పదవిని ఖాళీగా ఉంచాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది.

లోక్‌సభలో స్పీకర్ పదవికి అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది. విశ్వాస పరీక్షల సమయంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారు. అనర్హత పిటిషన్లు వచ్చినప్పుడు ఆయన మాటే వేదవాక్కు. లోక్‌సభలో ఎన్డీఏకు అరకొర మెజారిటీ మాత్రమే ఉందన్న విషయం ప్రతిపక్షాలకు తెలుసు. పైగా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జేడీయూ స్పీకర్ పదవిని ఆశిస్తున్నాయి. ఈ పరిణామం బీజేపీని ఇరకాటంలో పెడుతోంది. మిత్రపక్షాల్లో ఏ మాత్రం అసంతృప్తి చోటుచేసుకున్నా అది సంకీర్ణ ప్రభుత్వంపై ప్రభావం చూపి రాజకీయ సంక్షోభానికి దారితీస్తుంది. అందుకే తమకు ఉప సభాపతి పదవిని ఇవ్వాలని కాంగ్రెస్ పట్టుబడుతోంది. ఏదేమైనా స్పీకర్ పదవిని బీజేపీ తానే తీసుకుంటుందా లేక మిత్రపక్షానికి కేటాయిస్తుందా అనేది వేచి చూడాల్సిందే.

ఎన్నికలు ముగిసి, నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఓం బిర్లాయే స్పీకర్‌గా కొనసాగుతున్నారు. నిబంధనల ప్రకారం నూతన లోక్‌సభ తొలిసారి సమావేశమయ్యేంత వరకూ స్పీకర్ పదవీకాలం కొనసాగుతుంది. అంటే ఎన్నికైన తేదీ నుండి తదుపరి లోక్‌సభ మొదటి సమావేశం జరిగే రోజు వరకూ స్పీకర్ పదవిలో కొనసాగుతారన్న మాట. ఓం బిర్లా వారసుడిపై అనేక ఊహాగానాలు విన్పిస్తున్నాయి. ప్రధానంగా డాక్టర్ రాధా మోహన్ సింగ్, దగ్గుబాటి పురంధేశ్వరి, భర్తృహరి మహతాబ్ పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. రాధా మోహన్ సింగ్ బీజేపీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పురందేశ్వరి ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. మహతాబ్ ఈ ఏడాది మార్చిలోనే బీజేపీలో చేరారు. అంతకుముందు ఆయన బిజూ జనతాదళ్‌లో సీనియర్ నేత. ఇదిలావుండగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసంలో ఎన్డీఏ నేతలు సమావేశమై పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. స్పీకర్ పదవిపై ప్రతిపక్ష నేతలతో చర్చించి ఏకాభిప్రాయం సాధించే బాధ్యతను రాజ్‌నాథ్‌పై పెట్టారు.

హిందూజా కుటుంబానికి చిక్కులు

- సేవకులకిచ్చే జీతం కన్నా.. కుక్క కోసం భారీ ఖర్చు
- మానవ అక్రమ రవాణా, కార్మికులను దోపిడీ చేశారంటూ ఫిర్యాదు
- స్విట్జర్లాండ్‌లో విచారణ ..బ్లూమ్‌బర్గ్ రిపోర్టు



న్యూఢిల్లీ : యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లోని అత్యంత ధనిక కుటుంబానికి చెందిన హిందూజా కుటుంబం మానవ అక్రమ రవాణా, జెనీవాలోని వారి భారతీయ సిబ్బందిని దోపిడీ చేసినందుకు స్విట్జర్లాండ్‌లో విచారణ ఎదుర్కోంటున్నారు. ఈ విషయాన్ని బీబీసీ నివేదించింది. ఈ సమాచారం ప్రకారం.. ప్రకాష్, కమల్ హిందూజా, వారి కుమారుడు అజయ్, ఆయన భార్య నమ్రత అనే నలుగురిపై సోమవారం జెనీవాలో విచారణ ప్రారంభమైంది.వారు తమ పిల్లలను, జెనీవాలోని వారి ఇంటిని చూసుకోవటానికి భారత్ నుంచి కార్మికులను తీసుకువచ్చారు. దీనికి సంబంధించి స్విట్జర్లాండ్‌లో వారిపై కేసు నమోదైంది. హిందూజాలు కార్మికుల పాస్‌పోర్ట్‌లను స్వాధీనం చేసుకున్నారనీ, అనుమతి లేకుండా వారిని ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వలేదని న్యాయవాదులు ఆరోపించినట్టు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. కార్మికులకు జీతాలు భారత్‌లోనే చెల్లించబడుతున్నాయనీ, వారికి ఖర్చు చేసేందుకు స్విస్ ఫ్రాంక్‌లు లేవని ప్రాసిక్యూటర్ వైవ్స్ బెర్టోసా ఆరోపించారు. బ్లూమ్‌బెర్గ్ ప్రకారం.. "వారు తమ సేవకులలో ఒకరి కంటే ఒక కుక్క కోసం ఎక్కువ ఖర్చు చేశారు. హిందూజా ఇంటిలోని ఒక భారతీయ వ్యక్తికి 18 గంటల పని దినానికి 7 స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 660) మాత్రమే చెల్లించారు" అని ఆయన కోర్టుకు తెలిపారు. హిందూజా కుటుంబం వారి కుక్కల కోసం ఏటా 8,584 స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 8,09,326) వెచ్చిస్తున్నట్టు చెబుతూ "పెంపుడు జంతువులు" అనే బడ్జెట్ పత్రాన్ని చూపించాడు.

కాగా, ఆరోగ్య పరిస్థితుల కారణంగా కోర్టుకు హాజరుకాని ప్రకాష్, కమల్ హిందుజాలు కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని న్యాయవాదులు తెలిపారు. అజయ్, నమ్రత హిందూజాలకు నాలుగున్నరేండ్ల జైలు శిక్ష విధించాలని స్విస్ ప్రాసిక్యూటర్లు డిమాండ్ చేశారు. కార్మికులకు తక్కువ వేతనాలు అందుతున్న నేపథ్యంలో సిబ్బందికి వసతి, ఆహారం కూడా అందుతున్నాయని హిందూజా కుటుంబం తరపు న్యాయవాదులు వాదించారు. కాగా, హిందూజాలు ఆటోమోటివ్‌లు, చమురు, బ్యాంకింగ్, ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ వంటి రంగాలలో వ్యాపార సామ్రాజ్యాన్ని కలిగి ఉన్నారు.

నీవు సర్వశక్తి సమన్వితుడవని నమ్ము. నీవు ఏమైనా చేయగలవు.
ఆత్మవిశ్వాసంతో కృషి చేసి లక్ష్యాన్ని సాధించు - స్వామి వివేకానంద

వెనుకటి గుణమేల మాను..?

సంపాదకీయం



ప్రముఖ రచయిత్రి అరుంధతీరాయ్ మీద, కాశ్మీర్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ న్యాయశాస్త్ర మాజీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌లపై ఉన్న పద్నాలుగేండ్లనాటి ఓ కేసును తిరగదోడి, వారి మీద ఏకంగా 'ఉపా' చట్టాన్ని ప్రయోగించింది మోడీ సర్కార్. వీరిపై విచారణకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతించారు. ఎటువంటి విచారణలు లేకుండా సాధ్యమైనంత వేగంగా వీరిని నిర్బంధంలోకి నెట్టేయాలని కేంద్ర పాలకులు ఉత్సాహపడుతున్నారు. అరుంధతీరాయ్ తన ప్రసంగంతో ప్రజలను చైతన్య పరిచిందే కానీ, అధికారపార్టీ నాయకుల్లాగా విద్వేషాలను, భావోద్వేగాలను రెచ్చగొట్టే చవకబారు ఉద్రేకపూరిత ఉపన్యాసాలు ఇచ్చే బాపతు కాదు. ఇప్పటికే ప్రజాస్వామిక వాదులనూ, రచయితలనూ, అంబేద్కరిస్టులనూ ఈ చట్టం కింద జైళ్లల్లో మగ్గపెడుతున్నారు. తాజాగా వీరి వంతు.

కేవలం ఒక అభివ్యక్తికి కూడా అవకాశం లేని ఈ ప్రజాస్వామ్యానికి అర్థమేమిటి? దేశం పట్ల నిజమైన ప్రేమ ఉన్నవారంతా ఆలోచించాల్సిన అంశమిది. అయినా నిజాలు గుర్తించలేకపోవడం, గుర్తించినా మభ్యపెట్టాలని చూడటం అభ్యంతరకరం, అనైతికం అవుతాయిగానీ, నిజాలు మాట్లాడటం తప్పెలా అవుతుంది? అభిప్రాయాలు వెల్లడించడం, ప్రశ్నించడం, విమర్శించడమే నేరమైతే అది ప్రజాస్వామ్యమెలా అవుతుంది? ఈ ప్రాథమిక సూత్రాన్ని కూడా నిరాకరించే నిరంకుశ పోకడలే ఈ దేశం పరువు తీస్తున్నాయనే సత్యాన్ని పాలకులకు ఎవరు చెప్పాలి?

"నీ అభిప్రాయాలతో ఏకీభవించక పోవచ్చు... కానీ నీ అభిప్రాయం చెప్పే హక్కు కోసం నా ప్రాణమిస్తా" అంటాడు ఫ్రెంచ్ తత్వవేత్త వోల్టేర్. ఇది కదా నిజమైన ప్రజాస్వామిక లక్షణం. ప్రజాస్వామ్యమంటేనే భిన్నాభిప్రాయాలను మన్నించడం, ప్రశ్నలను, విమర్శలను గౌరవించడం కదా... ఈ లెక్కన చూస్తే ప్రస్తుతం మన దేశంలో ప్రజాస్వామ్యమే అమలవుతోందా? అన్న సందేహం రాకమానదు. అత్తెసరు సీట్లతో సొంతగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేక మిత్రులపై ఆధారపడిన ప్రభుత్వం కాబట్టి, బీజేపీ హిందుత్వ ఎజెండాను పక్కన పెడుతుందని భావించిన వారి ఆశలపై నీళ్లు కుమ్మరించింది మోడీ సర్కార్. 'వెనుకటి గుణమేల మాను..' అన్నట్టు అధికార పగ్గాలు చేపట్టి పట్టగానే తన కుటిల బుద్ధిని బయటేసుకుంది.

2010లో రాజకీయ ఖైదీల పక్షాన పనిచేసే కమిటీ ఢిల్లీలో ఏర్పాటుచేసిన సదస్సులో వక్తల ఉపన్యాసాలు వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేట్టుగా ఉన్నందున దేశద్రోహం కేసు పెట్టాలంటూ 'రూట్స్ ఇన్ కశ్మీర్' సంస్థ నాయకుడు సుశీల్ పండిట్ అప్పట్లో ఫిర్యాదు చేశారు. నిజానికి ఆమె ఉపాన్యాసాలతో కాశ్మీరీ ప్రజలు మరింత రెచ్చిపోయి, వేర్పాటువాదం మరికొంత బలపడిన దాఖలాలు ఏమైనా ఉంటే వాటి ప్రభావం ఆనాడే కనిపించివుండేది. అప్పటి ప్రభుత్వాలు ఆమేరకు వారిపై చర్యలు తీసుకొనే ఉండేవి. కానీ, ఇప్పుడు ఆ కాశ్మీర్ లేదు. రెండుగా విడిపోయి కేంద్రపాలిత ప్రాంతంగా మిగిలింది. ప్రత్యేక ప్రతిపత్తిని కోల్పోయిన తరువాత అది ఎంతో బాగుపడిందని చెబుతున్న బీజేపీ పెద్దలు, ఇప్పటి పరిస్థితులతో సంబంధం లేని దశాబ్దంన్నర నాటి ఓ కేసును ఎందుకు తవ్వితీస్తున్నారు? తద్వారా తమ ఎజెండాను తాము వదలబోమన్న సందేశాన్ని సమాజానికి ఇవ్వదలిచారా?

ఇప్పటికే పలు అంతర్జాతీయ ప్రజాస్వామ్య సూచిల్లో అట్టడుగున ఉన్న మనం.. ఇలాంటి చర్యల ద్వారా మరింత దిగజారుతామని వేరే చెప్పాల్సిన పని లేదు. అరుంధతీరాయ్ ఒక బలమైన ప్రజాస్వామిక గొంతు కనుకనే మూడేండ్ల శిక్ష పడే సెక్షన్లను తీసివేసి, వెంటనే అరెస్టుచేసి జైలులో పెట్టి ఏడేండ్లకుపైగా శిక్షపడే 'ఉపా'ను వారు ఎంచుకున్నారు. అంటే ప్రజల పట్ల ప్రశ్నించే గొంతులంటే వారికి ఎంత భయమో ఈ చర్యల ద్వారా అర్థమవుతుంది. వారు సమూలంగా ప్రక్షాళన చేశామంటున్న కాశ్మీర్‌లో ఉగ్రవాదం తిరిగి బుసకొడుతున్న పరిస్థితులను చూస్తున్నాం. 'ఉపా'ను సుప్రీంకోర్టు అంగీకరించదని తెలిసి కూడా, సుదీర్ఘకాలం తరువాత న్యాయస్థానంలో ఏమి తేలనప్పటికీ, ఆ లోగా గిట్టనివారిని కాల్చుకుతినేందుకు ఈ చట్టం బాగా ఉపకరిస్తుంది వీరికి. ఇది వీరి ఫాసిస్టు అంత: స్వరూపానికి నిదర్శనం.

ప్రశ్నించే గొంతులను ఏమాత్రం వదిలిపెట్టబోమన్న బలమైన హెచ్చరిక ఈచర్య. నేడు దేశంలో ప్రజాస్వామ్యం ఏ స్థితిలో ఉందో తెలుసుకోవడానికి మచ్చుకి ఇదో ఉదాహరణ. కేవలం ఒక అభివ్యక్తికి కూడా అవకాశం లేని ఈ ప్రజాస్వామ్యానికి అర్థమేమిటి? దేశం పట్ల నిజమైన ప్రేమ ఉన్నవారంతా ఆలోచించాల్సిన అంశమిది. అయినా నిజాలు గుర్తించలేకపోవడం, గుర్తించినా మభ్యపెట్టాలని చూడటం అభ్యంతరకరం, అనైతికం అవుతాయిగానీ, నిజాలు మాట్లాడటం తప్పెలా అవుతుంది? అభిప్రాయాలు వెల్లడించడం, ప్రశ్నించడం, విమర్శించడమే నేరమైతే అది ప్రజాస్వామ్యమెలా అవుతుంది? ఈ ప్రాథమిక సూత్రాన్ని కూడా నిరాకరించే నిరంకుశ పోకడలే ఈ దేశం పరువు తీస్తున్నాయనే సత్యాన్ని పాలకులకు ఎవరు చెప్పాలి? ఉపా చట్టం కిందనే అక్రమంగా జైలులో పెట్టిన ప్రబీర్, ప్రొఫెసర్ సాయిబాబాలను సర్వోన్నత న్యాయస్థానం అన్యాయమంటూ ఇటీవలే విడుదల చేసింది. అయినా, బుద్ధి మారలేదు. ఇలాంటి వ్యవహారాల పట్ల ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దక్షిణాదిన బీజేపీ విస్తరణను అడ్డుకోవాలి

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు చూస్తే మొత్తంమీద బీజేపీకి ఎదురుదెబ్బ తగిలిందని నిస్సందేహంగా చెప్పొచ్చు. అది కేవలం 240 స్థానాలు మాత్రమే తెచ్చుకోగలిగింది. 2014, 2019 ఎన్నికలలో వచ్చిన ఫలితాలను చేరుకోలేకపోయింది. నరేంద్ర మోడీ ఇప్పుడు నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) మిశ్రమ ప్రభుత్వానికి నాయకత్వం వహించాల్సిన స్థితి. మెజార్టీ కోసం తెలుగుదేశం, జనతా దళ్ (యునైటెడ్) వంటి పార్టీలపై ఆధారపడవలసిన స్థితి. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ తీవ్రంగా నష్టపోయింది. మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలోనూ దెబ్బతిన్నది. ఏమైనా ఫలితాలను అంచనా వేసేప్పుడు బీజేపీ కొత్తగా లబ్ధి పొందిన విషయాన్ని కూడా విస్మరించకూడదు. ఒడిషాలో బీజేపీ మున్నెన్నడూ లేని విజయాలు సాధించింది. 21 లోక్‌సభ స్థానాలలో 20 తెచ్చుకోవడమే గాక మొట్టమొదటి సారిగా శాసనసభ లోనూ సంపూర్ణమైన ఆధిక్యత సాధించింది. దక్షిణ భారత రాష్ట్రాలలో బీజేపీ క్రమానుగతంగా ముందుకు పోతున్న స్థితి ప్రత్యేకంగా ఆందోళన చెందాల్సిన అంశం.సీట్ల వారీగా చూసినప్పుడు బీజేపీ ఈ ప్రాంతంలో పెద్ద పురోగతి సాధిం చినట్టు కనిపించక పోవచ్చు. ఎందుకంటే అయిదు దక్షిణాది రాష్ట్రాలలో కలిపి దానికి 2019 లో 29 సీట్లు వస్తే ఇప్పుడు 2024 లోనూ ఆ సంఖ్య పెరిగింది లేదు. కానీ రాష్ట్రాల వారీ పరిస్థితులు, ఓట్ల వాటా బాగా లోతుగా విశ్లేషిస్తే ఒక్కో రాష్ట్రంలో ఓట్ల వాటా పెంచుకోవడంలో అది లాభపడిన తీరు భిన్నంగా కనిపిస్తుంది.

రాష్ట్రాల్లో ఫలితాల తీరు

తెలంగాణలో బీజేపీకి 2019లో నాలుగు సీట్లు, 19.45 శాతం ఓట్లు రాగా 2024 ఎన్నికలలో ఆ సంఖ్య రెట్టింపై 8 సీట్లు గెలవగలిగింది. ఓట్ల వాటా కూడా గణనీయంగా 35.19 శాతానికి పెరిగింది. బీఆర్ఎస్ ఓట్ల వాటా దారుణంగా పడిపోవడం బీజేపీ కే మేలు చేసింది. కర్నాటకను తీసుకుంటే బీజేపీకి కొంత బలం పోగొట్టుకున్నది. 2019 ఎన్నికలలో అది 25 సీట్లు 51.38 శాతం ఓట్లు తెచ్చుకుంటే ఇప్పుడు 17 సీట్లకు పరిమితమై 46.09 శాతం ఓట్లు మాత్రమే తెచ్చుకోగలిగింది. అయితే జత కలిసిన జనతాదళ్ (ఎస్) 5.64 శాతం ఓట్లు తెచ్చుకోవడంతో మొత్తం ఎన్‌డిఎ ఓట్ల శాతం 51.73గా వుంది. ఈ



PEOPLE'S DEMOCRACY

THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

కలయిక వల్ల సీట్ల తగ్గుదలను కూడా నిలవరించగలిగింది. ఇక కేరళలోనైతే బీజేపీ త్రిసూర్ సీటు గెలిచి మొదటిసారి ఒక లోక్‌సభ స్థానం పొందగలిగింది. ఓట్లలో దాని వాటా కూడా 2019లో 12.9 శాతం వుంటే ఇప్పుడు 16.67 శాతానికి పెరిగింది. మొత్తం ఎన్‌డిఎ వాటా 19.2 శాతానికి అంటే కేరళలో ఎన్నడూ రానంత అధికంగా పెరిగింది. ఈ ఫలితం ఇస్తున్న హెచ్చరికను వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు చాలా తీవ్రంగా తీసుకోవలసి వుంది.

తమిళనాడులో ఎన్నికల ప్రచారం సందర్భంగా ఎన్నో గొప్పలు చెప్పుకున్నప్పటికీ బీజేపీ ఒక్క సీటు కూడా తెచ్చుకోలేకపోయింది. 2019లో అన్నాడిఎంకెతో కలసి పోటీ చేసిన ఆ పార్టీ ఈ సారి పిఎంకె వంటి కొన్ని చిన్న పార్టీలతో అన్నాడిఎంకె చీలిక వర్గాలతో కలసి విడిగా పోటీ చేసింది. 2019లో అయిదు సీట్లకు పోటీ చేసిన బీజేపీ ఓట్ల శాతం 3.66 శాతం అయితే ఇప్పుడు 11.24 శాతానికి పెరిగింది. పది నియోజక వర్గాలలో బీజేపీ రెండవ స్థానంలో రావడం గమనించవలసి వుంది. అంటే కొన్ని సీట్లలో అది ఎఐడిఎంకె ఓట్లను తెచ్చుకోగలిగిందని అర్థమవుతుంది. ఇక బీజేపీ చాలా బలహీనంగా వున్న ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పొత్తు వల్ల లాభపడింది. 2019లో కేవలం 0.96 శాతం ఓట్లు మాత్రమే తెచ్చుకున్న ఆ పార్టీ ఇప్పుడు మూడు పార్లమెంటు సీట్లు, 11.29 శాతం ఓట్లు తెచ్చుకోగలిగింది. 2024లో దానికి ఓట్ల పరంగా 2.83 శాతంతో తక్కువగానే తెచ్చుకున్న ఎనిమిది అసెంబ్లీ సీట్లు పొందగలిగింది. చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో ఆ పార్టీ మంత్రి చేరారు. టీడీపీ భుజం పైకెక్కి బీజేపీ విస్తరించాలని ఆశపడుతున్నది.

విస్తరణను నిరోధించాలి

అయిదు దక్షిణాది రాష్ట్రాలలో బీజేపీ సాధించిన ఫలితాలపై ఈ క్లుప్త చిత్రం ఒక విషయం వెల్లడిస్తున్నది. గతంలో అది కర్నాటకలో రెండు దశాబ్దాల కిందటే బీజేపీ బలమైన పునాది ఏర్పర్చుకుంది. మిగిలిన దక్షిణాది రాష్ట్రాలలో కూడా నెమ్మదిగా అప్పుడప్పుడూ ఆగుతూనైనా బీజేపీ ముందుకు సాగుతున్నది. దీన్నిబట్టి స్పష్టమయ్యే దేమంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్ కూటమి తాము పోగొట్టు కున్న జాగాలను మళ్లీ కొత్తగా సమకూర్చుకోగల సత్తా పోగొట్టుకోలేదు. మోడీ నాయకత్వంలో కొత్త మంత్రివర్గం కూర్పును బట్టి చూస్తే హోం, రక్షణ, ఆర్థికం, విదేశీ వ్యవహారాలతో పాటు కీలక శాఖలన్నీ బీజేపీనే అట్టిపెట్టుకుంది. అటు ప్రభుత్వ యంత్రాంగం ద్వారానూ ఇటు తమ సంస్థాగత వనరులతోనూ బీజేపీ, ఆరెస్సెస్ కూటమి తన పట్టు విస్తరించుకోవడానికి, పెంచుకోవ డానికి పనిచేస్తుంది. వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు అఖిల భారత స్థాయిలోనూ రాష్ట్రాల వారీగానూ హిందూత్వ భావజాలాన్ని, రాజకీయ కార్యకలాపాలను నిరోధించ డానికి తగిన విధానాలు, పద్ధతులు రూపొందించు కోవలసి వుంటుంది.

(జూన్12 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

పెట్టుబడి ప్రపంచవ్యాప్త విస్తరణ - సామ్రాజ్యవాదం



ప్రభాత్ పట్నాయక్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం గణనీయమైన స్థాయిలో విస్తరణ జరుగుతోంది. అమెరికా ఆధ్వర్యంలో ఇంతవరకూ నడుస్తూ వచ్చిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఈ విధంగా "బహుళ ధృవ ఆర్థిక వ్యవస్థ"గా విస్తరించడం ఒక పెద్ద మార్పు అని చాలామంది అంటున్నారు. ఈ విధంగా వర్ణించడం పట్ల ఎవరికి ఏ విధమైన అభిప్రాయం ఉన్నా, ఆర్థిక వ్యవస్థ విస్తరించడం అనేది నిస్సందేహంగా జరుగుతోంది. 1994 నాటికి జి-7 దేశాలు (అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, ఇటలీ, కెనడా) అన్నీ కలిసి ప్రపంచ ఉత్పత్తిలో 45.3 శాతాన్ని ఉత్పత్తి చేయగా, బ్రిక్స్ దేశాలు (బ్రెజిల్, రష్యా, చైనా, ఇండియా, దక్షిణాఫ్రికా) తమతో కొత్తగా కలిసిన ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఈజిప్ట్, ఇథియోపియాలను కలుపుకుని 18.9 శాతం ఉత్పత్తిని చేశాయి. అదే 2022 నాటికి జి-7 దేశాలు 29.3 శాతం, బ్రిక్స్ దేశాలు 35.2 శాతం చొప్పున ఉత్పత్తి చేశాయి (ఇవి ప్రపంచబ్యాంక్ లెక్కలు).

అమెరికా, బ్రిటన్, కెనడా, యూరోపియన్ యూనియన్ దేశాలు, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లను కలిపి చూసినా, వాటి ఉత్పత్తి శాతం 1994లో 56 ఉండగా 2022 నాటికి 39.5కి తగ్గింది. అమెరికా మాత్రం ఈ విస్తరణ పర్యవసానాలను జీర్ణించుకోడానికి సిద్ధంగా లేదు. అందుకే పాత రోజుల్లో మాదిరిగానే తన పెత్తనం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద పాత పద్ధతుల్లోనే సాగించడానికి చాలా దూకుడుగా వ్యవహరిస్తోంది. ఈ దూకుడు ముఖ్యంగా రష్యా, చైనా, ఇరాన్ వంటి దేశాల విషయంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ దూకుడు వల్ల ప్రపంచం అత్యంత ప్రమాదకరమైన సైనిక ఘర్షణలకు దారి తీస్తోంది.

సోషలిస్టు వ్యవస్థ తలెత్తడం ఈ ఉత్పత్తి విస్తరణకు చాలా దోహదం చేసింది. సోషలిజం ఉనికిలోకి రావడంతో వలస విధానం అంతరించడం వేగంగా జరిగింది. ఆ దేశాల్లో దేశీయంగా నైపుణ్యాలు పెంపొందడం, సాంకేతిక సామర్థ్యం, మౌలిక వసతుల కల్పన, ఉత్పత్తి సామర్థ్యం పెరగడానికి సోషలిస్టు వ్యవస్థ తోడైంది. ఆ ప్రభుత్వాల నియంత్రణలో ఆర్థిక వ్యవస్థలు నిర్వహించడం అనేది ఈ అభివృద్ధితో నిలదొక్కుకుని పాశ్చాత్య దేశాల శతృపూరిత వైఖరిని ఎదుర్కోగల శక్తిని వాటికి కల్పించింది. సోవియట్ యూనియన్‌లోను, తూర్పు యూరప్ దేశాలలోను సోషలిస్టు వ్యవస్థలు పతనం చెందాక, ప్రభుత్వ నియంత్రణలో మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు నిర్వహించడం అనేది మారిన తర్వాత అంతర్జాతీయ పెట్టుబడుల ప్రవాహాలు వేగంగా సాగడంతో ఉత్పత్తి ప్రపంచవ్యాప్త విస్తరణ అనేది కొనసాగింది. ఇందుకు నయా ఉదారవాద ఆర్థిక విధానాలు తోడ్పడ్డాయి. అప్పటికే ప్రభుత్వ నియంత్రణలో ఆ యా దేశాల ఆర్థిక వ్యవస్థలు నడిచినప్పుడు పెంచుకున్న ఉత్పత్తి సామర్థ్యాలు, మౌలిక వసతులు వగైరా ఉండడంతో నయా ఉదారవాద వ్యవస్థలో ఉత్పత్తి విస్తరణ సులభ సాధ్యం అయింది. ఇప్పుడు అమెరికా నాయకత్వంలోని కూటమి పరిధికి వెలుపల ఉత్పత్తి విస్తరణ పెట్టుబడిదారీ వ్యవస్థలోనే సాగుతోంది (చైనా సంగతి వేరు. దానిని ప్రత్యేకంగా చూడాలి).

ప్రస్తుత పరిస్థితుల్లో సామ్రాజ్యవాదాన్ని మనం ఏ విధంగా అర్థం చేసుకోవాలి? అన్నది ఇప్పుడు తలెత్తే ప్రశ్న. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సామ్రాజ్యవాదంతోపాటే అభివృద్ధి చెందిన సంపన్న దేశాలు, వెనుకబడిన తక్కిన దేశాలు అన్న విభజన కూడా ఏర్పడింది. ఇప్పుడు ఆ విభజన రేఖ చెదిరిపోయి, ఇంతవరకూ వెనుకబడిన దేశాల్లో ఉత్పత్తి పెరుగుదల రేటు వేగంగా, సంపన్న దేశాలను సైతం అధిగమించి ముందుకు సాగిపోతూ వుంటే, ఇంకా సామ్రాజ్యవాదం గురించి ఎలా మాట్లాడగలం? వెనుకబడ్డ దేశాలు సంపన్న దేశాల స్థాయిని అందుకుంటు న్నప్పుడు, అది కూడా పెట్టుబడిదారీ చట్రం లోపలే జరుగుతున్నప్పుడు (చైనా ఇందుకు మినహాయింపు) ఇక పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచంలో అసమాన అభివృద్ధికి దారి తీసిందంటూ దానిని నేరస్తురాలిగా ఎలా నిలబెడతాం? ఇదీ ఆ ప్రశ్న. అయితే ఈ ప్రశ్న కరెక్టేనా?

మొట్టమొదటగా, ఉత్పత్తి విస్తరణ అనేది స్పష్టంగా కనిపిస్తున్నా, వెనుకబడిన దేశాలు సైతం సంపన్న దేశాల స్థాయిని అందుకుంటున్నాయని నిర్ధారించడం అతిగా భావించడమే ఔతుంది. జరుగుతున్న ఉత్పత్తి విస్తరణను అతిగా పరిగణించడమే దీనికి కారణం. ఈ విస్తరణ జరుగుతున్న దేశాల సంఖ్య ఇప్పటికీ చాలా తక్కువగానే ఉంది. ఈ దేశాలలో కూడా పరిస్థితులు తారుమారయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. ఎందుకంటే నయా ఉదారవాద వ్యవస్థలో తలెత్తిన సంక్షోభం ఫలితంగా ఈ దేశాలన్నీ రుణాల వలలో చిక్కుకున్నాయి. ఆ రుణాలతోబాటు వచ్చే షరతులను పాటించవలసి వస్తోంది. ద్రవ్య వినిమయంలో పొదుపు పాటించడం, దేశీయంగా ద్రవ్యోల్బణాన్ని లేకుండా చూడడం ఆ షరతులలో భాగం. వాటిని అమలు చేసినందువలన ఈ దేశాలలో ఉత్పత్తి పెరుగుదల నిలిచిపోవడమే గాక దిగజారడం కూడా మొదలౌతుంది. చరిత్రలో ఈ విధంగా జరిగిన అనుభవాలు మన ముందున్నాయి. ముఖ్యంగా ఖనిజ సంపద కలిగి ఉన్న దేశాలకు ఇటువంటి అను భవాలు ఎదురయ్యాయి. మయన్మార్ ఇందుకు ఒక ఉదాహరణ. ఒకప్పుడు ఆ దేశం అభివృద్ధిలో చాలా ముం దుకు పోతున్నట్టు భావించారు. కాని ఇప్పుడు అతి తక్కువ అభివృద్ధి నమోదైన దేశాల్లో ఒకటిగా మయన్మార్ ఉంది. మన పొరుగు దేశాల్లో కూడా విదేశీ రుణ భారం ఫలితంగా దిగజారిపోవడం కనిపిస్తోంది.

సంపన్న దేశాల స్థాయికి మూడవ ప్రపంచదేశాలు చేరుకోవడం అనేది సాధ్యం కాదు. దీనికి ప్రధాన కారణం సామ్రాజ్యవాదమే. దీనిని అర్థం చేసుకోవాలంటే ఉత్పత్తి విస్తరణతోబాటు ప్రస్తుత నయా ఉదారవాద శకంలో మూడవ ప్రపంచ దేశాలలో పెరుగుతున్న పౌష్టికాహార లేమిని కూడా పరిశీలించాలి. ఒకవైపు సంపన్న దేశాల నుండి మూడవ ప్రపంచ దేశాలకు ఉత్పత్తి విస్తరిస్తూంటే, దాని ఫలితంగా అవి సంపన్న దేశాల కన్నా అధికంగా వృద్ధిరేటు పెరుగుదలను నమోదు చేస్తూంటే మరోవైపు ప్రజలకు పౌష్టికాహార లభ్యత తగ్గిపోతోంది. ఈ వాస్తవాన్ని మసిపూసి మారేడుకాయ చేసి కేవలం ఉత్పత్తి విస్తరణను మాత్రమే గొప్పగా చిత్రించే ప్రయత్నాన్ని ప్రపంచబ్యాంకు చేస్తోంది. పౌష్టికాహారం లేకపోవడం అంటే దానర్థం ఇక్కడ నికరంగా పేదరికం పెరిగి పోవడమే. మూడవ ప్రపంచ దేశాలలో ప్రజలకు నయా ఉదారవాద శకంలో మెరుగైన రోడ్లు, విద్యుత్తు, ఇతర మౌలిక వసతులు అభివృద్ధి చెంది వుండొచ్చు. కాని, వ్యక్తిగత వినిమయం స్థాయి పడిపోయింది. సోషలిస్టు వ్యవస్థ, దాని ఊతంతో మూడవ ప్రపంచ దేశాలలో ప్రభుత్వ నియంత్రణలో నడిచిన ఆర్థిక వ్యవస్థలు పతనం కావడం, నయా ఉదారవాద ఆధిపత్యం ప్రపంచం అంతా బలపడడం జరిగిన కాలంలోనే మూడవ ప్రపంచ దేశాల ప్రజల వినిమయ స్థాయి పడిపోయింది.

అందుచేత సంపన్న దేశాల సరసన మూడవ ప్రపంచ దేశాలు సైతం చేరుతున్నాయి అని నిర్ధారించడం అంటే పరిస్థితిని తప్పుగా అర్థం చేసుకోవడమే. మహా అయితే, పెట్టుబడిదారీ ప్రపంచానికి, దానికి వెలుపల ఉన్న ప్రపంచానికి నడుమ ఉండే విభజన రేఖ చెరిగిందని, ఆ విభజన రేఖ కాస్తా ఇప్పుడు పెట్టుబడిదారీ ప్రపంచం లోపలే కనిపిస్తోందని నిర్ధారించవచ్చు. మూడవ ప్రపంచ దేశాలలోని బడా పెట్టుబడిదారీ వర్గం ఇప్పుడు



ప్రస్తుత పరిస్థితుల్లో సామ్రాజ్యవాదాన్ని మనం ఏ విధంగా అర్థం చేసుకోవాలి? అన్నది ఇప్పుడు తలెత్తే ప్రశ్న. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సామ్రాజ్యవాదంతోపాటే అభివృద్ధి చెందిన సంపన్న దేశాలు, వెనుకబడిన తక్కిన దేశాలు అన్న విభజన కూడా ఏర్పడింది. ఇప్పుడు ఆ విభజన రేఖ చెదిరిపోయి, ఇంతవరకూ వెనుకబడిన దేశాల్లో ఉత్పత్తి పెరుగుదల రేటు వేగంగా, సంపన్న దేశాలను సైతం అధిగమించి ముందుకు సాగిపోతూ వుంటే, ఇంకా సామ్రాజ్యవాదం గురించి ఎలా మాట్లాడగలం? వెనుకబడ్డ దేశాలు సంపన్న దేశాల స్థాయిని అందుకుంటు న్నప్పుడు, అది కూడా పెట్టుబడిదారీ చట్రం లోపలే జరుగుతున్నప్పుడు (చైనా ఇందుకు మినహాయింపు) ఇక పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచంలో అసమాన అభివృద్ధికి దారి తీసిందంటూ దానిని నేరస్తురాలిగా ఎలా నిలబెడతాం? ఇదీ ఆ ప్రశ్న, అయితే ఈ ప్రశ్న కరెక్టేనా?

సంపన్న పెట్టుబడిదారీ దేశాలలోని పెట్టుబడిదారుల సరసన చేరారు. గతంలో వీరు తమ తమ దేశాల్లోని ప్రజలతో బాటు నిలిచి వలస పెత్తనానికి వ్యతిరేకంగా నడిచారు. సామ్రాజ్యవాదం అంటే ఒక భౌగోళికమైన విభజనగా అర్థం చేసుకోకూడదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ పరిసరాల మీద సాగించే పీడన రూపమే సామ్రాజ్యవాదం. అదొక రాజకీయ అర్థశాస్త్రపు భావనే తప్ప భౌగోళికంగా అర్థం చేసుకోవలసినది కాదు. అందుచేత రాజకీయ అర్థశాస్త్రం లోని కొన్ని అంశాలను ఇక్కడ మళ్ళీ గుర్తు చేసుకోవడం అవసరం.

పారిశ్రామిక విప్లవం తర్వాత పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం కొత్త రూపం తీసుకుంది. బ్రిటన్‌లో జౌళి పరిశ్రమతో ఇది మొదలైంది. ఐతే బ్రిటన్‌లో జౌళి పరిశ్రమకు కావలసిన పత్తి ఉత్పత్తి సాధ్యం కాదు. అదే విధంగా తమ దేశాలలో ఉత్పత్తి చేయడం సాధ్యం కాని లేదా ఒకవేళ ఉత్పత్తి చేయగలిగినా తమ పరిశ్రమల అవసరాలకు సరిపడా ఉత్పత్తి చేయలేని వివిధ రకాల ముడి సరుకుల కోసం ఉష్ణ మండల దేశాల మీద పెట్టుబడిదారీ దేశాలు ఆధారపడవలసి వచ్చింది. ఈ ఉష్ణ మండల దేశాలలో ఏడాది పొడవునా పంటలు పండుతాయి. అందుచేత చారిత్రికంగా అక్కడ జనాభా కూడా ఎక్కువగా ఉంటుంది. ఇవన్నీ దాదాపుగా పెట్టుబడిదారీ దేశాలకు వెలుపలే ఉన్నాయి. కాలక్రమంలో ఈ ప్రాంతాలకు కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ విస్తరించినప్పటికీ, అక్కడి స్థానిక పెట్టుబడిదారులతోబాటు, సంపన్న పెట్టుబడిదారీ దేశాలలోని పెట్టుబడిదారులు కూడా ముడిసరుకుల కోసం ఈ ఉష్ణమండల దేశాలలోని రైతాంగం మీదనే ఆధారపడక తప్పలేదు. ఆ రైతులు పండించే ఉత్పత్తుల ధరలు దశాబ్దాలుగా పెరగలేదు సరి కదా డాలర్ లెక్కల్లో చూస్తే తగ్గిపోయాయి.

ఈ వ్యవసాయోత్పత్తుల ధరలు సాపేక్షంగా తక్కువగా ఉండడం అనేది వాస్తవానికి పెట్టుబడిదారీ పీడన ఫలితమే. దశాబ్దాలుగా ఈ పీడన సాగుతోంది. మూడవ ప్రపంచ దేశాల్లో వ్యవసాయో త్పత్తులకు ఈ వ్యవస్థలో పెద్దగా ప్రాధాన్యత లేదు అన్నఒక తప్పుడు అభిప్రాయం ఏర్పడడానికి ఇది దారి తీసింది. కాని పెట్టు బడిదారీ వ్యవస్థ ఈ ఉత్పత్తులను ఉపయోగించకుండా తన మనుగడను కొనసాగించలేదు అన్నది సత్యం. ఉష్ణ మండల దేశాల్లో భూమి అంతా దాదాపు సాగులోకి ఎప్పుడో వచ్చేసింది. అందుచేత ఇక్కడ భూమి మీద వ్యవ సాయం దిగుబడి ఇంకా పెరగాలంటే పంట దిగుబడిని పెంచుకోవడం ఒక్కటే మార్గం. ఆ పని చేయడానికి రైతాంగం మీద ఎటువంటి పీడననూ ప్రయోగించనవసరం లేదు. ఐతే దిగుబడి పెంచడానికి అవసరమైన సాగు నీటి సదుపాయం, అధిక దిగుబడులనిచ్చే వంగడాలపై పరిశోధనలు వంటివి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే జరగాలి. రైతులు తమకు తాముగా జరపలేరు. కాని నయా ఉదారవాదం ప్రభుత్వ జోక్యాన్ని సహించదు. జాతీయ, అంత ర్జాతీయ బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మాత్రమే ఏ ప్రభుత్వమైనా పని చేయాలి తప్ప అంతకు మించి స్థానిక ప్రజల ప్రయోజనాల కోసం ఏ ప్రభుత్వమైనా పూనుకుంటే అది ఒప్పుకోదు. కనుక రైతులకు, చిన్న ఉత్పత్తిదారులకు అండగా ఏ ప్రభుత్వమైనా చర్యలు చేపడితే అందుకు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అంగీ కరించదు. దాంతో సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడుల పెంపు వంటివి వెనకపట్టు పడతాయి. ఆ పరిస్థితుల్లో దేశీయంగా ప్రజల వినియోగాన్ని తగ్గించినప్పుడే ఆ వ్యవసాయోత్పత్తులు పెట్టుబడి దారులకు తగినంత పరిమాణంలో, చౌకగా లభిస్తాయి. అందుకోసం ప్రజల కొనుగోలు శక్తిని తగ్గించాలి. ఎటువంటి పీడనా లేకుండా ఈ పని చేయడం సాధ్యం కాదు.

అటువంటి పీడన ఫలితంగానే మూడవ ప్రపంచ దేశాలలో తలసరి ఆహారధాన్యాల ఉత్పత్తి గాని, వాటి తలసరి వినియోగం గాని తగ్గిపోతున్నాయి. దీనికి తోడు ఆహార ధాన్యాలను బయో ఇంధనాల ఉత్పత్తికి మళ్ళించడంతో క్రమంగా తలసరి ఆహార ధాన్యాల లభ్యత కూడా తగ్గిపోతోంది. దీని పర్యవసానమే పౌష్టికాహార లేమి. అందుచేత మూడవ ప్రపంచ దేశాలకు ఉత్పత్తి విస్తరణ జరగడం అంటే అదేమీ సామ్రాజ్యవాదం అనే ధోరణికి వ్యతిరేకం కాదు.

(స్వేచ్ఛానుసరణ)

రేపటి కామెడీలు!

— రంగనాయకమ్మ





"'లాభం' పద్ధతి అన్ని దేశాల్లోనూ తెలుస్తుందా?"

"తెలుస్తుంది గానీ, నూటికి ఒకరిద్దరికేలే. మిగతా 98 మందీ, ఇంకా తెలుసుకోవాలి!"

"లాభం కోసం కాకుండా, లాభాన్ని చేర్చకుండా, 'ధర' అనేది ఎప్పుడూ వుండదంటావా గోపాల్? వేలాది కంపెనీల వాళ్ళల్లో ఎందరో నిత్యం సరుకుల రాసుల్ని అమ్మిస్తూనే వుంటారు. వాళ్ళు 'లాభం' అనే మాట లేకుండా, 'ధరల్ని' నిర్ణయించరంటావా?"

"అప్పుడు అది, 'పెట్టుబడిదార్లు కోరే ఉత్పత్తి విధానం' ఎలా అవుతుంది? పెట్టుబడికి రావలిసింది, 'కౌలూ - వడ్డీ - లాభం' అనే మూడు ఆదాయాలు! తెలుసా? గుర్తుందా?"

"ఏదో చెప్పావు అప్పుడు. అప్పుడూ అడిగానుగా? 'ఆదాయాలు' వస్తే తప్పేమిటి? మనం కోపంగా ఏదో అనేస్తున్నామా?"

"చాల్లే! నోర్మూసుకో! తెలియకపోతే, ఇంకా అడుగు! 'ఆదాయాలు' అని ఒక మాటని పెట్టుకుంటే చాలా? అవి, 'దోపిడీ' చేస్తూ సంపాదించే దోపిడీ ఆదాయాలైతే? అయినా, ఆదాయాలేనా? ఒకడు, "వడ్డీ, నా ఆదాయం!" అంటే చాలా? ఈ సమాజం అంతా, దోపిడీ ఆదాయాల కోసమే, దోపిడీదార్లు పెట్టుకున్న చట్టాల తోటే, వాళ్ళ పెత్తనాల తోటే, 'ప్రభుత్వాల' పేరుతోనే నడుస్తోందని తెలుసా?"

"నిజంగా క్షమించు! నాకు కొన్ని విషయాలు తెలుసు గానీ, నిజంగా నేను శ్రద్ధ లేకుండా మాట్లాడేశాను! ఇక, అన్నీ వింటాను. కానీ గోపాల్! ఉద్యోగాలే రావంటారు! ఇవ్వరంటారు! ఉద్యోగాలు ఎంత ఎక్కువ మందికి ఇస్తే, అన్ని ఎక్కువ లాభాలు వస్తాయని తెలీదా ఆ పెట్టుబడిదార్లకి?"

"అవును రవీ! మంచి ప్రశ్న! మంచి ప్రశ్నే! నేనూ ఇలా ఎప్పుడూ అనుకోలేదు! ఎక్కువ ఉద్యోగాలిస్తే, వాటి వల్ల ఎక్కువ లాభాలేగా వాళ్ళకి! మరి, ఉద్యోగాలెందుకివ్వరు? ఎందుకు తీసేస్తారు? ఒక్కడికే నలుగురైదుగురి పని ఎందుకు అప్పజెపుతారు? అయితే, ఈ 'నిరుద్యోగం' సమస్యేమిటి?వేల లక్షల మంది జనం, ఉద్యోగాలు లేకుండా ఎందుకు ఉంటున్నారు? ఆలోచించాలి మనం నిజంగా! అవును, ఎక్కువ మందికి ఉద్యోగాలిచ్చి ఎక్కువ లాభాలు ఎందుకు తీసుకోరు?"

గోపాల్ అలా అనడం రవికి విచిత్రంగా అనిపించింది. గోపాల్‌తో అన్నాడు. "పెట్టుబడిగాళ్ళ ఏడుపంతా లాభాల కోసమే కదా గోపాల్? లాభాలు తగ్గిపోయే లాగ వాళ్ళు చేసుకుంటారా? ఎందుకు చేసుకుంటారు?చేసుకోరు కదా? నా కెలా అనిపిస్తోందంటే, ఎక్కువ మంది చేసే పనుల వల్ల వచ్చే లాభాల కన్నా, ఆ పనులన్నీ, తక్కువ మందితో చేయిస్తేనే ఎక్కువ పని జరుగుతుందనీ, ఎక్కువ లాభం వస్తుందనీ, అనుకుంటారేమో వాళ్ళు! అలా అనుకోకూడదంటావా మనం?"

గోపాల్ ఈ సారి ఆశ్చర్యపడి సంతోషంగా రవి చేతులు పట్టుకున్నాడు. "రవీ! నీకు నేను క్షమాపణ చెప్పుకుంటా! క్షమించు! నిన్ను నోర్మూస్కో అనేశాను ఇందాక! అంత కోపం వచ్చింది, నువ్వు దోపిడీ ఆదాయాల్ని అర్థం చేసుకోలేదని! అప్పుడు వెంటనే ఫీలయ్యాను! కోపం మరి! తప్పే నాది!"

"అయ్యయ్యో! ఏవిటింత పశ్చాత్తాపం? ఏవో విషయాలు మాట్లాడుకుంటూ ఎన్నో వంకరు టింకర్లుగా, ఒకళ్ళని ఒకళ్ళం ఏదో అనుకుంటూనే వుంటాం. దానికా ఇంత ఫీలింగ్? నేనైతే నిన్నే ఆ మాట అన్నా, అది తప్పనుకోను! సందర్భం అలాంటిదైతే అలాగే అంటాం. అది అంత తప్పా? సరే, క్షమించేశాలే! చాలా? తేలిగ్గా మాట్లాడు! నేనడిగిన దానికే చెప్పు! పెట్టుబడిగాళ్ళకి లాభాలే కావాలంటే, ఎక్కువ మందికి పనులిచ్చేసీ, ఎక్కువ లాభాలు సంపాదించుకోలేరా? అది చెప్పు! నాకు తెలిసే లాగ!

"చక్కగా ఆలోచిస్తావు. నువ్వే ఆలోచించు! నిజంగా పనులన్నీ ఒక్కొక్కళ్ళకే అప్పజెప్పేస్తూ వుంటారు. అస్తమానం, 'టెక్నాలజీ, టెక్నాలజీ పెరగాలి!' అంటారు. ఎంతసేపూ యంత్రాల తిరుగుళ్ళు పెరగాలి! రైళ్ళు చూడు, గంటకి ఇన్ని మైళ్ళు వెళ్తే, కాదు, అవి రెట్టింపుగా, మూడు రెట్లుగా తిరగాలి! ఒకళ్ళిద్దరు డ్రైవర్లతో నాలుగు రెట్ల పని జరిగిపో"వాలి! పని పెరగాలని చూస్తారు గానీ, పనులు చేసే వాళ్ళ గురించి ఉండదు. పెరిగిన పనికి ఎక్కువ విలువనే లెక్క కడతారు. పనులు పెంచినప్పుడు జీతాలు కొంచెం పెంచినా, నలుగురి ఉద్యోగాలు పోగొట్టే కదా? దాని వల్ల తేలేదీ, పాత లాభం పెరగడమే! నువ్వు ఎక్కౌంట్ల వాడివి! నీ లెక్కలతో, బూర్జువా తెలివిని చక్కగా లెక్క కట్టగలవు!"

"అవును! ఈ మధ్య కార్ల గురించి రకరకాల ఎడ్వర్ల యిజ్''వెంట్లు! డ్రైవర్లు లేని కార్లట! చెయ్యాలంటే, అనేక మార్పులు సాధ్యమే, రెండో మూడో తప్ప! అలాంటి కార్లకి ఇంజన్లు తయారుచేసే గొప్ప ఇంజనీర్లకి జీతాల్లో నాలుగు వేలే కాదు, నలభై వేలు పెంచితే మాత్రం,డ్రైవర్లు లేని కార్లకే అమ్మకాలు. కోట్ల కోట్ల ఖరీదులతో అమ్మకాలు పెరిగితే, ఆ కొత్త కార్ల కంపెనీలకి ఎంత డబ్బు!"

"డబ్బు కాదు, లాభం!"

"అవును! లాభం అనాలి! ఒక టెక్నాలజీని, కనీసం ఇంత కన్నా పెంచకూడదు - అనే హద్దు ఉండదా? మనుషుల క్షేమాన్ని పెంచాలంటే, టెక్నాలజీని అనవసరంగా పెంచకూడదు; పెంచాలంటే క్షేమమే హద్దు కదా?"

"రవీ! నువ్వు అద్భుతంగా ఆలోచిస్తున్నావు. ఇంకా కూర్చుంటే, నీకు క్లాసు పోతుంది."

"నిజమే గానీ, ఇవ్వాళ అదేదో రోత సినిమా రిలీజు. సగం మంది స్టూడెంట్లు వుండరు. టీచరూ రాక పోవచ్చు. ఆయన రేపు చెప్పేస్తాడు, ఆ సినిమాలో వీరత్వాల గురించి! ఇంకో అరగంట వుంటా గోపాల్! నీ క్లాసు వాళ్ళూ పోతారు. కాస్సేపు ఉండు!."

"ఆలస్యంగా లేద్దాంలే. ఒక సంగతి చాలా సార్లు అనుకున్నాను. ఇప్పుడు 'ఇళ్ళు' చూడు! వాటిని 'ఇళ్ళు' అనగలమా? అపార్టుమెంట్లు! పైకి! పైకి! ఆకాశంలోకి వెళ్ళడమా ఇల్లు అంటే? అక్కడ ఒక్క చెట్టూ కనపడదు! పిల్లలు ఇంట్లో, వాకిళ్ళల్లో ఆడుకోవడం వుండదు! పార్కుల్లోకి తీసుకెళ్ళవలి సిందే! నేల మీద ఇళ్ళకి చోటు లేదంటారు!....."

"అదే కారణం అయితే, నాలుగైదు అంతస్తుల ఎత్తు వరకూ మాత్రమే చాలా విశాలంగా వుండవచ్చు కదా?"

"నువ్వు ఐదు అంతస్తుల దాకా వెళ్ళావు రవీ! నాకైతే రెండో మూడో దాటితే అసహ్యమే. ఒక డాక్టరెవరో, తోటలో వుండే ఇంటిని అమ్మేసి, కొన్న వాళ్ళెవరో మరి! వాళ్ళకి నేల ఇల్లు ఎలా పనికొచ్చిందో!"

"ఆ తోట ఇల్లు అమ్మేసినాయన ఎక్కడ కొన్నాడు?"

"ఇంకెక్కడ? 93 అంతస్తుల చోట, 92వ చోట!"

"ఛీ! అన్ని అంతస్తులున్నదాన్ని ఇల్లు అంటారా?"

"ఇది పెట్టుబడిదారీ నాగరికత! ఈ పద్ధతిని ఏమన్నా అంటే, బూర్జువాలు ఏవంటున్నారో తెలుసా? అపార్టుమెంట్లయితే నిరుపేదలకి కూడా ఇళ్ళు వుంటాయట! అది ఇష్టం లేక మన లాంటి వాళ్ళు, వాళ్ళకి పాకలే గుడిసెలే, వుండాలి - అంటున్నామట!"

"ఆ గుడిసెల వాళ్ళేమంటున్నారు?"

"ఆకాశంలో కోళ్ళ బుట్టల్లాంటి అపార్టుమెం టుల్లో వుంటూ, 'ధనవంతులం అయిపోయాం' అనుకుంటున్నట్టే వున్నారు!" అని ఆపాడు గోపాల్ నిరుత్సాహంగా.

"నిరుపేదలు అంత కన్నా ఎలా అనగలరు? వాళ్ళకి కొంచెం మార్పులాగే వుంటుంది కదా? ఇక, బూర్జువా సైన్సు ఇలా నేర్పుతుంది కాబోలు! సమాజానికి ఇది, ఎదుగుదలగా అవుతుందా?"

"కాదు, ఇది ఇంకో రకపు కొత్త శ్రమ దోపిడీ! లాభాలు సంపాదించడానికి కొత్త మార్గం. తక్కువ చోట్లో ఎక్కువ ఇళ్ళు!"

"సమాజంలో శ్రమ దోపిడీలు జరుగుతోంటే, వాటిని సహిస్తూ పడి వుంటే, అది పూర్వ కాలం నించీనా ఈ ఘోరం?"

"అంతే! మరీ ఐదో తరగతి పిల్లాడి లాగ ఏదీ తెలియనట్టు కొత్తగా మాట్లాడుతున్నావేమిటి? డిగ్రీలు సాధిస్తున్నావు! వాటి వల్ల తెలివే రాదా? ఈ సమాజం, వేల వేల సంవత్సరాల క్రితమే బానిస యజమానుల ఘోరాల కింద ప్రారంభమైంది. అది, భూస్వామ్య విధానంతో కొంత ఎదిగింది! అది కూడా పెట్టుబడిదారీ విధానంగా మరి కొంత ఎదిగి నట్టే! ఇక ఈ మొత్తం దోపిడీల నించి విముక్తి కావాలి!"

(ఇంకావుంది)

జులై 7న నేతన్నల పోరు యాత్ర

15న కమిషనర్ ఆఫీస్ ముట్టడి : మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జులై ఏడో తేదీన పోరుయాత్ర చేపట్టబోతున్నామనీ, అదే నెల 15న కమిషనరేట్‌ను ముట్టడిస్తామని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్, చేనేత కార్మికుల సంఘం సంయుక్త సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సీతారాములు మాట్లాడుతూ.. ఉపాధి దొరక్క, చేసిన పనికి తగిన ఆదాయం రాక వస్త్రపరిశ్రమపై ఆధారపడ్డ చేనేత, పవర్‌లూమ్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేత, పవర్‌లూమ్ కార్మికులకున్న పథకాలను రద్దుచేసి జీఎస్టీని విధించి వస్త్ర పరిశ్రమను, దానిపై ఆధారపడ్డ కార్మికులను రోడ్డుపాలు చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో గతంలో ఉన్న త్రిప్ట్ ఫండ్ స్కీమ్, యారన్ సబ్సిడీ, నేతన్న బీమా పథకాలను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం బకాయిలను చెల్లించలేదనీ, దీంతో యజమానులు కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు ఇచ్చిన ఆర్డర్లను కొనుగోలు చేయకపోవడంతో కోట్ల రూపాయల వస్త్ర నిల్వలు పేరుకుపోయాయని వాపోయారు. సహకారేతర రంగంలో ఉన్న కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచడంలేదన్నారు. సహకార సంఘాలకు ఐదేండ్లకోసారి ఎన్నికలు నిర్వహించాలనీ, కానీ, చేనేత సంఘాలకు 11 ఏండ్లుగా ఎన్నికలు నిర్వహించలేదని తెలిపారు. సిరిసిల్లలో నేతన్నలు ఆరు నెలలుగా అనేక పోరాటాలను చేస్తూనే ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శించారు. నేడు సిరిసిల్లలోని పవర్లూమ్ పరిశ్రమకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేయకుండా మీటర్లను తొలగించడం దారుణమన్నారు. ఈ సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి గంజి మురళి, గోశిక స్వామి బడుగు శంకరయ్య, గుర్రం నరసింహ, అంకం మురళి, ఎం. నరహరి, మాచర్ల సారయ్య వనం ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

కౌలు రైతులకిచ్చిన హామీలు అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

రుణ అర్హత కార్డులు ఇచ్చిందని, ఆ తర్వాత పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వలసలు పోకుండా ఉపాధి దొరుకుతుందనే ఆశతో కౌలుకు తీసుకొని పొలాలు సాగు చేస్తున్నారన్నారు. వీరికి పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల పరిహారం అందటం లేదని తెలిపారు. కౌలు రైతులకు కార్డులు అందజేయాలని, ధరణిలో రద్దు చేసిన 26 సెక్షన్ పునరుద్ధరించాలని కోరారు. కౌలు రైతులతో జైబిలిటీ గ్రూపులు ఏర్పాటు చేయాలని, పరస్పర సెక్యూరిటీపై రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర నాయకులు బొంతు రాంబాబు మాట్లాడుతూ.. 21న మంత్రివర్గ సమావేశం ఉందని, అంతకుముందే కౌలు రైతులు తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసేలా ఉద్యమాలు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులను సంఘటిత పరిచి సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుతామన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సమావేశానికి ముందు కౌలు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు తాతా భాస్కరరావు జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, అన్నవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీఈసెట్‌లో 96.48 శాతం ఉత్తీర్ణత

ఫలితాలు విడుదల చేసిన లింబాద్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీఈసెట్) ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి బుధవారం విడుదల చేశారు. పీఈసెట్‌కు 2,392 మంది దరఖాస్తు చేయగా, 1,705 మంది దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 1,645 (96.48 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 967 మంది అబ్బాయిలు పరీక్షలకు హాజరుకాగా, 942 (97.41 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 738 మంది అమ్మాయిలు పరీక్షలకు హాజరైతే 703 (95.26 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. బీపీఈడీకి 1,198 మంది పరీక్షలకు హాజరుకాగా, 1,156 (96.49 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. డీపీఈడీకి 507 మంది పరీక్షలకు హాజరైతే 489 (96.45 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. బీపీఈడీలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గొల్ల మహేశ్వరి ప్రథమ ర్యాంకు పొందారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన సిహెచ్ పద్మశ్రీ రెండో ర్యాంకు, ములుగు జిల్లాకు చెందిన తెల్లం ప్రియాంక మూడో ర్యాంకు, గుగులోత్ అఖిల నాలుగో ర్యాంకు, కామారెడ్డి జిల్లాకు చెందిన జూకంటి రంజిత ఐదో ర్యాంకును సాధించారు. డీపీఈడీలో యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన చిట్టిమల్ల సంధ్య ప్రథమ ర్యాంకును పొందారు. సంగారెడ్డికి చెందిన తలారి నగ్మ రెండో ర్యాంకు, సిద్దిపేటకు చెందిన మోతె అంజలి మూడో ర్యాంకు, ఆదిలాబాద్‌కు చెందిన తొడసం జంగుభాయ్ నాలుగో ర్యాంకు, నిజామాబాద్‌కు చెందిన అయిల్ల అఖిల ఐదో ర్యాంకును సాధించారు. రాష్ట్రంలో 14 బీపీఈడీ కాలేజీల్లో 1,360 సీట్లు, మూడు డీపీఈడీ కాలేజీల్లో 300 సీట్లు కలిపి మొత్తం 17 కాలేజీల్లో 1,660 సీట్లున్నాయి. ఈ కార్యక్రమంలో శాతవాహన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జీ వీసీ సురేంద్ర మోహన్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, శాతవాహన విశ్వవిద్యాలయం మాజీ వీసీ మల్లేషం, పీజీఈసెట్ కన్వీనర్ రాజేష్‌కుమార్, పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన హత్యలు, లైంగికదాడులు

(మొదటిపేజీ తరువాయి)

హరీశ్‌రావు మరో ప్రకటనలో విమర్శించారు. జూనియర్ కళాశాలలు ప్రారంభమై 19 రోజులవుతున్నా ఇప్పటి వరకూ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందించకపోవటం శోచనీయమని పేర్కొన్నారు. ఇది అత్యంత బాధ్యతారాహిత్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమది ప్రజా పాలన అని చెప్పుకుంటున్న రేవంత్ సర్కార్... పేద, బలహీన వర్గాల వారి పిల్లలకు నాణ్యమైన విద్యనందించటంలో విఫలమైందని విమర్శించారు. జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న 1,654 గెస్ట్ ఫ్యాకల్టీని రెన్యూవల్ చేయాలని కోరారు. రాష్ట్రంలో కొత్తగా మంజూరైన జూనియర్ కాలేజీలకు పోస్టులు మంజూరు చేయటం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రుణాల మంజూరులో మానవీయ కోణముండాలి

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంకర్లు సహకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకర్లు రుణాలు మంజూరు చేసినప్పటికీ, సబ్సిడీ మొత్తం విడుదలలో ప్రభుత్వాలు జాప్యం చేస్తుంటాయి. కానీ రాష్ట్రంలో అందుకు భిన్నమైన పరిస్థితి ఉంది. సబ్సిడీల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా బ్యాంకులు రుణాలు మంజూరు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రుణాల మంజూరు విషయంలో ప్రయివేట్ బ్యాంకులు లక్ష్యాలు సాధిస్తున్నప్పటికీ, జాతీయ బ్యాంకులు వెనుకంజలో ఉంటున్నాయని పేర్కొన్నారు. జాతీయ బ్యాంకుల బ్రాంచీల సంఖ్యను రోజురోజుకు తగ్గించడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ప్రజలు ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి ప్రయివేటు వైపు ఎందుకు మళ్లుతున్నారో ఆలోచించాల్సిన అవసరముందన్నారు.

తెలంగాణ కొత్త రాష్ట్రమైనప్పటికీ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడుతున్నదని భట్టి ఈ సందర్భంగా పేర్కొన్నారు. "రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ సౌకర్యం, చౌకగా మానవ వనరులు, ఫ్రెండ్లీ గవర్నమెంట్, కాస్మోపాలిటన్ సిటీ, భాషాపరమైన సమస్యలు ఎక్కడా లేకపోవడంతో పెట్టుబడులకు స్వర్గధామంగా మారింది. రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలతో పాటు, కోర్ ఇండస్ట్రీ, ఇతర క్లస్టర్లు అభివృద్ధి చెందాయి. ఆర్ఆర్ఆర్ నిర్మాణంతో తెలంగాణ రూపు రేఖలు మారిపోనున్నాయి" అని వివరించారు. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా 24 గంటలపాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధరలతో పాటు కొన్ని పంటలకు బోనస్ కూడా అందిస్తున్నట్టు వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులు, ప్రోత్సాహకాల వాటా విడుదలలో జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలను ఐదేండ్ల పాటు అందిస్తామన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ పథకం కింద ఐదు లక్షల ఇండ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వివరించారు. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్‌ను సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. త్వరలో కొత్త విద్యుత్ పాలసీని అందుబాటులోకి తీసుకురానున్నట్టు వివరించారు. బ్యాంకులు సహకరించకుంటే ఏ రాష్ట్రం అభివృద్ధి చెందదని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. పెద్ద ఎత్తున రుణాలివ్వండి, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన బ్యాంకర్లకు సూచించారు.

పెద్దలకో న్యాయం... పేదలకో న్యాయమా..!

బ్యాంకులు తమ తీరు మార్చుకోవాలి: తుమ్మల

బహుళ జాతి కంపెనీలకు, కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రుణాలిస్తున్న బ్యాంకులు రైతులకు రుణాలివ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నాయని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశ్నించారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రతీ ఏటా రుణ ప్రణాళిక పెరుగుతున్నప్పటికీ అందులో రైతులు, నిరుపేదల వాటా తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గతేడాది కంటే ఈ ఏడాది రూ.13 వేల కోట్ల రుణాలు అధికంగా మంజూరు చేసినప్పటికీ చిన్న, సన్నకారు రైతుల సంఖ్య అనుకున్నంతగా లేదని చెప్పారు. రాష్ట్రంలో 73.11 శాతం భూములు వీరి వద్దనే ఉన్న నేపథ్యంలో పరిమితిని తొలగించి రుణాలను పెంచాలని సూచించారు. పంటరుణాల గ్రహీతల వివరాలు సమగ్రంగా లేకపోవడతో వారికి ప్రభుత్వం ద్వారా అందే సహాయం కోల్పోతున్నారని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయిల్ పామ్ సాగుకు బ్యాంకుల ప్రోత్సాహం కరువైందని వాపోయారు. రాష్ట్రంలో 18,654 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేపడితే కేవలం 50 శాతం కంటే తక్కువ రుణాలను మంజూరు చేశారని గుర్తు చేశారు.

ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి, ఆ దిశగా బ్యాంకులు పనిచేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. పథకాల విధానాలు నియమ, నిబంధనల పేరుతో అసలు ఉద్దేశాన్ని బ్యాంకులు మర్చిపోతున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని 6,415 బ్యాంకు శాఖలు సేవలందిస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో కేవలం 1,874 మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. అందువల్ల కొత్త శాఖలను గ్రామాలకు విస్తరించాలని సూచించారు. రైతులు ప్రభుత్వ పథకాల ద్వారా బ్యాంకుల నుంచి ఎలా ప్రయోజనం పొందవచ్చో వారికి తెలియజేయాలని సూచించారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి సహకరించాలని బ్యాంకర్లకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

బదిలీలు, పదోన్నతులు కొనసాగించడం సంతోషం

విద్యాశాఖ అధికారులతో యూఎస్‌పీసీ, జాక్టో నేతల చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను కొనసాగించడం పట్ల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ), ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) సంతోషం వ్యక్తం చేశాయి. బుధవారం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు లింగయ్యను యూఎస్‌పీసీ, జాక్టో నాయకులు చావ రవి, జి సదానందంగౌడ్, టి లింగారెడ్డి, ప్రకాశ్‌రావు కలిసి వివిధ అంశాలపై చర్చించారు. పోస్టు అప్‌గ్రేడ్ అయి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి వచ్చి చేరిన సందర్భంలో ఆ పోస్టుల్లో పనిచేస్తున్న పదోన్నతి రాని పండితులు, పీఈటీలను అదే పాఠశాలల్లో తాత్కాలికంగా కొనసాగించాలని కోరారు. అందుకు సంబంధించి డీఈవోలకు సమాచారమిచ్చారనీ, మూడు, నాలుగు రోజుల్లో వారిని సర్దుబాటు చేస్తామన్నారని తెలిపారు. మల్టీజోన్-1 పరిధిలోని కొన్ని జిల్లాల పదోన్నతుల ఉత్తర్వుల్లో దొర్లిన పొరపాట్ల సవరణ ప్రక్రియ పాఠశాల విద్యాశాఖలో కొనసాగుతున్నదని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం వరకు అన్ని జిల్లాలు, అన్ని సబ్జెక్టులకు పదోన్నతుల ఉత్తర్వులను జిల్లాలకు పంపిస్తారని వివరించారు. మల్టీజోన్-2 పరిధిలోని జిల్లాల స్కూల్ అసిస్టెంట్ బదిలీల సీనియార్టీ జాబితాలను బుధవారం సాయంత్రం రూపొందించి గురువారం ఉదయం నుంచి ఆప్షన్లను తీసుకునే అవకాశముందని తెలిపారు. 2024, జూన్ ఒకటి నాటికి రెండేండ్ల సర్వీసు పూర్తయిన వారు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోనివారు, ఎనిమిదేండ్ల సర్వీసు నిండిన తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారు డీఈవోలకు మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోవడానికి అనుమతించారని వివరించారు. ఒకటికన్నా ఎక్కువ సబ్జెక్టుల్లో పదోన్నతి పొందిన వారి వివరాలను డీఈవోల నుంచి అధికారికంగా సేకరించి మిగిలిన ఖాళీల్లో తదుపరి పదోన్నతులు ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఎల్ఎఫ్ఎల్ పీఎస్‌హెచ్ఎం పదోన్నతికి ఎస్జీటీ ఉపాధ్యాయులందరికీ అర్హత కల్పించే విధంగా 11, 12 జీవోలను సవరించాలనీ, 5,571 పీఎస్‌హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు.



గూడుకోసం పోరు

బోదపురం ప్రభుత్వ భూముల్లో సీపీఐ(ఎం) జెండాలు

నవతెలంగాణ-వెంకటాపురం

గూడు కోసం ఆదివాసీలు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరుబాట పట్టారు. అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూముల్లో ములుగు జిల్లా వెంకటాపురం మండలం బోదాపురం ఆదివాసీలు బుధవారం జెండాలు పాతారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ఆలుభాక జోన్ కన్వీనర్ శ్రీను, నాయకులు కృష్ణ, రాములు మాట్లాడుతూ.. ఆదివాసీలకు బోదాపురంలోని ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాలు కేటాయించాలని పలుమార్లు రెవెన్యూశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశామన్నారు. ప్రభుత్వ భూమిని ఆదివాసీలకు కేటాయింపు చేయకపోగా ఆ స్థలం ఓ రెవెన్యూశాఖ ఉద్యోగి కాజేయలని చూస్తున్నారని ఆరోపించారు. దీంతో నిరుపేదలు స్థలంలో జెండాలు పాతినట్టు తెలిపారు. అధికారులు స్పందించి నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు.

పది వేల మంది టీచర్లకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు

మల్టీజోన్-1 పరిధిలో 19 జిల్లాల్లో ఉత్తర్వులు జారీ

5,306 మంది భాషాపండితులు, 1,057 మంది పీఈటీలకు ప్రమోషన్లు

3,637 మంది ఎస్జీటీలకు పదోన్నతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో మల్టీజోన్-1 పరిధిలోని 19 జిల్లాల్లోని ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పదోన్నతులు లభించాయి. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఉపాధ్యాయులకు బుధవారం డీఈవోలు జారీ చేశారు. వెంటనే పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు కొత్త పాఠశాలల్లో చేరాలని ఆదేశించారు. భాషా పండితులు, పీఈటీలతోపాటు సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)లకు ఆయా సబ్జెక్టుల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించాయి. మల్టీజోన్-1 పరిధిలో పదోన్నతులు పొందిన వారిలో 5,306 మంది భాషాపండితులు, 1,057 మంది పీఈటీలు, 3,637 మంది ఎస్జీటీలున్నారు. భాషాపండితులు, పీఈటీల పదోన్నతులకు సంబంధించి 15 ఏండ్ల కల సాకారమైంది. ఎట్టకేలకు వారు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఆపాలంటూ విద్యాశాఖను మంగళవారం హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఉత్తర్వులు అందలేదు. దీంతో పదోన్నతుల ప్రక్రియను యధాతథంగా విద్యాశాఖ కొనసాగించింది. మల్టీజోన్-1 పరిధిలోని 19 జిల్లాల్లో పదివేల మంది భాషాపండితులు, పీఈటీలు, ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించింది. మల్టీజోన్-2 పరిధిలో ఇప్పటికే 776 మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్ఎం పదోన్నతులు లభించాయి.

ఉపాధ్యాయ సంఘాల హర్షం

రాష్ట్రంలో పది వేల మంది భాషాపండితులు, పీఈటీలు, ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులను కల్పించడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం ప్రకటించాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, విద్యాశాఖ అధికారులకు పీఆర్టీయూ తెలంగాణ ధన్యవాదాలు తెలిపింది. పలు రకాలైన కేసులను హైకోర్టులో వేసినప్పటికీ న్యాయ సలహాలు తీసుకుని సకాలంలో షెడ్యూల్ ప్రకారం పదోన్నతులు కల్పించడం పట్ల పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనను పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షంగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. పదోన్నతుల్లో పోస్టులు మిగలకుండా 1:3 జాబితాను రూపొందించి అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మ్యాన పవన్ ధన్యవాదాలు తెలిపారు. ఒకే ఉపాధ్యాయునికి ఒకటి కన్నా ఎక్కువ పోస్టుల్లో పదోన్నతులు వస్తే ఖాళీలు ఉండకుండా అర్హులైన వారికి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వానిదే బాధ్యత : ఎల్‌సీజీటీఏ

ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు ఇచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్‌సీజీటీఏ) అధ్యక్షులు ఎం వీరాచారి తెలిపారు. ఉద్యోగి నియామకం అయినపుడు ఉన్న నిబంధనలే వర్తిస్తాయని పేర్కొన్నారు. వాటిలో ఏమైనా మార్పులుంటే కొత్త వారికి వర్తింపచేయాలని సూచించారు. ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం 2010, ఆగస్టు 23 కంటే ముందు నియామకమైన వారికి టెట్ వర్తించబోదంటూ స్పష్టం ప్రకటించిందని తెలిపారు. దీని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం 36 జీవోను విడుదల చేసిందని గుర్తు చేశారు. అందుకనుగుణంగా 2010, ఆగస్టు 23 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ లేకుండానే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రాథమిక ఉపాధ్యాయుల హక్కులను కాలరాస్తున్న షెడ్యూల్ : టీఎస్‌పీటీఏ

రాష్ట్రంలో పదోన్నతుల షెడ్యూల్ 65 వేల మంది ప్రాథమిక ఉపాధ్యాయుల హక్కులను కాలరాస్తున్నదని టీఎస్‌పీటీఏ అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ, ప్రధాన కార్యదర్శి పిట్ల రాజయ్య తెలిపారు. విద్యాశాఖ చరిత్రలో ఇది అన్యాయంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ షెడ్యూల్‌లో అధికారులు తేనెతుట్టెను కదిపారనీ, దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో భవిష్యత్తులో తెలుస్తాయని తెలిపారు. షెడ్యూల్‌లో జరిగిన దారుణాలపై ప్రాథమిక ఉపాధ్యాయులు ముక్తకంఠంతో గర్జించే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ప్రాథమిక ఉపాధ్యాయుల శక్తి ఏంటో చూపిస్తామని తెలిపారు.

నిజమైన రైతు ప్రతినిధులతో చర్చలు జరపండి : ఎస్కేఎం



న్యూఢిల్లీ : నిజమైన రైతు ప్రతినిధులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) డిమాండ్ చేసింది. కేంద్ర బడ్జెట్ 2024-25 కోసం ఆలోచనలు, సూచనలు సేకరించేందుకు వివిధ భాగస్వాములతో కేంద్ర ఆర్థిక మంత్రి వ్యక్తిగతంగా సమావేశం కానున్నారని, ఇందులో భాగంగా ఈ నెల 21న రైతు సంఘాలు, వ్యవసాయ ఆర్థికవేత్తలతో కేంద్ర మంత్రి సమావేశం ఉందనే వార్తల నేపథ్యంలో ఎస్కేఎం ఈ డిమాండ్ చేసింది. తీవ్రంగా ఉన్న వ్యవసాయ సంక్షోభం పరిష్కారానికి సంబంధించిన ప్రతిపాదనలతో ఎస్‌కెఎం ఇప్పటికే మెమోరాండంను సమర్పించినట్లు తెలిపింది. అలాగే అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) కూడా కనీస మద్దతు ధరలను నిర్ణయించడానికి, వ్యవసాయ ఖర్చులు తగ్గించడానికి ప్రతిపాదనలు సమర్పించింది. అయినా కూడా ఆర్థిక మంత్రితో సమావేశానికి ఎస్కేఎం, ఎఐకెఎస్ ప్రతినిధులకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఇంకా ఆహ్వానం పంపలేదని ఎస్కేఎం గుర్తు చేసింది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానంతో ఉద్దేశపూర్వకంగానే నిజమైన రైతు ప్రతినిధులను పక్కన పెట్టడం, రైతు సమస్యలపై కంటి తుడుపు చర్యలు తీసుకోనుందని స్పష్టమవుతుందని ఎస్కేఎం విమర్శించింది. ఈ విధానాన్ని ఎస్కేఎం ఖండించింది. మోడీ ప్రభుత్వం తన అహంకారాన్ని విడిచిపెట్టాలని, 159 గ్రామీణ లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలని పిలుపునిచ్చింది. అలా కాకపోతే, రైతులు నుంచి భారీ చైతన్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది.

నోటరీదారులకు పట్టాలు ఇవ్వాలి

186 జీవో అమలు చేయాలి

- వ్యాపారుల చేతుల్లో మోసపోయిన బాధితులకు న్యాయం చేయాలి : వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య
- వట్టినాగులపల్లిలో ఇండ్ల జాగాల బాధితులను కలిసిన వ్యకాస బృందం
- గండిపేట తహసీల్దార్‌కు వినతిపత్రం



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

గతంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 186ను అమలు చేస్తూ నోటరీదారుల ఇంటి జాగాలకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య ప్రభుత్వాన్ని కోరారు. పేద ప్రజలకు ప్రభుత్వ భూమిని విక్రయించి మోసం చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకుని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. రంగారెడ్డి జిల్లాలోని గండిపేట మండల పరిధిలోని వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 130/3, 130/4లో నోటరీ ద్వారా కొనుగోలు చేసిన ఇంటి జాగాల్లో పేదలు ఇండ్లు నిర్మించుకున్నారు. వీటిని ఈ నెల 16వ తేదీన అధికారులు కూల్చేశారు. ఈ విషయం తెలుసుకున్న వ్యకాస బృందం బుధవారం ఆ ప్రాంతాన్ని సందర్శించింది. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.నాగయ్య, వెంకట్రాములు ఇండ్లు కూల్చిన స్థలాన్ని పరిశీలించి, వాస్తవ విషయాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులతో కలిసి గండిపేట తహసీల్దార్‌ను కలిసి పేదల సమస్యలను వివరించారు. ప్రభుత్వ భూములను భూ బకాసురుల నుంచి కాపాడి, బాధితులకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడారు. 2016లో భిక్షపతి, పెంటమ్మ దగ్గర అసైన్డ్ భూమిని జావిద్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి కొనుగోలు చేశాడని చెప్పారు. అనంతరం ఆ భూమిని పాట్లుగా చేసి 130 మంది పేదలకు నోటరీ ద్వారా విక్రయించారని చెప్పారు. ఈ జాగాల్లో కొనుగోలుదారులు ఇండ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ప్రభుత్వం వీటికి కరెంట్ కనెక్షన్, వాటర్ కనెక్షన్లు మంజూరు చేసిందని వివరించారు. కానీ కొన్ని రోజుల తరువాత ఈ జాగాలు ప్రభుత్వ భూములని అధికారులు పేదల ఇండ్లు కూల్చివేశారని చెప్పారు. ఆ తరువాత పేదలు మళ్లీ ఇండ్లు నిర్మించుకోవడం, అధికారులు కూల్చడం పరిపాటిగా మారిందన్నారు. ఈ క్రమంలో జావిద్ ఈ విషయంలో జోక్యం చేసుకుని 59జీఓ ప్రకారం జాగాలకు పట్టాలు ఇప్పిస్తానని మరోమారు బాధితుల నుంచి డబ్బులు వసూలు చేశాడని తెలిపారు. కానీ పట్టాలు ఇప్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పేదలు మళ్లీ గుడిసెలు వేశారని తెలిపారు. దాంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారి పోలీసులు, అధికారుల సహకారంతో పేదల ఇండ్లపై మరోసారి దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పేదలకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వ అధికారులు భూ బకాసురులకు వత్తాసు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో కనీసం పేదలు జీవనం సాగించకుండా డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారని చెప్పారు. పేదల గుడిసెల కూల్చిన విషయం తమ దృష్టికి రాగా.. బాధితులను కలిసి వివరాలు తెలుసుకున్నట్టు చెప్పారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వ్యకాస ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మంత్రి.. వర్సెస్ ఎమ్మెల్యే

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రొటోకాల్ వివాదం

కొల్చారం అభివృద్ధి కార్యక్రమాల్లో..

విద్యతోనే అంతరాలు పోతాయి :మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ- కొల్చారం

మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి, ఎమ్మెల్యే మధ్య ప్రొటోకాల్ వివాదం తలెత్తింది. మొదట ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట కార్యక్రమం రసాభాసగా మారింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల తోపులాటతో పెద్ద గొడవే జరిగింది. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ రాహుల్ రాజ్ నచ్చజెప్పినప్పటికీ ఇరు పార్టీల కార్యకర్తలు తగ్గలేదు. దీంతో విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలను అందజేసి సమావేశాన్ని అర్థాంతరంగా ముగించి మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వెళ్లిపోయారు. అనంతరం నూతనంగా నిర్మించిన మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రొటోకాల్ పాటించడం లేదంటూ మంత్రి, ఎమ్మెల్యే మధ్య వివాదం చెలరేగింది. దీంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. చివరికి గొడవ సద్దుమనగడంతో కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి మండల ప్రజా పరిషత్తు భవనాన్ని ప్రారంభించారు. పోతంశెట్టిపల్లి గ్రామంలో రూ.2.50 కోట్లతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు కళ్యాణ లక్ష్మీ, షాదీముభారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ.. విద్యతోనే అంతరాలు పోవాలని, ఆర్థిక సామాజిక అంతరాలను తగ్గించేది విద్య అని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు చేపడుతున్నదని, అందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో బోధనలో విప్లవాత్మక మార్పులకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, సోమన్నగారి రవీందర్ రెడ్డి, సుహాసిని రెడ్డి, ఆంజనేయులు గౌడ్, డిఆర్‌డిఓ పిడి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎంపీడీవో లక్ష్మీనర్సింహా, ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘాల తదితరులు పాల్గొన్నారు.

సమాఖ్యవాద సూత్రాలకు పూర్తి విరుద్ధం

కువైట్ వెళ్ళేందుకు కేరళ ఆరోగ్య మంత్రికి అనుమతి నిరాకరణపై మోడీకి కేరళ సీఎం లేఖ



(ఫైల్)

తిరువనంతపురం : ఇటీవల కువైట్‌లో అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో అక్కడి సహాయక చర్యలను సమన్వయం చేసేందుకు కువైట్ వెళ్లడానికి కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జికి విదేశాంగ శాఖ రాజకీయ అనుమతి నిరాకరించడంపై ప్రధాని నరేంద్ర మోడీకి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఒక లేఖ రాశారు. ఇలా అనుమతి నిరాకరించడమనేది సహకార సమాఖ్యవాదం సిద్ధాంతాలకు సూత్రాలకు పూర్తి వ్యతిరేకమని విజయన్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ నెల 15న ఆయన ఈ లేఖ రాయగా 19న బహిరంగ పరిచారు. భవిష్యత్తులోనైనా ఇలాంటి అభ్యర్ధనలు వచ్చినపుడు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందిగా విదేశాంగ శాఖకు సూచించాల్సిందిగా కోరారు.

కువైట్‌కు మంత్రి వెళ్ళి వుంటే విదేశాంగ సహాయ మంత్రితో, అధికారుల బృందంతో, ఎంబసీతో అనుసంధానించేందుకు చాలా దోహదపడి వుండేదని ఆయన పేర్కొన్నారు. పైగా దీనివల్ల బాధితుల కుటుంబాలకు మానసికంగా ఉపశమనం కలగడంతో పాటూ వారి కుటుంబాల్లో విశ్వాసం నెలకొనేదన్నారు. కువైట్ అగ్ని ప్రమాదంలో 49మంది మరణించారు. వీరిలో 23మంది కేరళీయులే వున్నారు. ఆపత్కాలంలో వివాదాన్ని సృష్టించడచం తన ఉద్దేశం కాదని విజయన్ పేర్కొన్నారు. రాజకీయ అనుమతి కోసం చేసిన అభ్యర్ధనపై స్పందించలేదన్న విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్ళకపోతే అది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న సమిష్టి నిర్ణయాన్ని విస్మరించారు. 2023 ఫిబ్రవరి 28నాటి క్యాబినెట్ సెక్రెటేరియట్ ఆఫీస్ మెమోరాండం ప్రకారమే రాజకీయ అనుమతి కోరాం. అనుకోకుండా తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో ఈ అభ్యర్ధన కూడా చేయాల్సి వచ్చింది. అయినా ఇలాంటి అభ్యర్ధనలను పట్టించుకోకుండా అనుమతి నిరాకరించడమంటే సమాఖ్యవాదం సూత్రాలను పూర్తిగా ఉల్లంఘించడమేనని విజయన్ తన లేఖలో పేర్కొన్నారు. అభివృద్ధి పంథాను అనుసరించే క్రమంలో, ప్రజలు ప్రకృతి విపత్తులు ఎదుర్కొనే సమయంలో కేంద్ర, రాష్ట్రాలు సమాన భాగస్వాములని ఆ లేఖలో విజయన్ పేర్కొన్నారు.

ఇటువంటి అనుమతులు జారీ చేసేటపుడు ఎలాంటి రాజకీయ పరిగణనలు అడ్డు రాకూడదని విజయన్ మోడీకి స్పష్టం చేశారు. తీసుకునే నిర్ణయం ఏదైనా ఇటువంటి పక్షపాతం కనిపించరాదన్నారు.

భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు ఉత్పన్నమైనపుడు విదేశాంగ శాఖ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేలా సూచించాల్సిందిగా ప్రధానిని విజయన్ కోరారు. ఆరోగ్యకరమైన సహకార సమాఖ్యవాద వాతావరణాన్ని సృష్టించడానికి కేంద్రం, రాష్ట్రాల మధ్య సుహృద్భావ సంబంధాలు నెలకొని వుండడం చాలా కీలకమని ఆయన స్పష్టం చేశారు.

పవన్‌కళ్యాణ్ బాధ్యతల స్వీకరణ

పలువురి అభినందన

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన ఛార్జీ తీసుకున్నారు. ఉపముఖ్యమంత్రి హోదాలో ఉన్న పవన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. పలు ఫైళ్లపై ఆయన సంతకాలు చేశారు. ఉపాధి హామీ పథకానికి ఉద్యానవన పనులను అనుసంధానించే నిధులు మంజూరు దస్త్రంపై, గిరిజన గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణం ఫైలుపై ఆయన సంతకాలు చేశారు. అనంతరం ఆయన సోదరుడు నాగబాబు, ఆయా శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, జనసేన పార్టీ నేతలు పవన్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. వీరిలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్ యాదవ్, టీడీపీ నేత, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ వర్మ తదితరులు ఉన్నారు.

హోంమంత్రిగా అనిత

ఏపీ హోంమంత్రిగా వంగలపూడి అనిత బాధ్యతలు చేపట్టారు. సచివాలయంలోని బ్లాక్-2లో ఫైళ్లపై ఆమె సంతకాలు చేశారు. అంతకుముందు కూతురు రష్మితతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయా శాఖ అధికారులు, నేతలు మంత్రికి అభినందనలు తెలిపారు. బుధవారం ఒక్కరోజే దాదాపు 12 మంది మంత్రులు ఛార్జీ తీసుకోవడం గమనార్హం.

డిమాండ్ల సాధనకై జులై 10న ధర్నాలు ఆందోళనలు

కార్మిక లోకానికి సీఐటీయూ పిలుపు



న్యూఢిల్లీ : కార్మిక చట్టాలను రద్దు చేయడంతో సహా అగ్నివీర్, ఆయుధవీర్ వంటి ఉపాధి పథకాలను రద్దు చేయాలని, పర్మినెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులను పరిగణించి,వారికి వేతనాలు, ఇతర భత్యాలు ఇవ్వాలని కోరుతూ జులై 10న దేశవ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనలు నిర్వహించాలని సీఐటీయూ పిలుపిచ్చింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసి బీజేపీ సంపూర్ణ మెజారిటీని సాధించలేకపోవడంతో దేశంలో నెలకొన్న తాజా పరిస్థితులపై సీఐటీయూ కార్యదర్శివర్గం ఈ నెల 17,18 తేదీల్లో న్యూఢిల్లీలో సమావేశమై చర్చించింది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, పని పరిస్థితులు, పెన్షన్లు వంటి జీవనోపాధి అంశాలపై గత పదేండ్ల బీజేపీ పాలనలో కార్మిక వర్గం నిరంతరంగా సాగించిన పోరాటాలు, ప్రచారాలు ఈ ఎన్నికల ప్రచారంలో కొంతమేరకు దోహదపడ్డాయని సీఐటీయూ కార్యదర్శివర్గం పేర్కొంది. ఈసారి ఎన్నికల్లో పూర్తి మెజారిటీ రాకపోయినా ఎన్‌డీఏ ప్రభుత్వ విధానాల్లో ఎలాంటి మార్పువుంటుందని మనం ఆశించలేమని సీఐటీయూ పేర్కొంది. నయా ఉదారవాద చట్రపరిధి నుండి వెనక్కు మళ్ళుతుందని కూడా ఆశించలేమని తెలిపింది. కార్మిక చట్టాల అమలును నోటిఫై చేస్తూ ప్రభుత్వం చేసిన ప్రకటనలో, కార్మికుల ఈపీఎఫ్ బకాయిలను చెల్లించడంలో యజమానులు విఫలమైతే వారికి విధించే జరిమానాలను గణనీయంగా తగ్గించడంలో, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపీ) వంటి వాటితో ప్రయివేటీకరణ చర్యలను చేపట్టడంలో ఈ ధోరణి కనిపిస్తోందని పేర్కొంది. ప్రజలను సమాయత్తం చేసి, ఈ విధానాలపై దాడికి వ్యతిరేకంగా గట్టి ప్రతిఘటనను నిర్మించడానికి తక్షణమే ప్రచారాన్ని చేపట్టాలని సీఐటీయూ కార్యదర్శివర్గం ఏకగ్రీవంగా నిర్ణయించింది. కింది స్థాయి నుండి ప్రచారాలు, ప్రజా సమీకరణ చపట్టేందుకు దశలవారీగా కార్యాచరణలో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో జులై 10న తహసిల్, జిల్లాస్థాయిల్లో ధర్నాలు, ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఒక ప్రకటనలో తెలిపారు.

కార్మిక చట్టాలను రద్దు చేయాలని, ఎన్ఎంపీని రద్దు చేసి ఇతర ప్రైవేటీకరణ చర్యలన్నింటినీ నిలుపుచేయాలని, కార్మికులందరికీ నెలకు రూ.26వేలకు తగ్గకుండా కనీస వేతనం నిర్ణయించాలని, కాంట్రాక్టర్ మారినా కాంట్రాక్ట్ కార్మికులను తొలగించకుండా కాంట్రాక్ట్ వర్కర్లకు ఉపాధి భద్రతకు హామీ కల్పించాలని, ఒకే తరహా ఉద్యోగాలు చేస్తున్న వారందరికీ వారు కాంట్రాక్ట్ వారైనా, శాశ్వత ఉద్యోగులైనా సరే అందరికీ సమాన వేతనాలు, ప్రయోజనాలు కల్పించాలని, అగ్నివీర్, ఆయుధవీర్, కొయలావీర్, ఇతర నిర్దిష్ట కాలపరిమితి గల ఉపాధులను రద్దు చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. కొత్త పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరింది. ఇపిఎస్ పెన్షన్‌దారులకు రూ.9వేలు ఆ పైన కనీస పెన్షన్‌వచ్చేలా చూడాలని కోరింది. స్కీమ్ వర్కర్లను గుర్తించాలని, ఇతరులతో సమానంగా వారికి కనీస వేతనాలు, సామాజిక భద్రతా ప్రయోజనాలు, పెన్షన్ వంటి సదుపాయాలను కల్పించాలని కోరింది. స్థానికంగా వున్న డిమాండ్లు కూడా అవసరమైతే ఈ డిమాండ్ల పత్రంలో చేరుస్తామని పేర్కొంది. జులై 10న డిమాండ్ల దినంగా అఖిల భారత అంగన్‌వాడీ కార్మికులు, హెల్పర్ల సమాఖ్య (ఎఐఎఫ్ఎడబ్ల్యుఎహెచ్) పాటించనుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంచేయాల్సిందిగా సీఐటీయూ కార్మిక లోకానికి విజ్ఞప్తి చేసింది.

రాష్ట్రంలో విచిత్ర పాలన

అప్రధాన విషయాలకే సీఎం ప్రాధాన్యత : మాజీ మంత్రి కొప్పుల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన విచిత్రంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ ప్రజలకు ఉపయోగపడే విషయాలపై కాకుండా అప్రధాన అంశాలకే ప్రాధాన్యతనిస్తున్నారని ఆయన ఆక్షేపించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కొప్పుల మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం (రాజముద్ర)తోపాటు టీఎస్‌ను టీజీగా మార్చటం తదితర చర్యలకు పాల్పడటం శోచనీయమని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎత్తేసేందుకు సీఎం కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. తద్వారా కేసీఆర్ మార్కు లేకుండా చేసేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు మానుకుని, పరిపాలనపై దృష్టి సారించాలని కొప్పుల ఈ సందర్భంగా సీఎంకు విజ్ఞప్తి చేశారు.

ఆ అవగాహన లేనిది జీవన్‌రెడ్డికే..

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1పై అవగాహన లేనిది మాజీ మంత్రి హరీశ్‌కు కాదనీ, కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికే దానిపై అవగాహన లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. తమ నేత హరీశ్‌పై విమర్శలు గుప్పించే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలంటూ జీవన్‌రెడ్డికి సూచించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడే గ్రూప్-1 ఇంటర్వ్యూలకు 1 : 100 నిష్పత్తిలో పిలిచారంటూ గుర్తు చేశారు. ఆ విధానం సాధ్యం కాదంటూ జీవన్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు.

కాంగ్రెస్ నేతల జేబులు నింపడానికే

ఇసుక టెండర్లపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేవంత్ ప్రభుత్వం కాంగ్రెస్ నేతల జేబులు నింపడానికే ఇసుక టెండర్లను పిలిచిందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యానించారు. మేడిగడ్డ బ్యారేజీ నుంచి 92 లక్షల క్యూబిక్ మీటర్ల టన్నుల ఇసుకను తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సుమన్ మాట్లాడుతూ... మేడిగడ్డ బ్యారేజీని కాంగ్రెస్ సర్కారు రిపేరు చేయకపోగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీద నిందలు వేయటానికే దాన్ని ఉపయోగించుకుందని విమర్శించారు. ఆ రకంగా విలువైన సమయాన్ని వృధా చేసిందని వాపోయారు. నీట్ పరీక్షపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. గొర్రెల కొనుగోళ్ల అంశంలో జోక్యం చేసుకున్న ఈడీ... నీట్ విషయంలో ఎందుకు జోక్యం చేసుకోవటం లేదని ప్రశ్నించారు.

పింఛన్ మహా ప్రభో

(మొదటిపేజీ తరువాయి)

రూ.4016 ఇస్తామని చెప్పింది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా రెండు నెలలుగా పింఛన్ డబ్బులు అందని పరిస్థితి. ఏప్రిల్, మే నెలలో ఇవ్వాల్సిన డబ్బులు లబ్దిదారుల ఖాతాలో వేయలేదు. పెంచుతామన్న పింఛన్ డబ్బులు కూడా పెంచలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం పింఛన్ పొందుతున్న వారిలో వృద్ధులు, వితంతువులు వికలాంగులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, హెచ్ఐవీ బాధితులు, డయాలసిస్, ఫ్లోరోసిస్ ఇతర పింఛన్‌దారులు కలిపి మొత్తం 44 లక్షల మంది లబ్దిదారులున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజా పాలనలో కొత్తగా పింఛన్ కోసం 24.84 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్ని రకాల పింఛన్లు కలిపి 469575 మంది లబ్దిదారులకు పింఛన్ ఇస్తున్నారు. వీరి కోసం ప్రతి నెలా రూ.102.32 కోట్ల నగదుని లబ్దిదారుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో జమ చేసేది. ఇందులో 37785 మంది వికలాంగులకు రూ.15.17 కోట్లు, మిగతా 431790 మందికి రూ.87.04 కోట్ల చొప్పున పింఛన్‌దారులకు చెల్లించేది.

రెండునెలలుగా అందని వైనం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ వచ్చింది. నేరుగా ఆర్థిక భారం పడే కొన్ని పథకాల విషయంలో మాత్రం వాయిదా వేసింది. అందులో చేయూత పథకం కింద ప్రతి నెలా ఇవ్వాల్సిన పింఛన్ డబ్బుల విషయంలో కొంత జాప్యం జరుగుతోంది. కొందరు లబ్దిదారుల్లో నిత్యం మందుగోలీలు, ఇంజక్షన్స్ వేసుకునే వాళ్లున్నారు. ముఖ్యంగా డయాలసిస్, హెచ్ఐవీ బాధితులు నిత్యం వైద్య సేవలు పొందుతూనే ఉండాలి. అలాగే వికలాంగులు పూర్తిగా పింఛన్ ఆధారంగా జీవిస్తున్న వాళ్లే అధికంగా ఉన్నారు. స్వతహాగా ఏ కాయా కష్టం చేయలేక, కదల్లేక, మాట్లాడలేక రెండో మనిషి సాయముంటే తప్ప కదల్లేని వాళ్లకూ పింఛన్ ఎంతో అవసరం. నిత్యం మందులు, వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు పైసలు కావాలి. మరో పక్క వృద్ధులైతే షుగర్, బీపీ ఇతర అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వారికి పింఛన్ చేతికందితే తప్ప మందుబిళ్ల కొనలేని పరిస్థితి. ఒంటరి మహిళలు, వితంతువులు, కల్లుగీత, చేనేత, బీడీ కార్మికులు సైతం పింఛన్ డబ్బులొస్తేనే కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ ఎప్పుడు పడుతుందోనన్న ఆశతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. జూన్ 20వ తేదీ వచ్చినా ఇంకా మే నెల పింఛన్ ఖాతాలో పడకపోతే తమ అవసరాలు ఎలా తీరుతాయని పలువురు పింఛన్‌దారులు వాపోతున్నారు.

సాయం కోసం ఎదురుచూపు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పింఛన్ కోసం లబ్దిదారులు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల వల్ల పింఛన్ డబ్బులందడంలో జాప్యం జరిగిందని చెబుతున్న ప్రభుత్వం కనీసం మే, జూన్ నుంచైనా రెగ్యులర్‌గా ఇవ్వని పరిస్థితి ఉండడంతో లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో 161662 మంది పింఛన్‌దారులుండగా మెదక్ జిల్లాలో 116728 మంది, సిద్దిపేట జిల్లాలో 191185 మంది పింఛన్‌దారులున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పింఛన్‌దారులు ఇలా ఉన్నారు. వితంతువులు 174940 మంది, వృద్ధులు 164405 మంది, వికలాంగులు 37785 మంది, బీడీ కార్మికులు 41608 మంది, ఒంటరి మహిళలు 15304 మంది, కల్లుగీత కార్మికులు 4814 మంది, చేనేత కార్మికులు 3525 మంది, బీడీ టేకేదారులు 300 మంది, హెచ్ఐవీ పేషెంట్స్ 3107 మంది, కిడ్నీ డయాలసిస్ పేషెంట్స్ 339 మంది చొప్పున పింఛన్ లబ్దిదారులున్నారు.

చేయూత కింద రూ.4 వేలు ఎప్పుడో..?

అధికారంలోకి వస్తే చేయూత కింద రూ.4 వేల పింఛన్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డినే ముఖ్యమంత్రి అయ్యారు. పాలనా పగ్గాలు చేతపట్టి ఆరు నెలలు కావస్తున్నా చేయూత కింద ఇస్తామన్న పింఛన్ డబ్బుల్ని పెంచకపోవడంతో.. వారంతా సీఎం నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. పెరిగినన అవసరాలు, ధరలతో ఆ డబ్బులు దేనికీ సరిపోవట్లేదని చెప్పిన కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి రాగానే రెండింతలు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రతి నెలా ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్ని రకాల పింఛన్ల కోసం అప్పటి ప్రభుత్వం రూ.102 కోట్ల మేర చెల్లించేది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 4 వేలకు పెంచితే ప్రతి నెలా రూ.204 కోట్లు కేటాయించాల్సి వస్తది. ఆరునెలలు దాటినందున ఇకనైనా పింఛన్‌ను రెండింతలు చేసి ప్రతి నెలా ఒకటో తేదీన చెల్లించాలని పింఛన్‌దారులు కోరుతున్నారు.

వికలాంగులను గోస పెట్టొద్దు :రామచంద్రం,వికలాంగుడు, ఎన్‌పీఆర్‌డీ

మాబోటి వికలాంగుల్ని గోస పెడితే ఏం న్యాయం. పింఛన్ రాక రెండు నెళ్లు. వికలాంగుల్లో పెళ్లం పిల్లలున్నోళ్లకు ఉప్పు, పప్పు కొనలేక పూట గడుస్తలేదు. రోగాలున్నోళ్లకు మందుబిళ్లకు పైసల్లేవు. చాలా మందికి పెళ్లిళ్లు కాలేదు. ఒంటరి జీవితంలో పింఛనే ఆధారంగా ఉంది. అలాంటి వాళ్లు కొందరు సంగారెడ్డిలో బిక్షమెత్తుకుంటున్నరు. పింఛన్ పైసలొస్తే మందుగోలి, వ్యక్తిగత అవసరాలు తీర్చుకుంటం. ఎన్నికల్లో చెప్పినట్లు వెంటనే పింఛన్‌ను రూ. 6016 చేసి రెగ్యులర్‌గా అందేట్లు చూడాలి. లేనిపక్షంలో వికలాంగులం రోడ్లెక్కి ఆందోళన చేయాల్సి వస్తది.

ఏపీ డీజీపీగా ద్వారకా తిరుమలరావు



అమరావతి : నూతన ఏపీ డీజీపీగా సిహెచ్ ద్వారకా తిరుమలరావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. 1989 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ద్వారకా తిరుమల రావు ప్రస్తుతం ఆర్‌టీసీ ఎమ్‌డీగా విధులు నిర్వహిస్తున్నారు. తక్షణమే ఈ నియామకం అమలులోకి వస్తుందని ఉత్తర్వుల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో హోంశాఖ కార్యదర్శిగా ఉన్న హరీష్‌గుప్తాను డీజీపీగా నియమించిన సంగతి తెలిసిందే. తాజా ఉత్తర్వుల్లో ఆయన్ను తిరిగి హోంశాఖ కార్యదర్శిగా పంపుతున్నట్టు పేర్కొన్నారు.

నిరసన వ్యక్తం చేయడం నేరం కాదు

- టీవీవీ సభ్యులపై కేసు డిస్మిస్ చేసిన హైకోర్టు



హైదరాబాద్ : బహిరంగ ప్రదేశాల్లో ప్రజల ఆస్తులకు నష్టం చేకూర్చకుండా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసే హక్కు ప్రజలకు ఉందని హైకోర్టు తీర్పు చెప్పింది. తెలంగాణ విద్యార్థి వేదిక సభ్యులపై పెట్టిన కేసును కొట్టేసింది. పౌరహక్కుల సంఘాలకు చెందిన ప్రొఫెసర్ సాయిబాబా, వరవరరావులను విడుదల చేయాలంటూ 2010 మే 17న అంబేద్కర్ విగ్రహం వద్ద పర్మిషన్ తీసుకోకుండా నిరసన తెలిపారంటూ 13 మందిపై సైఫాబాద్ పోలీసులు నమోదు చేశారు. దీనిని కొట్టేయాలని కోరుతూ టీవీవీ సభ్యులు కొత్తపల్లి మహేష్ ఇతరులు వేసిన పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేసింది. పిటిషనర్లు శాంతి భద్రతలకు భంగం కలిగించినట్లుగా ఆధారాలు లేవని చెప్పింది.. ప్రజాజీవనానికి ఇబ్బందిలేకుండా ప్రజాస్వామ్యయుతంగా . శాంతియుతంగా నిరసన తెలిపేందుకు రాజ్యాంగం వెలుసుబాటు ఇచ్చిందని చెప్పింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ కె. సుజన తీర్పు వెలువరించారు.

డీఆర్‌టీ తిరిగి జూ.ఎన్టీఆర్ కేసు విచారించాలి

జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలోని జూనియర్ ఎన్టీఆర్ ఇంటి పై బ్యాంకులకు హక్కులు ఉన్నాయని డీఆర్ టీ ఇచ్చిన తీర్పును రద్దు చేసిన హైకోర్టు ఆ వివాదాన్ని తిరిగి డీఆర్‌టీకి పంపించింది. ఇరు పక్షాల వాదనలు విని తిరిగి ఉత్తర్వులు ఇవ్వాలంది. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలోని 681 చదరపు గజాల జాగాను జూనియర్ ఎన్టీఆర్ కొని ఇల్లు కట్టే ప్రయత్నం చేశారు. ఈ స్థలంపై తమకు హక్కులు ఉన్నాయని పలు బ్యాంకులు డీఆర్‌టీలో కేసు వేసి విజయం సాధించాయి. దీనిని కొట్టివేయాలని జూ.ఎన్టీఆర్ వేసిన పిటిషన్‌ను అనుమతిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాదే, జస్టిస్ అనిల్ కుమార్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జూ.ఎన్టీర్. 2003లో సుంకు గీత నుంచి స్థలాన్ని కొన్నారు. ఇల్లు కట్టేందుకు 2007లో పర్మిషన్లు పొందారు. 2012లో సర్ఫేస్ యాక్ట్ ప్రకారం ఎస్‌బీఐ డీఆర్‌టీ నుంచి ఉత్తర్వులు పొందడాన్ని సవాల్ చేసిన కేసులో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

సుప్రీం' కేసులపై అదాలత్

జులై 29 నుంచి ఆగస్టు 3 వరకు రాష్ట్రంలో సుప్రీంకోర్టులోని కేసులను స్పెషల్ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించే కార్యక్రమాన్ని నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించినట్టు స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి సీహెచ్. పంచాక్షరీ మీడియాకు చెప్పారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులపై తొలిసారి ప్రత్యేక లోక్ అధాలత్ జరుగుతుందన్నారు. ఇప్పటికే 295 కేసులను గుర్తించామన్నారు. ఆ కేసుల్లో వాద ప్రతివాదులకు నోటీసులు ఇచ్చి ఉభయతారకంగా పరస్పర అంగీకారంతో కేసుల్ని రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. వివరాల కోసం 040-23446723 ఫోన్ నెంబర్‌ను సంప్రదించవచ్చునిని చెప్పారు. సత్వర న్యాయం కోసం సుప్రీంకోర్టు రాష్ట్రంలో ఈ తరహాలో లోక్‌అదాలత్ నిర్వహించడం ఇదే ప్రథమమని చెప్పారు.

గ్రేస్ మార్కులపై ఎన్ఎంసీ రూల్స్ మార్పు చట్టబద్ధమే

ఎంబీబీఎస్ గ్రేస్ మార్కులకు సంబంధించి నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) రూల్స్ మార్పు చేయడాన్ని హైకోర్టు సమర్థించింది. అయితే, ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని గ్రేస్ మార్కులు కలపాలని కోరే విద్యార్థుల వినతులను చట్ట ప్రకారం పరిష్కరించాలని సూచించింది. గ్రేస్ మార్కులను తొలగిస్తూ 2023 ఆగస్టులో ఎన్ఎంసీ తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోమని చెప్పింది గ్రేస్‌మార్కులు పొందడం పిటిషనర్ల హక్కు కాదంది. ఎంబీబీఎస్ విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించి..ఒక సబ్జెక్టులో తక్కువ మార్కులొస్తే 5 గ్రేస్ మార్కులు ఇచ్చే విధానాన్ని ఈసారికి తమకు అమలు చేయాలని, తాము పాత నిబంధనలు అమల్లో ఉండగా అడ్మిషన్ తీసుకున్నామని విద్యార్థుల వాదనను తోసిపుచ్చింది. కేసు ప్రత్యేక పరిస్థితులను గమనంలోకి తీసుకుని పిటిషనర్లకు గ్రేస్ మార్కులను మంజూరు చేసే అంశంపై తగిన నిర్ణయం తీసుకోవాలని ఎన్ఎంసీ, వర్సిటీలకు సూచన చేసింది.

పేరెంట్స్ వాదనలు వినాల్సివుంది

పెండ్లి రిజిస్ట్రేషన్‌కు సబ్‌రిజిస్ట్రార్‌కు ఏవైనా ఉత్తర్వులు జారీ చేయాలంటే ముందుగా వివాహం చేసుకోబోయే వాళ్ల పేరెంట్స్ వాదనలు కూడా వినాలని హైకోర్టు చెప్పింది. వివాహ రిజిస్ట్రేషన్ చేయకుండా తల్లిదండ్రుల సంతకం కావాలన్న సబ్‌రిజిస్ట్రార్ నిర్ణయాన్ని హైదరాబాద్‌కు చెందిన ఎస్.వైదేహి, యూసఫ్ నజీబుద్దీన్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎస్.వి.శ్రవణ్‌కుమార్ బుధవారం విచారించారు. వాళ్ల పేరెంట్స్ వాదనలు విన్న తర్వాతే ఉత్తర్వులు ఇస్తామని చెప్పారు.

కాంగ్రెస్ దిద్దుబాటు చర్యలు

- తెలంగాణతో పాటు ఎనిమిది రాష్ట్రాలకు కమిటీలు



న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పేలవమైన పనితీరు కనబర్చిన రాష్ట్రాలపై కాంగ్రెస్ అధిష్టానం దృష్టి పెట్టింది. ఈ దిశలో జరిగిన తప్పిదాలను అంచనా వేసేందుకు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పార్టీ పేలవమైన పనితీరును అంచనా వేయడానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిజనిర్ధారణ కమిటీలను ఏర్పాటు చేశారు. తెలంగాణతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఢిల్లీ, కర్నాటక, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ లకు నిజ నిర్ధారణ కమిటీలు వేశారు. ఈ మేరకు బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో తెలంగాణకు సంబంధించి నిజనిర్ధారణ కమిటీలో పార్టీ సీనియర్ నేతలు పిజె కురియన్, రఖీబుల్ హుస్సేన్, పర్గత్ సింగ్ లకు బాధ్యతలు అప్పగించారు. అలాగే మధ్యప్రదేశ్ కు పృథ్వీరాజ్ చవాన్, సప్తగిరి ఉల్కా, జిగ్నేశ్ మేవానీ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ కు వీరప్ప మొయిలీ, హరీశ్ చౌదరి, ఒడిశాకు అజయ్ మాకెన్, తారిక్ అన్వర్ లకు బాధ్యతలు ఇచ్చారు. ఇక ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ మూడు రాష్ట్రాలకు కలిపి పి.ఎల్. పునియా, రజనీ పాటిల్ లకు చోటు కల్పించారు. కర్నాటక కమిటీకి మధుసూదన్ మిస్త్రీ, గౌరవ్ గొగోయ్, హిబీ ఈడెన్ లను సభ్యులుగా నియమించారు.

అందుకే నిజనిర్ధారణ కమిటీ

దక్షిణాదిలో తెలంగాణ నుంచి భారీ సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ అధిష్టానం ఆశలు పెట్టుకుంది. కనీసం తెలంగాణ నుంచి దాదాపు 10- 12 ఎంపీ స్థానాలు గెలుస్తామని భావించింది. అయితే ఊహించని ఫలితాలతో ఎనిమిది స్థానాల్లో గెలిచి, బీజేపీతో సమానంగా నిలిచింది. దీంతో తెలంగాణ రాష్ట్రాన్ని సైతం అధిష్టానం పూర్ ఫార్ఫార్మెన్స్ స్టేట్ కేటగిరిలో చేర్చి నిజనిర్ధారణ కమిటీ వేసినట్టు ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. ఇక కాంగ్రెస్ కు మధ్యప్రదేశ్, ఢిల్లీలు ఒక్క సీటు కూడా రాలేదు. ఈ రాష్ట్రాల్లో బీజేపీ క్లీన్ స్వీప్ చేసింది. అలాగే ఒడిశాలోనూ బీజేపీ పుంజుకుంది. చత్తీస్‌గఢ్ లో అసెంబ్లీ మాదిరిగానే, లోక్ సభ ఎన్నికల్లోనూ ఆశించిన ఫలితాలను రాబట్టుకోలేకపోయింది. అధికారంలో ఉన్న కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ లో పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. మరోసారి ఇక్కడ బీజేపీ బలం నిరూపించుకుంది. అయితే, ఆశించిన స్థానాలు రాకపోయినా... గట్టి పోటీని ఇచ్చింది. ఉత్తరఖండ్ పై కాంగ్రెస్ ఆశలు పెట్టుకున్నా ఎక్కువ సీట్లు గెలవడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది.

గాంధీ, అంబేద్కర్ విగ్రహాలను

యథాస్థానంలో ఉంచండి

లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మెన్లకు ఖర్గే లేఖ



న్యూఢిల్లీ : పార్లమెంట్ ప్రాంగణం నుంచి తొలగించిన మహాత్మా గాంధీ, బిఆర్ అంబేద్కర్, ఇతర నాయకుల విగ్రహాలను తిరిగి యథాస్థానంలో ఉంచాలని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌లకు కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే బుధవారం వేరువేరుగా లేఖ రాసారు. ప్రముఖ జాతీయ నాయకుల విగ్రహాలను ఎలాంటి సంప్రదింపులు లేకుండా మోడీ ప్రభుత్వం 'నిరంకుశం'గా ఒక మూలకు నెట్టివేసిందని లేఖలో ఖర్గే విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య ప్రాథమిక స్ఫూర్తిని ఉల్లంఘించడమేనని అన్నారు. 'ఎలాంటి సంప్రదింపులు లేకుండానే ఈ విగ్రహాలను యథేచ్ఛగా తొలగించడం మన ప్రజాస్వామ్య ప్రాథమిక స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని నేను ఖచ్చితంగా చెబుతున్నాను. ఇప్పటి వరకూ మహాత్మాగాంధీ, డాక్టర్ అంబేద్కర్, ఇతర జాతీయ నాయకుల విగ్రహాలు ప్రాధాన్యత కలిగిన స్థానాల్లో ఉన్నాయి ఎలాంటి ఆలోచన, పరిశీలన లేకుండానే చెప్పవచ్చు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ వ్యాప్తంగా ఉంచిన ప్రతీ విగ్రహం, దానిని ఉంచిన స్థానం అపారమైన విలువ, ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి' అని స్పీకర్‌కు, చైర్మన్‌కు పంపిన లేఖల్లో ఖర్గే పేర్కొన్నారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో జాతీయ నాయకులు, ఎంపీల చిత్రపటాలు, విగ్రహాలు ఏర్పాటు చేయడానికి ఒక ప్రత్యేక కమిటీ ఉన్న విషయాన్ని కాంగ్రెస్ అధ్యక్షులు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత అయిన ఖర్గే ఈ లేఖలో గుర్తు చేశారు. అయితే ఈ కమిటీని 2019 నుంచి ఏర్పాటు చేయలేదని ఖర్గే విమర్శించారు. 'సంబంధిత భాగస్వాములతో సరైన చర్చలు, సంప్రదింపులు లేకుండా తీసుకున్న ఇలాంటి నిర్ణయాలు మన పార్లమెంట్ నియమాలు, సంప్రదాయాలకు విరుద్ధం. అందువలన మన దేశ ఐక్యత, సమగ్రతకు విశేషంగా కృషి చేసిన మహాత్మా గాంధీ, డాక్టర్ అంబేద్కర్, ఇతర జాతీయ నాయకుల విగ్రహాలను గౌరవంతో, అభిమానంతో వాటివాటి యథాస్థానంలో మళ్లీ ఉంచాలని నేను డిమాండ్ చేస్తున్నాను' అని లేఖలో తెలిపారు. ఈ విగ్రహాలను తొలిగింపును కాంగ్రెస్ తీవ్రంగా విమర్శిస్తుందని చెప్పారు. ఈ నెల ప్రారంభంలో గాంధీ, అంబేద్కర్, ఛత్రపతి శివాజీ, బిర్సా ముండా, మహారాణా ప్రతాప్ వంటి ప్రముఖల విగ్రహాలను పార్లమెంట్ హౌస్ ప్రాంగణం నుంచి మోడీ ప్రభుత్వం తొలగించింది. దీనికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తున్నాయి.

బీసీ కులగణన చేయాల్సిందే

- రిజర్వేషన్ల వాటా తేల్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- మూడు రోజులు చాలు..15 రోజుల్లో పూర్తిచేయొచ్చు
- జులైలో బస్సు యాత్రలు
- లక్షలాది మందితో హైదరాబాద్‌లో బహిరంగ సభ
- ఊరూరా తిరిగి బీసీలను చైతన్యపరుస్తాం : బీసీ సంఘాల సమావేశంలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కులగణన చేసి బీసీ రిజర్వేషన్ల వాటా తేల్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. జులై నెలలో ఆలంపూర్ టు హైదరాబాద్, ఆదిలాబాద్ టు హైదరాబాద్ కు బస్సుయాత్రలు చేస్తామనీ, వాటి ముగింపు సందర్భంగా లక్షలాది మంది బీసీలతో హైదరాబాద్‌లో బహిరంగ సభ నిర్వహిస్తామని ప్రకటించారు. ఊరూరా తిరిగి బీసీలను చైతన్యపరుస్తామని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ చైర్మెన్, జస్టిస్(రిటైర్డ్) వి. ఈశ్వరయ్య మాట్లాడుతూ..దేశానికి గ్రామాలు మూలస్తంభాలనీ, అక్కడ బీసీలు అధికారాన్ని చేజిక్కించుకుని చట్టసభల దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో 50 శాతం రిజర్వేషన్లు దాటొద్దు అనే జడ్జిమెంట్ తప్పు అన్నారు. తమిళనాడులో 69 శాతం, బీహార్‌లో 50 శాతానికిపైగా అమలవుతున్న విషయాన్ని ప్రస్తావించారు. బీసీలంతా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం కోసం కొట్లాడాలని పిలుపునిచ్చారు. బీసీ కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. అధికారం చేతుల్లోకి రాగానే బీసీలను సీఎం రేవంత్‌రెడ్డి విస్మరిస్తున్నారనీ, రెడ్లకే పదవులు కట్టబెడుతున్నారని విమర్శించారు. తమకు అన్యాయం చేస్తే కేసీఆర్ లాంటి మేధావినే బండకేసి కొట్టిన చరిత్ర రాష్ట్ర ప్రజలకుందని చెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక న్యాయం అంటున్నాడు కాబట్టే వేచిచూస్తున్నామని చెప్పారు. బీజేపీలోనూ బీసీ నేతలకు అన్యాయం జరుగుతున్నదని విమర్శించారు. సీనియార్టీ ఉన్న రాజాసింగ్‌ను కాదని బీజేపీ ఎల్పీనేతగా మహేశ్వర్‌రెడ్డిని ఎలా ప్రటించారు? అని ప్రశించారు. పోరాటాల్లో బీసీ నేతలను ముందు పెట్టి పదవుల దగ్గరకు వచ్చేసరికి రెడ్లు ముందుకొచ్చారని కిషన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పేర్లను ప్రస్తావిస్తూ విమర్శించారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీసీ నేతల విషయంలో ఒకేలా వ్యవహరిస్తున్నాయన్నారు. కులగణన చేయకపోతే పోరాటాన్ని ఉధతం చేస్తామనీ, అవసరమైతే బీసీ మేధావులు, కుల సంఘాలతో కలిసి రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తామని హెచ్చరించారు. బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ బీఎస్.రాములు మాట్లాడుతూ..బీసీ కులగణనకు రూ.150 కోట్లు కేటాయించాలనీ, 15 రోజుల్లో ఆ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరెక్టుగా కేంద్రీకరిస్తే కేవలం మూడు రోజుల్లో కులగణన చేయొచ్చన్నారు. ప్రొఫెసర్ తిరుమలి మాట్లాడుతూ.. గ్రామ, మండల, నియోజకవర్గాల వారీగా బీసీల్లో రాజకీయ చైతన్యం కల్పించాలని సంఘాలకు సూచించారు. బీసీల హక్కుల కోసం బీసీలంతా ఒక్కటై స్వాతంత్ర్య ఉద్యమం తరహాలో మరో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు బీసీ రిజర్వేషన్లు..దాని కోసం వేసిన కమిటీలు..కేంద్రంలోని బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరించిన తీరు, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీలకు జరిగిన నష్టం, తదితరాలపై సమగ్రంగా వివరిస్తూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో వీజీఆర్ నారగోని, ప్రొఫెసర్ సింహాద్రి, కంకల శ్యామ్, గణేశ్‌చారి, బాలగోని బాలరాజు, కోల శ్రీనివాస్, మహేందర్, యాదగిరి, శంకర్, తదితరులు మాట్లాడారు.

ఘనంగా రాహుల్‌గాంధీ

జన్మదిన వేడుకలు

- గాంధీభవన్‌లో భారీ కటౌట్
- రక్తదానం శిబిరాలు, పిల్లలకు పుస్తకాల పంపిణీ
- కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న పార్టీ శ్రేణులు
- కేంద్రంలో బీజేపీ సర్కారు ఎక్కువ కాలం ఉండదు:మల్లు రవి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన భారీ కటౌట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ సేనారెడ్డి ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఫిషర్మెన్ కాంగ్రెస్ అధ్యక్షులు మెట్టు సాయికుమార్ నేతృత్వంలో పేద విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు సునీతా రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత క్యాన్సర్ ఆస్పత్రిలో రోగులకు మందులను పంపిణీ చేశారు. ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్, సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పుస్తకాల కవితతోపాటు బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, ఆఫీస్ బేరర్స్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ దేశ ప్రజల సంక్షేమం కోసం రాహుల్‌గాంధీ సుదీర్ఘ పాదయాత్ర చేశారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలవబోదని వ్యాఖ్యానించారు. నితీష్ కుమార్, చంద్రబాబు దయాదక్షిణ్యాలపై ఆధారపడి అది నడుస్తున్నదని గుర్తు చేశారు. వారికి ఎప్పుడు కోపం వస్తే అప్పుడే ప్రభుత్వం కూలిపోతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం పేద ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని విమర్శించారు. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా రక్తదానం చేసిన 300మంది యువకులను మల్లు రవి అభినందించారు.

న్యూఢిల్లీలో సైతం వేడుకలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బుధవారం న్యూఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో రాహుల్ గాంధీని మాజీ ఎంపీ వి హనుమంతరావు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఢిల్లీ తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సంబరాల్లో ఆయనతోపాటు కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అర్.లక్ష్మణ్ యాదవ్ వేడుకలు నిర్వహించారు.

పవర్ కమిషన్ ప్రశ్నలకు కేసీఆర్ సమాధానామివ్వాల్సిందే: కోదండరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పవర్ కమిషన్ అడిగిన ప్రతి ప్రశ్నకు మాజీ సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాల్సిందేనని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి కొంటున్న విద్యుత్ కొనుగోళ్లలో ఎన్నో అవకతవకలు జరిగాయన్నారు. యాదాద్రి, భద్రాద్రి పవర్ జనరేషన్ లోనూ అక్రమాలను జరిగాయని ఆరోపించారు. పాత మిషన్లను కొనుగోలు చేసి కమీషన్లు తీసుకున్నారని విమర్శించారు. విద్యుత్‌శాఖలో నెలకొన్న అవినీతి, అక్రమాలపై కమిషన్ చైర్మెన్‌ను నియమిస్తే ఆయన్ను నిందించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ్లలో గత ప్రభుత్వం తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను దోచుకున్నదని విమర్శించారు. ధరణి పోర్టల్‌తోపాటు గొర్రెలు, చేప పిల్లల పంపిణీలో పెద్ద ఎత్తున కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. వాటిపై విచారణ చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసినందుకు కిసాన్ కాంగ్రెస్ తరపున ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

నేషనల్ స్పేస్ సొసైటీ చర్చలో ప్రపంచ లీడర్‌గా శ్రీచైతన్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూఎస్ఏకు చెందిన నేషనల్ స్పేస్ సొసైటీ నిర్వహించిన ఎస్‌పీయూఎన్ చర్చావేదికలో ప్రపంచ లీడర్‌గా శ్రీచైతన్య విద్యాసంస్థ ఆవిర్భవించి సరికొత్త రికార్డును నెలకొల్పింది. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది దేశాల నుంచి వంద మందికిపైగా విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. నలుగురు ఫైనల్‌కు అర్హత సాధించారు. వారిలో ఇద్దరు గెలుపొందారు. అందులో ఒకరు శ్రీచైతన్య విద్యార్థి కావడం గమనార్హం. ఈ మేరకు శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీచైతన్య స్కూల్ విజేతగా నిలవడం ఇది నాలుగోసారి అని తెలిపారు. గత నెల 10 నుంచి 26 వరకు 16 విడతల్లో చర్చ జరిగిందని వివరించారు.

జిపి ఈకో సొల్యూషన్స్ ఐపిఒకు 856 రెట్ల స్పందన

హైదరాబాద్ : పునరుత్పాదన రంగంలోని జిపి ఈకో సొల్యూషన్స్ ఇండియా లిమిటెడ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు విశేష స్పందన లభించింది. జూన్ 14న ప్రారంభ మైన ఈ ఇష్యూ బుధవారంతో ముగియగా.. ఇన్వెస్టర్ల నుంచి ఏకంగా 856.37 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదయ్యింది. రూ.30.79 కోట్ల నిధుల సమీకరణకు ఇష్యూకు రాగా.. ఏకంగా రూ.16,624 కోట్లకు బిడ్డింగ్స్ రావడం విశేషం. ధరల శ్రేణీని రూ.90-94గా నిర్ణయించింది. రూ.10 ముఖ విలువ కలిగిన 32.76 లక్షల షేర్లను ఇష్యూలో విక్రయానికి పెట్టింది.

హజ్‌యాత్రకు వెళ్లి...

ఇప్పటి వరకూ 550 మంది మృతి

- చనిపోయిన వారిలో ఈజిప్ట్, జోర్డాన్ దేశస్తులే అధికం
- సుమారు 323 మంది ఈజిప్షియన్లు, 60 మంది జోర్డానియన్లు కన్నుమూత




రియాద్: హజ్ యాత్రకు వెళ్లి పలువురు కన్నుమూశారు. అధిక ఉష్ణోగ్రతలతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండ వేడిమిని తాళలేక 550 మందికిపైగా మృతి చెందారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. చనిపోయిన వారిలో ఈజిప్ట్, జోర్డాన్ దేశస్తులే అధికంగా ఉన్నారు. సుమారు 323 మంది ఈజిప్షియన్లు, 60 మంది జోర్డానియన్లు మరణించారని స్థానిక అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు చనిపోయిన వారి సంఖ్య 577కి చేరినట్టు తెలుస్తోంది. వీరంతా వేడి సంబంధిత సమస్యలతోనే మరణించినట్టు సమాచారం. వేడిమి నుంచి ఉపశమనం కలిగించేందుకు అక్కడి అధికారులు చర్యలు తీసుకుంటున్నా భారీ సంఖ్యలో ప్రాణనష్టం జరిగింది. మక్కాలోని అతిపెద్ద ఆస్పత్రుల్లో ఒకటైన అల్-ముయిసెమ్ ఆస్పత్రి మార్చురీలో మొత్తం 550 మృతదేహాలు ఉన్నట్టు దౌత్యవేత్తలు తెలిపారు. వేడి సంబంధిత సమస్యలు ఉన్న సుమారు 2,000 మంది యాత్రికులకు చికిత్స అందించినట్టు సౌదీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం మక్కాలో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మక్కాలోని గ్రాండ్ మసీదు వద్ద సోమవారం 51.8 డిగ్రీల సెల్సియస్ (125 ఫారెన్‌హీట్) ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని సౌదీ జాతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో హజ్ యాత్రకు వెళ్లిన భక్తుల కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. కాగా ప్రతి దశాబ్దం సౌదీ అరేబియాలో 0.4 డిగ్రీల వేడి పెరుగుతుండడం ఆందోళన కలిగించే అంశం. ఈ హజ్ యాత్ర ఈనెల 19వ తేదీ (బుధవారం)తో ముగిసింది. ఈ సారి యాత్రలో దాదాపు 18.3 లక్షల మంది పాల్గొన్నారని, వారిలో 22 దేశాలకు చెందిన 16 లక్షల మంది ఉన్నారని సౌదీ హజ్ నిర్వాహకులు వెల్లడించారు. ఎండ తాపాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్వహకులు అనేక ఏర్పాట్లు చేశారు. యాత్రికులు గొడుగులు వాడాలని, ఎప్పటికప్పుడు నీరు తాగాలని సూచించారు. వారిపై నీళ్ల చిలకరించేలా వాలంటీర్లను నియమించారు.

హజ్ యాత్రతో సౌదీకి భారీ ఆదాయం

హజ్‌యాత్ర ద్వారా సౌదీ అరేబియా ఏడాదికి 12 బిలియన్ డాలర్లు ఆర్జిస్తుంది. విజన్ 2030 రూట్‌మ్యాప్‌లో భాగంగా సౌదీ అరేబియా 2030 నాటికి హజ్, ఉమ్రా రెండింటి ద్వారా మత పరమైన పర్యాటకుల సంఖ్యను 30 మిలియన్లకు పెంచాలని సౌదీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇక ఈ యాత్రలు చేసే పర్యాటకులు ఆహారం, ప్రయాణం, వసతి, ఇతర వాటికి వెచ్చించే నగదుతో ఆ దేశ ఖజానాకు భారీ ఆదాయం సమకూరుతోంది. కాగా, హజ్ ఖర్చు ఒక వ్యక్తికి 3వేల డాలర్ల నుంచి 10వేల డాలర్ల మధ్య ఉంటుందని అంచనా.

మూడవ ప్రపంచ యుద్ధం నుంచి

అమెరికాను రక్షించాలి - ట్రంప్



వాషింగ్టన్ : వాషింగ్టన్‌లోని ప్రస్తుత నాయకత్వ సారథ్యంలో మూడవ ప్రపంచ యుద్ధం చెలరేగే అవకాశం ఉందని, తాను ఎన్నికైతే అలా జరగనివ్వనని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నాడు. డెట్రాయిట్‌లోని టర్నింగ్ పాయింట్ అమెరికా ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ, ట్రంప్ తన 2017-2021 అధ్యక్ష పదవిలో ఎలాంటి కొత్త యుద్ధాన్ని ప్రారంభించలేదని నొక్కిచెప్పాడు. తాను రెండవసారి గెలిస్తే, ఉక్రెయిన్‌లో శాంతిని పునరుద్ధరించడానికి పని చేస్తానని ప్రతిజ్ఞ చేశాడు. జో బైడెన్ "బలహీనత, వైఫల్యం అమెరికాను తీవ్రమైన ప్రమాదంలో పడేసిందని, అది మూడవ ప్రపంచ యుద్ధం వైపు లాగుతున్నదని, అమెరికా చరిత్రలో పది మంది చెత్త అధ్యక్షుల కంటే అతను దేశానికి ఎక్కువ నష్టం చేసాడు" అని ట్రంప్ పేర్కొన్నాడు.

ఈ నెల ప్రారంభంలో, బైడెన్ మానసిక స్థితి క్షీణత కారణంగా ప్రపంచ వినాశకరమైన అణు యుద్ధంలో మునిగిపోవచ్చని ట్రంప్ హెచ్చరించాడు. రష్యా, చైనా, ఉత్తర కొరియా నాయకుల మాదిరిగా కాకుండా, బైడెన్ తన ఆటలో అగ్రస్థానంలో లేడని, ఆయన అమెరికా రాజకీయ నాయకులలో ఎప్పుడూ "ప్రకాశవంతమైన బల్బ్" కాలేదని ఫాక్స్ న్యూస్ హోస్ట్ సీన్ హన్నిటీతో మాట్లాడుతూ ట్రంప్ చెప్పాడు. అణు యుద్ధం "ప్రపంచ నిర్మూలన"కు దారితీస్తుందని ట్రంప్ హెచ్చరించాడు. ప్రస్తుతం అమెరికాలో ఈ సమస్యను "చర్చించలేని" నాయకుడు ఉన్నాడని ఆయన ఉద్ఘాటించాడు.

అధ్యక్ష అభ్యర్థి బైడెన్ పరిపాలనలో "మునుపెన్నడూ చూడని స్థాయిలో డబ్బు వృథా చేస్తున్నారని" డెట్రాయిట్‌లో చేసిన ప్రసంగంలో ట్రంప్ విమర్శించాడు. ప్రత్యేకించి ఉక్రెయిన్‌కు అమెరికా అందజేస్తున్న నిరంతర ఆర్థిక సహాయం విషయానికి వస్తే ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ "ఇప్పటివరకు జీవించిన గొప్ప సేల్స్‌మాన్" అని వ్యాఖ్యానించాడు. "అతను అమెరికా దేశానికి వచ్చిన ప్రతిసారీ 60 బిలియన్ డాలర్లతో వెళ్ళిపోతాడు" అని ట్రంప్ అన్నాడు. జెలెన్స్కీ డబ్బు అందుకున్న ప్రతిసారీ, వెంటనే మరింత అడుగుతాడు. "ఇది ఎప్పటికీ ముగియదు" అని ట్రంప్ నొక్కిచెప్పాడు.

ట్రంప్ అధ్యక్షుడిగా మళ్లీ బాధ్యతలు చేపట్టే ముందు ఉక్రెయిన్ సమస్యను పరిష్కరిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన సమయంలో తాను అధ్యక్షుడిగా ఉండి ఉంటే ఉక్రెయిన్ యుద్ధం "ఎప్పుడూ జరిగేది కాదు" అని ట్రంప్ పేర్కొన్నాడు. నవంబర్‌లో తను మరోసారి ఎన్నికైతే ఆ యుద్ధాన్ని 24 గంటల్లో ముగించగలనని చెప్పాడు. అయితే ఆ లక్ష్యాన్ని ఎలా సాధించగలడనే దానిపై డోనాల్డ్ ట్రంప్ ఎలాంటి వివరాలను అందించలేదు.

ఐదు పార్టీలతో దక్షిణాఫ్రికా

కొత్త ప్రభుత్వం ఏర్పాటు



దక్షిణాఫ్రికా : దక్షిణాఫ్రికాలో అధికారికంగా ఐదు పార్టీలతో కూడిన జాతీయ ఐక్యత ప్రభుత్వాన్ని (జీఎన్‌యూ) ఏర్పాటు చేసింది. ఇతర రాజకీయ పార్టీలతో చర్చలు కొనసాగుతున్నాయని దీర్ఘకాలంగా పాలిస్తున్న ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) సోమవారం ప్రకటించింది. 1994లో వర్ణవివక్ష ముగిశాక ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా పార్లమెంటరీ మెజారిటీని కోల్పోయినందున ఇతర రాజకీయ పార్టీలతో పొత్తుపెట్టుకోవాలని నిర్ణయం తీసుకుంది. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ గత నెలలో జరిగిన ఎన్నికలలో 40 శాతం ఓట్లను పొంది, 400 మంది సభ్యుల అసెంబ్లీలో 159 స్థానాలను గెలుచుకుంది. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ మునుపటి ఎన్నికలలో గెలిచిన 230 స్థానాల సంఖ్య కుదింపుకు గురై 159 అయింది.

దీర్ఘకాల ప్రత్యర్థి డెమోక్రటిక్ అలయన్స్ (డిఏ)తో పార్టీ ఆలస్యంగా సంకీర్ణ ఒప్పందాన్ని కుదుర్చుకున్న తర్వాత ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ నాయకుడు సిరిల్ రామఫోసా శుక్రవారం దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా రెండవసారి విజయం సాధించాడు. రెండు చిన్న పార్టీలు - సామాజికంగా సంప్రదాయవాద ఇంకాతా ఫ్రీడమ్ పార్టీ (ఐఎఫ్‌పీ), రైట్-వింగ్ పేట్రియాటిక్ అలయన్స్ (పీఏ) కూడా ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో చేరాయి. దీనిని మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమాకు చెందిన ఎమ్‌కె వర్గం "అర్థం లేనిది, అపవిత్ర కూటమి" అని పేర్కొంది.

శ్వేతజాతి మైనారిటీ నుంచి మద్దతు పొందిన సెంటర్-రైట్ డిఏ పార్టీ మే 29 ఎన్నికల్లో 87 సీట్లు గెలుచుకుంది. ఐఎఫ్‌పీకి 17, పీఏకి తొమ్మిది, గుడ్ కేవలం ఒక సీటు మాత్రమే గెలుచుకుంది. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌తో సహా ఈ సమూహం జాతీయ అసెంబ్లీలో 273 స్థానాలకు లేదా 68 శాతం ఓటర్లకు ప్రాతినిధ్యం వహిస్తుందని అధికార పార్టీ పేర్కొంది. కొత్త ప్రభుత్వం వేగవంతమైన, సమగ్రమైన, దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి, ఉద్యోగ సృష్టి, భూ సంస్కరణలు, పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెడుతుందని ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ప్రకటించింది.



పంచాయతీ సిబ్బంది వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్
- సిద్దిపేట కలెక్టరేట్ ముట్టడి

నవ తెలంగాణ-సిద్దిపట కలెక్టరేట్

పంచాయతీ కార్మికులకు 9 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను జులై 1 లోపు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. లేకపోతే జులై రెండు నుంచి సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో ఉంటారని హెచ్చరించారు. గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల పెండింగ్ వేతనాలు వేంటనే చెల్లించాలంటూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా కార్మికులు కలెక్టరేట్ గేట్లు ఎక్కేందుకు ప్రయత్నించగా పోలీసులు సర్దిచెప్పారు. అనంతరం కలెక్టరేట్ ఎట రెహమాన్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ధర్నాలో కాముని గోపాలస్వామి మాట్లాడుతూ.. జిల్లాలో 499 గ్రామపంచాయతీలు ఉండగా.. అందులో సుమారు 2500 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి తొమ్మిది నెలల నుంచి జీతాలు అందడం లేదని తెలిపారు. దీంతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందన్నారు. వెంటనే జీతాలు విడుదల చేయాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేసి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.5 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి పాత కేటగిరీలను కొనసాగించాలని కోరారు. గ్రామ పంచాయతీల్లో కార్మికులు సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్నా నేటికీ పర్మినెంటుకు నోచుకోలేదు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, యూనియన్ జిల్లా కార్యదర్శి తునికి మహేష్, అధ్యక్షుడు కొమురయ్య కోశాధికారి రాజనర్సు, కార్మికులు పాల్గొన్నారు.

ప్లీజ్ సార్.. మీరు వెళ్లొద్దు..

మా బడిలోనే ఉండాలంటూ విద్యార్థుల కన్నీరు



నవతెలంగాణ-ఇనుగుర్తి

తమ వెన్నుతట్టి.. సొంత బిడ్డల్లా ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు బదిలీపై పోతుంటే ఆ పిల్లలు విలవిల్లాడారు.. ప్లీజ్ సార్.. మీరు వెళ్లొద్దంటూ కన్నీరు పెట్టుకుని బతిమలాడారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలంలో బుధవారం జరిగింది. వివరాల్లోకెళ్తే..మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కొమ్ము రాజేందర్ (అంతర్జాతీయ బ్యాడ్మింటన్ అంపైర్) వేరే ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. దాంతో ఉపాధ్యాయుడు రాజేందర్ స్కూల్ విడిచి వెళ్తుండగా.. వెళ్లొద్దు సార్.. అంటూ విద్యార్థులు చుట్టుముట్టి కన్నీటి పర్యంతమయ్యారు. వాళ్లతోపాటు ఉపాధ్యాయుడు కూడా కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. "మీరు ఏడ్వకండి.. అప్పుడప్పుడూ మిమ్మల్ని చూడటానికి వస్తాను" అంటూ స్టూడెంట్స్‌ను ఓదార్చారు. బాగా చదువుకుని భవిష్యత్‌లో మంచిగా ఎదగాలని సూచించారు. ఉపాధ్యాయుడు రాజేందర్, విద్యార్థులు ఏడుస్తుంటే మిగతా ఉపాధ్యాయులు వారిని ఓదార్చారు.

తగ్గిన సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు

- 17.81 లక్షల టన్నుల సరఫరా
- 32 శాతం వాటా ఏపీదే..



ముంబయి : భారత సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో విలువ పరంగా తగ్గుదల చోటు చేసుకున్నప్పటికీ.. ఆంధ్రప్రదేశ్ మెజారిటీ వాటాను కలిగి ఉంది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశం నుంచి 7.38 బిలియన్ డాలర్ల (రూ.61,565 కోట్లు) ఎగుమతులు జరిగాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ బుధవారం ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఇంతక్రితం 2022-23లో 8.0 బిలియన్ డాలర్ల (రూ.66,739 కోట్లు) ఎగుమతులు నమోదయ్యాయి. మొత్తం ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ 32 శాతం మెజారిటీ వాటా కలిగి ఉంది. ఇదే సమయంలో పరిమాణం పరంగా 17,35,286 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు ఎగుమతి కాగా.. గడిచిన 2023-24లో 17,81,602 టన్నులకు ఎగుమతులు పెరిగాయి.

సంఖ్యా పరంగా భారత్ ఆల్‌టైం రికార్డ్ స్థాయిలో 17.81 లక్షల టన్నుల ఎగుమతులు సాధించిందని మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంపిఇడిఎ) ఛైర్మన్ డివి స్వామి తెలిపారు. అమెరికా, యూరోపియన్ యూనియన్ మార్కెట్లలో పలు సవాళ్లు నెలకొన్నప్పటికీ మెరుగైన ప్రగతి నమోదయ్యిందన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ప్రొజెన్ రొయ్యల ఎగుమతులు 4.88 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. మొత్తం ఎగుమతుల్లో పరిమాణం పరంగా వీటి వాటనే 40.19 శాతంగా ఉంది. డాలర్ల విలువ పరంగా ఏకంగా 66.12 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

టీపీడీఎంఏ డిమాండ్

ఇందిరా పార్కు వద్ద శాంతి దీక్ష



నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రయివేటు డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రయివేటు డిగ్రీ - పీజీ కళాశాలల యాజమాన్య సంఘం (టీపీడీఎంఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో ప్రయివేటు కాలేజీల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, సిబ్బంది శాంతియుత దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీడీఎంఏ రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మూడేండ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాలేదని చెప్పారు. ఏటా రూ.2,500 కోట్లు కేటాయిస్తే, అందులో జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజీలకు చెల్లించేది రూ.వెయ్యి కోట్లు మాత్రమేనని అన్నారు. మూడేండ్ల నుంచి రూ.మూడు వేల కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫీజులు సకాలంలో విడుదల కాకపోవడంతో రాష్ట్రంలోని ప్రయివేట్ డిగ్రీ కళాశాలలు మూత పడే స్థితికి వచ్చిందన్నారు. అద్దెలు కట్టలేక, సిబ్బందికి జీతాలు చెల్లించలేక కొన్ని కాలేజీలు మూతపడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల కాకపోవడంతో అప్పులు తెచ్చి కాలేజీలను నడుపుతున్నామని అన్నారు. ఏండ్ల తరబడి ఫీజులు పెండింగ్‌లో ఉండడంతో అప్పుల భారం పెరిగిపోతున్నదని చెప్పారు. ఇప్పుడు కొత్త అప్పు దొరకడం లేదన్నారు. చదువుకున్న నిరుద్యోగులు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో సొంతంగా కళాశాలలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతూ వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారని వివరించా రు. కొన్ని లక్షల మంది విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. పదేండ్ల నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సరిగ్గా చెల్లించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో విద్యార్థుల భవిష్యత్ బాగుంటుందని భావించామని అన్నారు. అందుకనుగుణంగా ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేసి యాజమాన్యాలను ఆదుకోవాలని కోరారు. టీపీడీఎంఏ ప్రధాన కార్యదర్శి యాద రామకృష్ణ మాట్లాడుతూ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా రాష్ట్రంలో ఉన్నత విద్య చదివే సుమారు 13 లక్షల మంది విద్యార్థుల్లో 65 శాతం అంటే సుమారు 8.45 లక్షల మంది విద్యార్థుల కుటుంబాలకు, అలాగే జూనియర్, డిగ్రీ అండ్ పీజీ కళాశాలల్లో పని చేసే సుమారు 1.50 లక్షల మంది సిబ్బందికి కలిపి 10 లక్షల మంది కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. రైతుల గురించి ఆలోచించే ప్రభుత్వం..ఫీజురీయింబర్స్‌తో లబ్ది పొందే విద్యార్థు ల్లో ఎక్కువ భాగం రైతులు, గ్రామీణ ప్రాంత పేదల పిల్లలేనని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ శాంతియుత దీక్ష ప్రభుత్వానికి వ్యతిరేకం కాదనీ, ఇది ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీడీఎంఏ వర్కింగ్ ప్రెసిడెంట్లు శ్రీధర్‌రావు, పరమేశ్వర్, కోశాధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల ఇండ్ల స్థలాలపై త్వరలో కొత్త పాలసీ

హైదరాబాద్‌లోని ఆ సొసైటీ స్థలంపై త్వరలో జీవో

అక్రిడిటేషన్ కార్డుల గడువు మూడు నెలలు పొడిగింపు

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర తృతీయ మహాసభలో మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్రంలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు త్వరలోనే కొత్త పాలసీని తీసుకొస్తామని సమాచార, పౌర సంబంధాల, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర తృతీయ మహాసభకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పడికట్టు పదాలతో సమస్యలు తీరుస్తామంటూ హామీలు ఇచ్చారేగానీ ఏ ఒక్కటీ పరిష్కరించలేదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజా పాలన రావడానికి జర్నలిస్టులు కృషి చేశారని అన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో గతంలో కొందరు జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాలు కోర్టులో కేసు వల్ల ఆగిపోయాయని, ఏడాది కిందటే ఆ కేసు క్లియర్ అయినా గత ప్రభుత్వం వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని విమర్శించారు. త్వరలోనే ఆ స్థలాలను సంబంధిత జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ సభ్యులకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వారం, పది రోజుల్లోనే దానికి సంబంధించిన జీవో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. అలాగే, హైదరాబాద్‌లో మిగతా జర్నలిస్టులకు, జిల్లాలు, మండలాల్లో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు ఒక పాలసీని తీసుకొస్తున్నామని చెప్పారు. గతంలో ఖమ్మంలోని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలకు సంబంధించి ఇచ్చిన జీవో ఆగిపోయిందని తెలిపారు. మరో స్థలాన్ని చూడాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించామని, ఆ ప్రక్రియ వారం రోజుల్లో పూర్తవుతుందని చెప్పారు.

అక్రిడిటేషన్ల గడువు ఈ నెలాఖరుతో ముగుస్తున్నదని, మరో మూడు మాసాలపాటు గడువు పెంచుతున్నామన్నారు. వందకు వంద శాతం జర్నలిస్టులకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. హెల్త్ కార్డులకు సంబంధించి, వివిధ రాష్ట్రాల్లో ఉన్న పాలసీలను అధ్యయనం చేసి దానికి అనుగుణంగా జర్నలిస్టులకు వైద్యాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం, రక్షణ కోసం ఉన్నటువంటి అన్ని రకాల కమిటీలను త్వరలోనే పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఐజేయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, టీయుడబ్ల్యూజే (ఐజెయు) రాష్ట్ర అధ్యక్షులు నగునూరి శేఖర్, ప్రధాన కార్యదర్శి విరహత్ అలీ, ఐజేయూ ప్రతినిధులు నరేందర్ రెడ్డి, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చాలా తప్పులు చేశారు

- జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ఎదుట సీనియర్ జర్నలిస్ట్ వేణుగోపాలరావు వాదనలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఛత్తీస్‌గఢ్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్ ఎదుట సీనియర్ జర్నలిస్ట్, సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ ఎమ్ వేణుగోపాలరావు తమ వాదనలు వినిపించారు. ఛత్తీస్‌గఢ్ ఒప్పందం ఏకపక్ష నిర్ణయమనీ, రాష్ట్రంలోని స్టేక్‌హోల్డర్లను ఎవర్నీ సంప్రదించకుండా ప్రభుత్వం తీసుకున్నదని కమిషన్ ఎదుట వివరించారు. వెయ్యి మెగావాట్ల కోసం ఒప్పందం ప్రకారం ఏనాడు ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు సరఫరా కాలేదనీ, అది చాలదన్నట్టు మరో వెయ్యి మెగావాట్ల కోసం మళ్లీ ఒప్పందం చేసుకుని ప్రజాసొమ్మును దుర్వినియోగం చేశారని తెలిపారు. పీజీసీఎల్‌కు దాదాపు రూ. 670 కోట్లు నష్టపరిహారంగా చెల్లించాల్సి వచ్చిందని వివరించారు. ఛత్తీసగఢ్ నుంచి ఒప్పందం ప్రకారం కరెంటు రాకపోయినా, వెయ్యి మెగావాట్లకు సొమ్మును మాత్రం చెల్లించారనీ, అదే సమయంలో బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కరెంటు కొనుగోళ్లు చేశారని చెప్పారు. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణం కూడా పూర్తి లోపభూయిష్టమని అన్నారు. ముంపు ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టులు నిర్మించారన్నారు. భద్రాద్రి థర్మల్ కేంద్రం నిర్మాణంలో భారీ అవకతవకలు జరిగాయని ఉదహరించారు. ఇండియాబుల్స్ సంస్థ కోసం తయారుచేసిన బీహెచ్ఈఎల్ తయారు చేసిన ఔట్‌డేటెడ్ సబ్‌క్రిటికల్ టెక్నాలజీని ఇక్కడ వినియోగించారని చెప్పారు.ఈ టెక్నాలజీని అప్పటికే కేంద్ర ప్రభుత్వం నిషేధించిందనీ, అయినా పట్టించుకోకుండా నిర్మాణం చేశారన్నారు. వివిధ కారణాలతో ప్రాజెక్టుల నిర్మాణాలు ఆలస్యం అవడం వల్ల నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయాయనీ, అవన్నీ అంతిమంగా విద్యుత్ వినియోగదారులపైనే పడతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను గణాంకాలు, గత ఈఆర్సీ ఉత్తర్వులు, ఉదాహరణలతో కమిషన్ ఎదుట వివరించారు.

విద్యా వారసత్వానికి ప్రతీక

- నలంద యూనివర్సిటీ నూతన క్యాంపస్‌ను ప్రారంభించిన మోడీ

పాట్నా : దేశంలో ప్రముఖ యూనివర్సిటీ అయిన నలంద యూనివర్సిటీ నూతన క్యాంపస్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం ప్రారంభించారు. బీహార్‌లోని రాజ్‌గిరి ప్రాంతంలో ఉన్న పురాతన నలంద యూనివర్శిటీకి సమీపంలోనే ఈ కొత్త క్యాంపస్‌కూడా ఉంది. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా మోడీ మాట్లాడుతూ భారతదేశం విద్యా వారసత్వానికి, చైతన్యవంతమైన సాంస్కృతిక మార్పిడికి నలంద విశ్వవిద్యాలయం ప్రతీక అని అన్నారు. నలంద అంటే ఇక గుర్తింపు, గౌరవం, గర్వం అని తెలిపారు. 'అగ్ని జ్వాలల్లో పుస్తకాలు కాలిపోవచ్చు. కానీ అగ్ని జ్వాలలు జ్ఞానాన్ని నాశనం చేయలేవు. ఈ సత్యాన్ని నలంద ప్రపంచానికి చాటింది' అని మోడీ చెప్పారు. ప్రారంభోత్స వేడుకకు వివిధ దేశాల ప్రతినిధులు హాజరుకావడంపై మోడీ హర్షం వ్యక్తం చేశారు.

నలంద విశ్వవిద్యాలయ చట్టం 2010 ద్వారా నలంద విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. 14 మంది విద్యార్థులతో తాత్కాలిక ప్రదేశం నుంచి 2014లో విద్యా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కొత్త క్యాంపస్ నిర్మాణ పనులు 2017లో ప్రారంభమయ్యాయి. బుధవారం ప్రారంభోత్స కార్యక్రమానికి విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, బీహార్ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఉపముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు పురాతన నలంద విశ్వవిద్యాలయ శిథిలాలను మోడీ సందర్శించారు.



బోధ్ గయ నుండి తీసుకువచ్చిన బోధి మొక్కను క్యాంపస్‌లో నాటారు. కాగా, పురాతన నలంద విశ్వవిద్యాలయం 5వ శతాబ్దంలో స్థాపించబడింది, ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసించేవారు. అయితే ఈ పురాతన విశ్వవిద్యాలయాన్ని 12వ శతాబ్దంలో ఆక్రమణదారులు ధ్వంసం చేశారు. కాగా, నూతన నలంద అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో భారతదేశం మాత్రమే కాకుండా ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, భూటాన్, బ్రూనై దారుస్సలాం, కంబోడియా, చైనా, ఇండోనేషియా, లావోస్, మారిషస్, మయన్మార్, న్యూజిలాండ్, పోర్చుగల్, సింగపూర్, దక్షిణ కొరియా, శ్రీలంక, థాయ్‌లాండ్, వియత్నాం వంటి 17 దేశాలు భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. ఈ మేరకు యూనివర్సిటీకి మద్దతుగా ఈ దేశాలు ఎంఓయూలపై సంతకాలు చేశాయి. ఇక్కడ 137 కోర్సులను బోధిస్తారు. దీంతో పాటు పోస్ట్ గ్రాడ్యుయేట్, పరిశోధన కోర్సులు, స్వల్పకాలిక సర్టిఫికేట్ కోర్సులను అందిస్తారు.

ఆటలు

టీమిండియాకు తొలి పరీక్ష

సూపర్-8లో నేడు ఆఫ్ఘన్‌తో ఢీ

రాత్రి 8.00గం॥ల నుంచి



బ్రిడ్జిటౌన్: టి20 ప్రపంచకప్‌లో టీమిండియా సూపర్-8లో తొలి పరీక్షను ఎదుర్కోనుంది. గ్రూప్-ఎ వరుస విజయాలతో సూపర్-8కు చేరిన టీమిండియా ఇక దానిపై దష్టి సారించింది. బుధవారం జరిగే తొలి మ్యాచ్‌లో రోహిత్ శర్మ సారథ్యంలోని భారతజట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో సూపర్-8లో తలపడనుంది. విండీస్ గడ్డపై ఐదు రోజుల వ్యవధిలోనే భారత్ మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈనెల 20న ఆఫ్ఘాన్‌తో తొలి మ్యాచ్ ఆడనుండగా, ఆ తర్వాత 22న బంగ్లా, 24న ఆసీసతో తలపడుతుంది. మరోవైపు ఇలాంటి కఠిన సవాల్‌ను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని కెప్టెన్ రోహిత్ చెబుతున్నాడు. 'సూపర్-8లో మ్యాచ్‌ల మధ్య మాకు ఎక్కువ సమయం లేదు. ఐదు రోజుల వ్యవధిలోనే మూడు మ్యాచ్‌లను ఆడాల్సి ఉంటుంది. అలాగే ప్రయాణాలు కూడా తప్పవు. ఇది హడావిడిగా కనిపించినా.. మేం దీన్ని ఓ సాకుగా చెప్పాలనుకోవడం లేదు' అన్నాడు. అలాగే జట్టులో ఉన్న వారందరూ ఏదైనా ప్రత్యేకంగా చేయాలనే ఉత్సుకతతో ఉన్నారని, మేం మా స్కిల్ సెషన్స్‌ను చాలా సీరియస్‌గా తీసుకుంటాం. ప్రతి స్కిల్ సెషన్‌లో సాధించడానికి ఏదో ఒకటి ఉంటుంది. ప్రస్తుతం మా ఫోకస్ అంతా జట్టుగా ఏం చేయాలనే దానిపైనే ఉంది. ఇక్కడ చాలా మ్యాచ్‌లు ఆడాం. ప్రతి ఒక్కరికి తమ పాత్ర ఏంటో తెలుసు. అందరం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం" అని రోహిత్ శర్మ పేర్కొన్నాడు.

జట్లు(అంచనా)...

భారత్: రోహిత్(కెప్టెన్), కోహ్లి, సూర్యకుమార్, దూబే, పంత్(వికెట్ కీపర్), అక్షర్, జడేజా, హార్దిక్ పాండ్యా, బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్.

ఆఫ్ఘనిస్తాన్: రషీద్ ఖాన్(కెప్టెన్), గుర్బాజ్(వికెట్ కీపర్), జద్రాన్, నజీబుల్లా, నబి, గులాబుద్దీన్, అజ్మతుల్లా, జన్నత్, ముజీబ్, నవీన్-ఉల్-హక్, ఫారుఖీ.

డికాక్ ధనా ధన్..

దక్షిణాఫ్రికా 194/4

అమెరికాతో సూపర్-8 మ్యాచ్



అంటిగ్వా: టి20 ప్రపంచకప్ సూపర్-8 తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా బ్యాటర్లు కదం తొక్కారు. అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఓపెనర్ డికాక్(74) అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ మార్‌క్రమ్(46), క్లాసెన్(36నాటౌట్), స్టబ్స్(20నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 194పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్, వికెట్ కీపర్ డికాక్(74) రాణించినా.. మరో బ్యాటర్ రోడ్రిగ్స్(11) నిరాశపరిచాడు. దీంతో సఫారీ జట్టు 16పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత మార్‌క్రమ్‌తో కలిసి డికాక్ 2వ వికెట్‌కు 110పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరూ ఔటయ్యాక దక్షిణాఫ్రికాను క్లాసెన్, స్టబ్ ఆదుకున్నారు. వీరిద్దరూ చివర్లో చెలరేగి ఆడడంతో ఆ జట్టు 194పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. అమెరికా బౌలర్లు నేత్రావాల్కర్, హర్మీత్ సింగ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

స్కోర్‌బోర్డు...

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి)షాయన్ (బి)హర్మీత్ సింగ్ 74, హెండ్రిక్స్ (సి)ఆండర్సన్ (బి)నేత్రావాల్కర్ 11, మార్‌క్రమ్ (సి)అలీ ఖాన్ (బి)నేత్రావాల్కర్ 46, డేవిడ్ మిల్లర్ (సి అండ్ బి)హర్మీత్ సింగ్ 0, క్లాసెన్ (నాటౌట్) 36, స్టబ్స్ (నాటౌట్) 20, అదనం 7. (20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 194పరుగులు.

వికెట్ల పతనం: 1/16, 2/126, 3/126, 4/141

బౌలింగ్: నేత్రావాల్కర్ 4-0-21-2, అలీ ఖాన్ 4-0-45-0, జోష్‌దీప్ సింగ్ 2-0-36-0, హర్మీత్ సింగ్ 3-0-29-0, స్టీవెన్ టేలర్ 2-0-21-0, ఆండర్సన్ 1-0-17-0

ఆర్‌ఆర్‌ఆర్-ఓఆర్‌ఆర్ మధ్య రేడియల్ రోడ్లు

- డిసెంబరులోపే 'హై'వే పనులు
- ప్రమాదాల నివారణపై దృష్టి
- రోడ్డు చెడిపోతే అధికారులూ బాధ్యులే : ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్), ఔటర్ రింగు రోడ్డు(ఓఆర్‌ఆర్) మధ్య కనెక్టివిటి కోసం రేడియల్ రోడ్లను నిర్మిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. ఇందుకోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ ప్రాజెక్టులు, ప్రస్తుత పరిస్థితి, నూతన పనుల గురించి అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్ష చేశారు. అనంతరం మంత్రి ఆర్‌అండ్‌బీ ఎన్‌హెచ్ ఈఎన్సీ ఐ గణపతిరెడ్డి, రూరల్ రోడ్ల ఇన్‌చార్జి ఈఎన్సీ మోహన్ నాయక్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యపై ప్రధానంగా దృష్టిపెట్టామని చెప్పారు. గత ప్రభుత్వం ఆర్‌ఆర్‌ఆర్‌కు యుటిలిటీ చార్జీలు చెల్లించకపోవడంతో పనులు ఆగిపోయాయని చెప్పారు. తాను కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి యుటిలిటీ చార్జీలు చెల్లిస్తామని చెప్పానని, ఆ తర్వాత మళ్లీ ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. ఏ రోడ్లు చెడిపోయినా కేవలం కాంట్రాక్టర్లే కాకుండా అధికారులు కూడా బాధ్యులేనని స్పష్టం చేశారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులు త్వరలోనే పూర్తి కాబోతున్నాయని అన్నారు. నెల రోజుల్లోనే పనులు చేపట్టి వేగంగా పూర్తి చేస్తామన్నారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్, కొంపల్లి ఫ్లైఓవర్ పనులు త్వరలోనే పూర్తి చేయనున్నట్టు చెప్పారు.డిసెంబరులోపే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65) విస్తరణ పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. రాష్ట్రానికి కీలకమైన ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలోనే వచ్చాయనీ, ఔటర్ రింగు రోడ్డు, శంషాబాద్ విమానాశ్రయంతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయని అన్నారు. నల్లగొండ బైపాస్ రోడ్డు గురించి కేంద్రమంత్రి గడ్కరీతో చర్చించామనీ, ఆర్‌ఆర్‌ఆర్‌ను కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. ఆర్‌ఆర్‌ఆర్‌పై తమ ప్రభుత్వ దృష్టిపెట్టిందన్నారు. నాగర్‌పూర్-మంచిర్యాల హైవే నిర్మాణం కూడా కేంద్రంతో మాట్లాడామని అన్నారు. ఎన్‌హెచ్-65పై 17 బ్లాక్‌స్పాట్లను గుర్తించి మరమ్మతులు చేపట్టామని చెప్పారు. విజయవాడ-హైదరాబాద్ హైవేను ఆరులేన్లుగా మార్చే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామని వివరించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న రోడ్లను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. ఈనెల 25, 26 తేదీల్లో ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలవనున్నట్టు చెప్పారు.



జాతీయ రహదారుల మంజూరు, నిధుల కేటాయింపుపై మాట్లాడతామని చెప్పారు. అచ్చంపేట బైపాస్ రోడ్డు విషయమై ప్రధాని మోడీ, మంత్రి గడ్కరీతో మాట్లాడతామని అభిప్రాయ పడ్డారు. ఎన్‌హెచ్ 65ను గ్రీన్‌ఫీల్డ్ హైవేగా రూపుదిద్దుతామన్నారు.సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం వేగవంతం చేస్తున్నామన్నారు. వరంగల్, ఉస్మానియాతోపాటు నాలుగు టిమ్స్ ఆస్పత్రులను నిమ్స్ తరహాలో నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఆస్పత్రులు, ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీసులు, కలెక్టరేట్ల నిర్మాణం సైతం ఆర్‌అండ్‌బీ చేస్తున్నదన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్ భవనాన్ని పాటిగడ్డలో నిర్మించినున్నట్టు చెప్పారు. ఢిల్లీలో తెలంగాణ భవన్‌ను ఐకానిక్ మోడల్‌లో నిర్మించనున్నట్టు చెప్పారు. హైదరాబాద్ హౌస్ పక్కనున్న ఐదెకరాల స్థలంలో ఈ భవన నిర్మాణం చేపడతామనీ, దీనికి సీఎం రేవంత్‌రెడ్డి సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఆర్‌అండ్‌బీ శాఖ సమీక్ష దాదాపు ఏడున్నర గంటల పాటు జరిగిందన్నారు. గతంలోని బీఆర్ఎస్ సర్కారు పనులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తాము వచ్చిన మూడు నెలల కాలంలోనే కేంద్రంతో పలుమార్లు సంప్రదింపులు చేసినట్టు చెప్పారు.

కేంద్రమంత్రికి చింతల సురేందర్ నాథ్ యాదవ్ సన్మానం



నవతెలంగాణ- నాగోల్

బండి సంజయ్ కుమార్ కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి పదవి ని అధిరోహించినందున బుధవారం బేగంపేట్ ఎయిర్ పోర్ట్‌లో ఆయనకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్ర నాథ్ యాదవ్, పలువురు నాయకులు ఘన స్వాగతం పలికి, శాలువాతో సన్మానిం చారు. వీరితో పాటుగా సిద్దాలా ఐలయ్య మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పొంగుతున్న డ్రయినేజీలు

- మరమ్మతులు చేస్తున్నా ఆగని మురుగునీరు



నవతెలంగాణ-కొత్తపేట

కొత్తపేటలోని శ్రీ ప్రసన్న మహంకాళి అమ్మవారి ఆలయం పక్కన ఉన్న మ్యాన్ హెూల్ నుంచి మురుగునీరు అధికంగా వస్తూ రోడ్డుపై చేరి దాదాపు కిలోమీటర్ వరకు ప్రవహిస్తున్నది. రోడ్డుకు ఇరు వైపులా నివసిస్తున్న ప్రజలు, వాహనదారులు పాదాచారులు దుర్గంధపు వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది షాపుల ముందు నీరు ఆగడంతో వారు ఇబ్బంది పెడుతున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకొని వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గూడు లేని పేదలకు అండగా నిలవండి



- సీఎం రేవంత్ రెడ్డిని వేడుకున్న సీపీఐ నాయకులు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

గూడు లేని పేదలకు అండగా నిలబడి ఇంటి స్థలాలు ఇచ్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బుధవారం వినతిపత్రం అంద జేశారు.

ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం, కుంట్లూరు గ్రామ రెవెన్యూ సర్వేనెం. 215 నుంచి 224 లో ఉన్న భూదాన్ భూమిలో గత 18 నెలలుగా 20 వేల మంది పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారన్నారు. ఎండకు, వానకు, చలికి తట్టుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇండ్లు లేని పేదలకు అండగా నిలబడి ఇంటి స్థలాలు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. కొంతమంది స్థిరాస్థి వ్యాపారస్తులు ఇట్టి భూములను ఆక్రమించుకోవడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇట్టి భూదాన్ భూమిపై ఉన్న లీగల్ సమస్యలను పరిష్కరించి అర్హులైన నిరుపేదలకు గృహలక్ష్మి పథకం ద్వారా ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరినట్లు తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర నాయకులు, జిల్లా ఆందోజ్ రవీంద్రాచారి, పాలమాకుల జంగయ్య, ముత్యాల యాదిరెడ్డి, పానుగంటి పర్వతాలు ఉన్నారు.

దుర్గంధం వెదజల్లుతున్న కాలువ

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- పట్టింపు లేని మున్సిపల్ శానిటేషన్ విభాగం





నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ అవుటర్ రింగ్ రోడ్ సమీపంలోని సంపూర్ణ హెూటల్ నుంచి వస్తున్న మురుగునీరు. సమీపంలోని కాలువలో చేరి దుర్గం వెదజల్లుతోంది. నెలల కొద్ది మురుగునీరు నిల్వ ఉండడంతో పందులకు స్వైరవిహారమైంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమలు, ఈగలు, పందులు వచ్చి చేరడంతో దుర్గంధం రెట్టింపు అవుతున్నది. హెూటల్‌కు వచ్చే వినియోగదారులకు దుర్వాసన వస్తుందని పలువురు వాపోతున్నారు. కానీ మున్సిపల్ శానిటేషన్ అధికారులు అటువైపు కూడా వెళ్లడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

నెలల కొద్దీ మురుగు నీరు నిల్వ : గ్యార మల్లేష్ బీఎస్పీ నాయకులు

నెలల కొద్దీ మురుగునీరు నిల్వ ఉండడంతో ప్రాణాంతకమైన బాక్టీరియా/ వైరస్‌లు పుట్టుకొచ్చి ప్రజారోగ్యం పై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఇప్పటికే వర్షా కాలం ప్రారంభం కావడంతో మలేరియా, డెంగ్యూ, వైరల్ పివర్ తో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కొన్ని నెలల కొద్దీ మురుగు నీరు దుర్గంధం వెదజల్లుతుంటే మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రజల ఆరోగ్యం కాపాడాల్సిన అధికారులు తమ బాధ్యతను గుర్తుంచుకోవాలి. అలాగే నిబంధన లకు విరుద్ధంగా నిర్వహిస్తున్న, ఆహారపు విక్రయ కేంద్రాలను తనిఖీ చేయాలి

పరిశీలించి చర్యలు తీసుకుంటాం: కమిషనర్ రవీందర్ రెడ్డి

ఔటర్ రింగురోడ్డు సమీపంలో ఉన్న సంపూర్ణ హెూటల్ నిర్వాహకులు వదులుతున్న మురుగునీరు నిల్వ ఉన్న విషయం తన దష్టికి నవతెలంగాణ తీసుకురావడంతో అక్కడ ప్రాంతాన్ని పరిశీలించి అందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

డ్రయినేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలి



నవతెలంగాణ-నాగోల్

రానున్న రోజుల్లో వర్షాలను దృష్టిలో ఉంచుకొని సిబ్బందిని అప్రమత్తం చేస్తూ డ్రయినేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ హెచ్ఎండబ్ల్యూఎస్ డివిజనల్ జనరల్ మేనేజర్ మాధవికి బుధవారం వినతి పత్రాన్ని అందించారు. అంతకుముందు నాగోల్‌లోని కార్పొరేటర్ నివాసంలో జలమండలి అధికారులు కార్పొరేటర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నాగోలు డివిజన్‌లో నెలకొంటున్న డ్రయినేజీ సమస్యలను వారి దృష్టికి తెస్తూ వాటి పరిష్కారానికి కషి చేయాలని సూచించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో పలు కాలనీలలో డ్రయినేజీలు ఓవర్ ఫ్లో అవుతున్నాయని, వెంటనే వాటిని గుర్తించి క్లియర్ చేసి ప్రజల ఇబ్బందులను తీర్చి ఆరోగ్యాలను కాపాడాలని సూచించారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న డ్రయినేజీ పైప్ లైన్‌ల పనులను భారీ వర్షాలు రాకముందే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రేమ్ సాగర్, అర్చన, ఏఈ రాకేష్ ,వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, హెచ్ఎండబ్ల్యుఎస్ సూపర్వైజర్ రమేష్ ,హుస్సేన్, నాయకులు సిద్ధాల ఐలయ్య, నరేందర్లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు సేవ చేయడం హర్షణీయం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో ప్రతి ఒక్కరు మానవతా హృదయంతో పేదలు,అనాథలకు మానవతా హదయంతో సేవ చేయడం హర్షణీయమని బడంగ్ పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని మాతదేవోభవ అనాథ ఆశ్రమంలో రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా మేయర్ ఆశ్రమం లో అనాథల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించి మాత దేవోభవ అనాథ ఆశ్రమ నిర్వాహకులు గట్టు గిరి అనాథలకు సేవచేయటం, ఆయన సాటి మనిషికి బతికినంత కాలం సేవ చేయటం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి,బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు బోయపల్లి గోవ ర్ధన్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ వంగెటి ప్రభాకర్ రెడ్డి, కార్పొ రేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్ల గూడెం సంతోషా శ్రీనివాస్ రెడ్డి,ఎస్.సి సెల్ అధ్యక్షులు బాల్ లింగని జంగయ్యమాజీ ఎంపీటీసీ శ్రీరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా దీక్ష వాల్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-హాయత్‌నగర్

తెలంగాణలో విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 25న ఎల్బీనగర్‌లోని కామినేని హాస్పిటల్ వద్ద ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం దగ్గర సోషల్ జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన విద్యా దీక్ష కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం మన్సూరాబాద్‌లోని సహారా ఎస్టేట్స్ వద్ద ఉన్న జయశంకర్ సార్ విగ్రహం దగ్గర సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖ మంత్రిని ప్రకటించాలని, రాష్ట్రంలో విద్యాశాఖకు బడ్జెట్‌లో 33 శాతం కేటాయించాలని ,గురుకుల విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసి పర్యవేక్షణ పెంచాలన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా వ్యవస్థను కఠినంగా నియంత్రించాలని డిమాండ్లతో ఈ దీక్ష చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి విద్యావేత్తలు, సామాజికవేత్తలు, విద్యార్థి సంఘాల నేతలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజా సంఘాలన్నీ పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ కె వి గౌడ్, మేడిగ శ్రీధర్, నవభారత్ సేవా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండల్ గౌడ్, తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ఘోర శ్యాంసుందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నోటుబుక్కులు అమ్ముతున్నా చర్యలేవీ

- కాకతీయ, గౌతమ్ స్కూళ్ల ముందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ-హాయత్ నగర్

ప్రయివేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లు అమ్మకూడదని ప్రభుత్వం జీవో విడుదల చేసినా హాయత్ నగర్‌లో ఉన్న కాకతీయ, గౌతమ్ స్కూళ్లలో నోటు బుక్కులు అమ్ముతున్నా చర్యలెందుకు తీసుకోవట్లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. శివకుమార్, గ్యార క్రాంతిలు ప్రశ్నించారు. ఆ పాఠశాలలను సీజ్ చేయాలని హాయత్ నగర్ ఏఐఎస్ఆఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆ పాఠశాలల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు పాఠశాలలో నోటు బుక్స్, స్కూల్ బ్యాగ్స్, ఇతర స్టేషనరీ సంబంధించిన లావాదేవీలు జరపకూడదని ప్రొసీడింగ్ ఆర్డర్ ఇచ్చారు కానీ ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు ఇవేవీ పట్టించుకోకుండా తమ ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తూ నోటు బుక్స్, స్కూల్ డ్రెస్‌లను అమ్ముతూ విద్యా వ్యాపారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. కాకతీయ పాఠశాల ఎలాంటి పర్మిషన్లు తీసుకోకుండా సెట్ బ్యాక్ లేని జీ+4 బిల్డింగ్ లో క్లాసులు బోధిస్తున్నారని ఆరోపించారు. మండల విద్యాధికారులు ఇలాంటి ప్రయివేటు స్కూళ్ల పైన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్కూల్ యాజమాన్యాలతో లోపాయికార ఒప్పందం చేసుకొని అవినీతికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హయత్ నగర్ మండల వ్యాప్తంగా ఫైర్ సేఫ్టీ లేకుండా,సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణాలు పూర్తి గాని బిల్డింగ్లలో స్కూలు నడిపిస్తున్నటువంటి వాటిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేస్తూ, అవి సరిపోక పుస్తకాలు, డ్రెస్సులు, ట్రాన్స్‌పోర్ట్ పేరుతో తల్లిదండ్రుల నుండి ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నదన్నారు. విద్య హక్కు చట్టాన్ని పాటించని ఇలాంటి స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల జిల్లా వ్యాప్తంగా ఆందోళనలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, వెంకటేష్ హయత్ నగర్ మండల నాయకులు బన్నీ, భాను,వెంకటేష్, లక్ష్మణ్, గణేష్, భరత్, నాగరాజు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో విద్యార్థిని, విద్యార్థులు కృషి పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బడంగ్‌పేట్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం జాతీయ కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బడంగ్ పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్పొరేటర్ రాళ్లగూడెం సంతోష శ్రీనివాస్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ప్లేట్లను విద్యార్థులకు మేయర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యాభివద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. విద్య లేనివాడు వింత పశువు అందుకోసం ప్రతి ఒక్కరూ తమ పిల్లలను పాఠశాలకు పంపించాలని కోరారు. ఇప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో కొంత మంది తమ పిల్లలను పాఠశాలకు పంపించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కార్పొరేటర్ సంతోషి శ్రీనివాస్ రెడ్డిని శాలువాతో మేయర్ ఘనంగా సన్మానించారు. కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అమత నాయుడు, నాయకులు గట్టు బాలక్రిష్ణ, సామ భాస్కర్ రెడ్డి, సుర్గంగంటి విజయ్, రాకేష్, కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద కార్మికులకు అండగా సీఐటీయూ



- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

నవతెలంగాణ-చైతన్యపురి

పేద కార్మికులకు అండగా సీఐటీయూ నిరంతరం ఉంటుందని, వారి సంక్షేమం కోసం కృషి చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అన్నారు. ప్రయివేటు అపార్ట్మెంట్స్ వాచ్మెన్ సెక్యూరిటీ గార్డ్స్ జిల్లా కార్యదర్శి డి బీమ నాయక్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. వారి మృతికి సీఐటీయూ యు సంతాపం తెలియజేసి, ఆయన భార్యకు యూనియన్ల సహకారంతో రూ .65 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం సీఐటీయూ చైతన్యపురి కార్యాలయంలో ముఖ్యఅతిథి భూపాల్ చేతులమీదుగా పోస్ట్ ఆఫీస్ లో ఫిక్స్ చేసిన 65 వేల డిపాజిట్ బాండును అందజేశారు. ఆయన మాట్లాడుతూ అపార్ట్మెంట్ సెక్యూరిటీ, వాచ్మెన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకునే విధంగా ఒక చట్టాన్ని చేసి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి , భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామ్మోహన్, సరూర్‌నగర్ కన్వీనర్ ఎం వీరయ్య, ఎల్బీనగర్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య, నాయకులు సిహెచ్ వెంకన్న, చైతన్య, సిహెచ్. మల్లేశం, రాములు తదితరులు పాల్గొన్నారు.

జంతు వ్యర్థాలను తొలగించటం హర్షణీయం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న వివిధ కాలనీల్లో రోడ్లకు ఇరువైపులా పేరుక పోయిన జంతు వ్యర్థాలను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశం మేరకు మున్సిపల్ కమిషనర్ వాణీరెడ్డి సహకారంతో తొలగించడం హర్షణీయమని బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జల్‌పల్లి మున్సిపల్ ఉపాధ్యక్షులు సయ్యద్ హుస్సేన్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా 21,22 వార్డులతో పాటు ఇతర కాలనీల్లో రోడ్లకు ఇరువైపుల కుప్పలు, తెప్పలుగా వేసిన జంతు వ్యర్థాలను మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో తొలగించినట్టు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా కొందరు జంతు వ్యర్థాలను రోడ్లపై వేయటంతో ఆ వ్యర్థాలను నుంచి బయటకు వచ్చే దుర్వాసనతో పలు కాలనీల ప్రజలు ఇబ్బందులకు గురవుతు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అందుకోసం ముందు జాగ్రత్త చర్యగా వివిధ కాలనీలలో పేరుక పోయిన జంతు వ్యర్థాలతో పాటు చెత్త చెదారం రోడ్లపై లేకుండా చేయటం అక్కడబ్లీచింగ్ పౌడర్ చల్లి ముగ్గులు వేయడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సుపర్ వైజర్ కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెళ్లేది ఎలా..?



రోడ్డుకి ఇరువైపులా ఇష్టానుసారంగా పార్కింగ్ కనిపించని ట్రాఫిక్ పోలీసులు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

పెద్ద అంబర్ పేట పట్టణ పరిధిలో జాతీయ రహదారికి సమాంతరంగా గ్రామంలోకి వెళ్లడానికి వీలుగా బీటి రోడ్డు ఉంది. ఇదే దారిలో పెద్ద అంబర్ పేట మున్సిపల్ పరిపాలన కార్యాలయం, దాని సమీపంలో ఎస్ఆర్ఓ కార్యాలయం ఉంది. వీటికి తోడు రోడ్డుకు ఇరువైపులా రియల్ ఎస్టేట్, డాక్యుమెంట్ రైటర్స్ దుకాణాలు, ఇతర వాణిజ్య దుకాణాలు ఉన్నాయి. రోజు వారీగా వినియోగదారులు వ్యక్తిగత పనుల మీద మున్సిపల్, సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చి తమ వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయడంతో స్థానికులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అసలే ఇరుకు రోడ్డు కావడంతో వచ్చివెళ్లే వారికి సమస్యగా మారిందని, వెంటనే ట్రాఫిక్ పోలీసులు సమస్యను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు

నవతెలంగాణ-హాయత్ నగర్

ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా ఎల్.బి. నగర్. రింగ్ రోడ్డులో మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు బుద్ధ సత్యనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాగోల్ డివిజన్ అధ్యక్షులు మంజుల రెడ్డి,పుల్లయ్య, పథ్వీ రాజ్, అక్రం,జైపాలరెడ్డి,రోజారెడ్డ,ప్రకాశ్,చెర్ల రమేష్,కే వీ ఎస్ రెడ్డి,మున్న,జానీ, అంజనేయులు,లక్ష్మీవెంకటేష్,విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చెత్తను శుభ్రం చేయించిన కార్పొరేటర్



నవతెలంగాణ-వనస్థలిపురం

బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓఎస్ కాలనీ హెూమి యోపతి హాస్పిటల్‌లో చెత్తా చేదారం, చెట్ల కొమ్మలు ఎక్కడికక్కడ పేరుకుపోయి ఉన్నాయి. హాస్పటల్‌కు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని హెూమి యోపతి హాస్పిటల్ డాక్టర్ నర్మదా కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డికి సమాచారం అందజేశారు. ఈ మేరకు కార్పొరేటర్ హెూమియోపతి హాస్పటల్‌ను సందర్శించి వెంటనే సంబంధిత సిబ్బందితో శుభ్రం చేయించారు. తరచూ శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జైపాల్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఏఈ నరేంద్ర తేజ, జీహెచ్ఎంసీ ఎస్ఎస్ అజీమ్ ఉద్దీన్, జవాన్ రామచందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులుగా సయ్యద్ ఇస్మాయిల్



నవతెలంగాణ-చైతన్యపురి

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా ఆర్కే పురం డివిజన్‌కు చెందిన సయ్యద్ ఇస్మాయిల్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం సేవాదళ్ రాష్ట్ర కార్యాల యంలో సయ్యద్ ఇస్మాయిల్‌కు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సంద ర్భంగా మిద్దెల జితేందర్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల అభివద్ధికి సీఎం రేవంత్ రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. పేదలకు మేలు చేసే కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రతిపక్షాలు కుట్ర లు పన్నుతున్నాయని, వారి కుట్రలను తిప్పి కొట్టడం ఖాయమన్నారు. అనం తరం సయ్యద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమం గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతులను చేసేందుకు తనవంతు కషి చేస్తానని అన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటేందుకు తనవంతు కషి చేస్తానని హామీనిచ్చారు. తనను రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించినందుకు సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ కు, సీఎం రేవంత్ రెడ్డి, ఇతరులకు సయ్యద్ ఇస్మాయిల్ కతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ గూటికి సామ నరసింహ గౌడ్



నవతెలంగాణ-బడంగ్ పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ చైర్మెన్ సామ నరసింహ గౌడ్ త్వరలో కాంగ్రెస్లఓ చేరనున్నారు. బుధవారం మాజీ శాసన సభ్యులు తీగల కష్ణారెడ్డిని మీర్‌పేట్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీగల కష్ణారెడ్డి పిలుపు మేరకు త్వరలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు తెలిపారు. తనకు బీఆర్ఎస్ పార్టీలో తగిన గుర్తింపు లభించనందున, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నచ్చి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని తీగల కష్ణారెడ్డి ఆధ్వర్యంలో అందరం కలిసి కాంగ్రెస్‌ను బలపరచడానికి ఆ పార్టీలో చేరబోతున్నట్టు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం అభినందనీయం



నవతెలంగాణ-సంతోష్ నగర్

ఎన్.ఎస్.సి క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమని బీజేపీ కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం ఎన్.ఎస్.సి హైదరాబాద్ పిర్జాదిగూడలో అండర్-19 ఎన్.ఎస్.సి క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన ఎచంపాపేట్ డివిజన్ కెకె కుంట నివాసి శివాజీ గౌడ్‌కు కార్పొరేటర్ క్రికెట్ కిట్ అందజేశారు. ఎన్.ఎస్.సి క్రికెట్ జట్టుకు శివాజీ గౌడ్ క్రికెట్ జట్టుకు ఎంపిక అయిన ప్రోత్సాహకంగా క్రికెట్ కిట్ అందజేశారు. ప్రతిభను ప్రోత్సహించడంలో ఎల్లప్పుడూ ముందుం టామని తెలిపారు.చంపాపేట్ డివిజన్ నుంచి మరింత మంది క్రీడల్లో రాణించి మన చంపాపేట్ డివిజన్ పేరును జాతీయ స్థాయిలో మారుమోగించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహా నంది అవార్డు గ్రహీతకు సన్మానం



నవతెలంగాణ-కాప్రా

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో జూన్ 11 తేదీన నిర్వహించిన శ్రీమహా నంది అవార్డు ప్రదానోత్సవం కార్యక్రమంలో శ్రీమహ నంది అవార్డు అందుకున్న రమేష్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. శ్రీమహనంది అవార్డు దక్కడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ యోగా చేయాలి : యోగా గురువు శంకరాచారి



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయడం చాలా ముఖ్యమని యోగా గురువు శంకరాచారి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 పురస్కరించుకొని జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని బాలాజీ నగర్ బీజేపీ కార్యాలయంలో 19వ తేదీ బుధవారం నుంచి 23వ తేదీ ఆదివారం వరకు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 7:30 నిమిషాల వరకు ఉచిత యోగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు శంకరాచారి తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగా సాధన చేయడంతో అనేక దీర్ఘకాల రోగాల బారి నుంచి బయటపడడమేగాక శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మంచి ఆరోగ్యంతో పాటు శారీరక ధృఢత్వంతో ఆనందంగా జీవితాన్ని గడుపుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని "మీ కోసం ఒక ఒక గంటసేపు" అనే నినాదంతో యోగా జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్‌లోని వసంతపూరి కాలనీ లో రూ.15లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్యా, ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, నాయకులు సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, ఎస్.ఆర్. ప్రసాద్, రంగా విజయా కుమార్, బ్రహ్మయ్య అచ్చిరెడ్డి, రాము, నర్సింగ్ రావు, శ్రీనివాస్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- డ్రగ్స్‌పై పోరాటంలో యువత పాలుపంచుకోవాలి
- సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది
- రాచకొండ సీపీ తరుణ్ జోషి



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిషేధిత మత్తుపదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదని, డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాచకొండ సీపీ తరుణ్ జోషీ తెలిపారు. జూన్ 26న ప్రతి ఏటా నిర్వహిస్తున్న 'అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా బుధవారం నేరెడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో నిషేధిత మత్తుపదార్థాల వ్యతిరేక ప్రచార పోస్టర్లను సీపీ తరుణ్ జోషి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, యువత తమ శక్తియుక్తులను డ్రగ్స్ మాయలో పడి వృథా చేసుకోకూడదని, ఒక్కసారి డ్రగ్స్ వాడినా సరే అది మెల్లమెల్లగా వ్యసనంగా మారి దానికి బానిసలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డ్రగ్స్ మీద పోలీసులు చేస్తున్న పోరాటంలో యువత పాలుపంచుకోవాలని, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతో పాటు, తమ దృష్టికి వచ్చే నిషేధిత డ్రగ్స్ సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తక్షణమే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం పోలీసు శాఖ, యువతతోపాటు సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ వినియోగం, దాని దుష్ప్రభావాల గురించి యువతకు పరిజ్ఞానం కల్పించేందుకు సోషల్ మీడియాతో పాటు కళాశాలల్లో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. తెలిసీ తెలియక మత్తుపదార్థాల బారిన పడడం వల్ల యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని, యువత శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మత్తుపదార్థాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ రవాణా, వినియోగాన్ని అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెక్ పోస్టుల వద్ద క్రమంతప్పకుండా చేస్తున్న తనిఖీలతో పాటు, ప్రత్యేక ఎస్‌ఓటి బందాల ద్వారా ఎన్నో గంజాయి, ఓపియం, హెరాయిన్ వంటి నిషేధిత డ్రగ్స్ సరఫరా ముఠాలను పట్టుకొని 'ఎన్‌డీపీఎస్'తో పాటు ఇతర చట్టాల ప్రకారం కఠిన కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు, డీసీపీ ఎస్‌బీ కరుణాకర్, ఏసీపీ ఐటీ సెల్ నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

పేదల చదువుపై సీఎం చిన్న చూపు

- బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి
- విద్యార్థి సమాజానికి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి
- ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

సీఎం రేవంత్ రెడ్డి యావత్ విద్యార్థి లోకానికి తక్షణమే క్షమాపణ చెప్పాలని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి హాస్టల్స్‌లో పేద విద్యార్థులు చదువుకోవడం ఇష్టం లేదన్నారు. హాస్టల్స్‌లో చదువుకునే విద్యార్థులు అనేక మంది ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. హాస్టల్స్‌లో చదువుకునే విద్యార్థుల్లో మానవ సంబంధాలు మంచిగా లేవని సీఎం రేవంత్‌రెడ్డి అనడం హాస్టల్స్‌ను తీసివేసే కుట్రలో భాగమే అన్నారు. సీఎంకి విద్యార్థుల పైన చిత్తశుద్ధి ఉంటే తక్షణమే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయనీ, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు.

సికిల్ సెల్ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారి సర్వేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలోని గిరిజన బాలుర వసతి గృహంలో బుధవారం ప్రపంచ సికిల్ అనీమియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సికిల్ సెల్ అనీమియా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సికిల్ సెల్ అనీమియా వ్యాధి వంశపార్యపరంగా జీన్స్ ద్వారా సంక్రమిస్తుందన్నారు. ఇది శరీరంలోకి మెల్లగా ప్రవేశించి నరాలను బలహీనపరిచి ఇబ్బందులకు గురిచేస్తుందని పేర్కొన్నారు. ఈ వ్యాధిగ్రస్తులు అంతగా బాధపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ముందుగానే వ్యాధి లక్షణాలు గుర్తించి పరీక్షలు చేసుకొని నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా స్పెషల్ ఆఫీసర్ సైదా మాలోత్, డీటీడీవో ఇన్‌చార్జి జి.వినోద్ కుమార్, డాక్టర్ లావణ్య రెడ్డి, సీహెచ్‌వో పి.మహాలమ్మ, సూపర్‌వైజర్ సుదర్శన్ రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ శిరీష, ఆశ వర్కర్లు లక్ష్మీ, వసంత, ఎస్టీ కమిషన్ జిల్లా సభ్యుడు ధనరాజ్ నాయక్, హాస్టల్ వార్డెన్ రవీందర్ నాయక్, డీఈవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

- మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్
- మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు



నవతెలంగాణ-జవహర్ నగర్

జవహర్ నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్తామని మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ శాంతి అధ్యక్షతను మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలను చర్చించి తీర్మానం చేశారు. జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని బోర్ మోటర్స్ రిపేర్లకు రూ.5 లక్షలు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులకు రూ.10 లక్షలు, సీసీరోడ్డు ప్యాచ్ వర్క్‌లకు రూ.5 లక్షలను నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుండి ఖర్చు చేయాలని తీర్మానం చేశారు. అదేవిధంగా 2024-25 సంవత్సరానికి సంబంధించి తై బజార్, నర్సరీ నిర్వహణ చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా, మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి, డీఈ మాధవచారి, మేనేజర్ ప్రభాకర్, టీపీఎస్ శ్రవంతి, ఏఈ రాజశేఖర్, అకౌంటెంట్ సంగీత మాధురి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ వీరన్న, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రద్దీ సమయాల్లో ఆర్టీసీ స్పెషల్ డ్రైవ్



నవతెలంగాణ-ఘట్కేసర్

రద్దీ సమయాల్లో ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగులు సంయమనం పాటించి ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే. కవిత తెలిపారు. బుధవారం ఘట్కేసర్ పట్టణం యంనంపేట్ చౌరస్తా వద్ద నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఆమె పాల్గొని ప్రయాణికులు, సంస్థ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కావడంతో బస్సులలో రద్దీ పెరిగిందని, దీంతో విద్యార్థిని విద్యార్థులు, మహిళా ప్రయాణికులు బస్సులు ఎక్కేటప్పుడుచ దిగేటప్పుడు భద్రత నియమాలను పాటించాలన్నారు. కదులుతున్న బస్సును ఎక్కొద్దని, ఫుట్‌బోర్డు ప్రయాణం చేయకూడదన్నారు. ఫుట్‌బోర్డులో ఎవరూ లేరని నిర్ధారించుకున్నాకే బస్సును కదిలించాలని డ్రైవర్లకు సూచించారు. బస్ స్టాప్‌ల్లో మాత్రమే ప్రయాణికులు బస్సు ఎక్కాలని, సీటు పొందే ప్రయత్నంలో మూలమలుపుల వద్ద కదులుతున్న బస్సులను ఎక్కి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దన్నారు. బస్సు పూర్తిగా ఆగిన తర్వాతే ప్రయాణికులు దిగాలన్నారు. ఘట్కేసర్ నుండి ఉప్పల్ వరకు అన్ని పాయింట్‌లలో స్పెషల్ డ్రైవ్ జరుగుతున్నట్టు చెప్పారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో మియాపూర్-2 డిపో మేనేజర్ వెంకటేశం, ఎస్‌డీఐ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు ఏర్పాటు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని కమలా నగర్ వెల్ఫేర్ ఆఫీసు ప్రాంగణంలో సియాన్ క్యాన్సర్ క్లినిక్ వారితో లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా ఏఎస్ రావు నగర్, చారిటబుల్ ట్రస్ట్, కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత కాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు బుధవారం ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును క్లబ్ చార్టర్ మెంబర్ బాలకృష్ణ ప్రారంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ.. రాబోయే కాలంలో ఇలాంటి క్యాంపులు మరెన్నో నిర్వహిస్తా మన్నారు. క్యాంపులో 54 మంది స్త్రీలు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. సియాన్ క్యాన్సర్ క్లినిక్ డాక్టర్ సుష్మిత బృందం పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు విజయ కుమార్, వరప్రసాద్, డాక్టర్ దినేష్, శ్రీదేవి, రోజీతో పాటు వెల్ఫేర్ కమిటీ సభ్యులు రాఘవరెడ్డి, సీఎన్ రావు, మనోహరరావు, సహదేవ్, నవీన్, దత్తు, పావని పాల్గొన్నారు.

నీట్ పరీక్షా ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలి

- ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిండ్ల రాహుల్ యాదవ్



నవతెలంగాణ- మేడ్చల్

నీట్ పరీక్ష ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిండ్ల రాహుల్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ మేడ్చల్ పట్టణంలోని ఆయతి కళాశాల విద్యార్థులతో సిగ్నేచర్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ములంగిరి రవితేజ, లవంగు రాకేష్, మున్సిపల్ అధ్యక్షులు గుండ శ్రీధర్, మండల నాయకులు బట్టుమధు, నాయకులు వరుణ్ రెడ్డి, శశి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధి కోసం నైపుణ్యం పెంచుకోవాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి కోర్సు తర్వాత ఉపాధి కోసం నైపుణ్యతను పెంచుకోవాలని గ్రాడీ హౌస్ టెక్నాలజీ కంపెనీ కో ఫౌండర్ మధుసూదన్ తెలిపారు. బుధవారం ఘట్కేసర్, ఘనపూర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల అటనామస్‌లో విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి, ఉపాధి కొరకు గ్రాడీ హౌస్ టెక్నాలజీ కంపెనీ నుండి ఒప్పందం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ కో ఫౌండర్ మధుసూదన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇంజనీరింగ్ తర్వాత మంచి ఉపాధి కోసం మొదటి సంవత్సరం నుండే నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. దానికి ఈ ఒప్పందం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కొమ్మూరి దివ్య శ్రీ, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, కేపీఆర్ఐటీ డీన్ ప్రొఫెసర్ సోహిని రాయ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు



- ఉప్పల్ ఉప కమిషనర్ ఆంజనేయులు

నవతెలంగాణ-ఉప్పల్

బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉప్పల్ ఉప కమిషనర్ ఆంజనేయులు అన్నారు బుధవారం చిల్కానగర్ డివిజన్ ఎస్‌బీహెచ్ కాలనీ పార్క్ వద్ద గల గార్బేజ్ వనరబుల్ పాయింట్ జీవీపీ ఎలిమినేషన్‌లో భాగంగా చెత్త వేసే వారిని గుర్తించడానికి నూతన టెక్నాలజీతో సీసీ కెమెరా విత్ మైక్ సిస్టంను ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలను ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రత బాధ్యత ప్రతీ ఒక్కరిదన్నారు. ఈ జీవీపీ పరిసర ప్రాంతంలోని ఇంటి యజమానులు, షాపు యజమానులు ఇక్కడ చెత్త పడవేయకూడదని సూచించారు. చెత్తను కాలనీకి వచ్చే చెత్త ఆటో వారికి మాత్రమే ఇవ్వాలన్నారు. వారి సేవలుగాను నెలవారీ డబ్బు చెల్లించాలని సూచించారు. ఇక్కడ ఎవరైనా చెత్త వేసినట్టు గుర్తిస్తే రూ.1000 నుండి 5000 వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకొచ్చిన సందీప్ భూషణ్, ఎం.డీ గఫార్, రమేష్, శేఖర్ విజయ్ రామారావు, మన్నన్, శ్రావణ్, రిజ్వాన్, విష్ణు, హసన్, కృష్ణలను అభినందించారు.

బొంతు శ్రీదేవిని కలిసిన మహిళా నేతలు



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన పలువురు మహిళ నాయకురాళ్లు స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ను ఆమె నివాసంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలపై వివరించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కలిసిన వారిలో సత్తెమ్మ, రమారెడ్డి, నవనీత రెడ్డి, అరుణ, మున్నీ, సంధ్య, తదితరులు ఉన్నారు.

బిట్స్ పిలానీ విల్స్‌తో ఎంఎస్ఎన్ లేటొరేటరీస్ ఒప్పందం



నవతెలంగాణ-సిటీబ్యూరో

వేగంగా అభివృద్ధి చెందుతున్న పరిశోధన-ఆధారిత ఫార్మాస్యూటికల్ కంపెనీల్లో ఒకటైన ఎంఎస్ఎన్ లేబొరేటరీస్, తమ ఫార్ములేషన్ యూనిట్లలో తమ స్వీయ-నిర్దేశిత బందాలకు విద్యా అవకాశాలను పెంచడానికి ప్రయత్నిస్తూ బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ పిలానీ వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్ విభాగంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ సీఎండీ డాక్టర్ ఎంఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ "మా ఉద్యోగుల నిరంతర అభ్యాసం, వృద్ధి కోసం బిట్స్ పిలానీతో భాగస్వామ్యాన్ని ప్రకటించడం ఆనందంగా ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ పరిశోధన-ఆధారిత ఫార్మాస్యూటికల్ కంపెనీకి నాయకుడిగా, మా విజయానికి నిజమైన బలం మా ఉద్యోగులే. అంతర్గత ప్రతిభను నిమగ్నం చేయడం, పెంపొందించడం ఒక మౌలిక సూత్రం మాత్రమే కాదు, మా సంస్థ లక్ష్యం కూడా. మేం వారి పెరుగుదల, అభివృద్ధిలో పెట్టుబడి పెట్టడం కొనసాగించడానికి కట్టుబడి ఉన్నాం. సంయుక్తంగా మేం కొత్త శిఖరాలకు చేరుకుంటామని భరోసా ఇస్తున్నాం" అని అన్నారు.

ఘనంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలను గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పీఎం కిసాన్ పథకంలో నమోదుకు అవకాశం కల్పించాలి

- మూడుచింతలపల్లి మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గోనె హనుమంతరెడ్డి



నవతెలంగాణ-శామీర్‌పేట

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో లబ్దిదారుల నమోదుకు నిరంతరం ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను అందుబాటు లో ఉంచి రైతులకు న్యాయం చేయాలని మూడుచింతల పల్లి మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గోనె హనుమంత రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన బుధవారం నవతెలంగాణతో మాట్లాడారు. మోడీ ప్రభు త్వం ఈ నెల 18న పీఎం కిసాన్ సమ్మాన్ నిధులను విడు దల చేసిందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రైతుల ఖాతాలో ఏడాదికి రూ.6 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. ఇందులో 2019లో నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే లబ్దిపొందుతున్నారని, ఐదేండ్లుగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ అందుబాటులో లేదని విమర్శించారు. ఈ పథకంలో చిన్న, సన్నకారు రైతులు నమోదు చేసుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరాసత్ ద్వారా హక్కులు సంక్రమించినా, భూమి కొనుగోలు చేసిన రైతులు నష్టపోతున్నారని పీఎం కిసాన్ పథకంలో వారి పేరును నమోదుకు కేంద్ర ప్రభు త్వం చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం కిసాన్ పథకంలో నమోదు కోసం సంబంధిత శాఖ అధికారులను సంప్రది స్తే కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సూచనలు తమకు అందలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తవారికి అవకాశం ఇవ్వకపోవడం బాధాకర మన్నారు. ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 500 మద్దతు ధరకు అదనంగా కేంద్ర ప్రభు త్వం మరో రూ. 500 మద్దతు ధర ఇవ్వాలని కోరారు.

బాలానగర్ డీసీపీగా సురేష్ కుమార్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ - బాలానగర్

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ జోన్ డీసీపీగా సురేష్ కుమార్ బుధవారం నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టారు. బాలానగర్ డీసీపీగా పనిచేస్తున్న టి. శ్రీనివాసరావు బదిలీపై వెళ్ళగా బాలానగర్‌లో సురేష్ కుమార్ బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ, ఏసీపి, సీఐ, ఎస్ఐ తదితరులు ఆయనను పూలమాలలతో సత్కరించి, సాదరంగా ఆహ్వానించారు. అనంతరం అధికారులతో కలిసి డీసీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతి భద్రతలను కాపాడటమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, విధి నిర్వహణలో నిరంతరం క్రమశిక్షణతో పని చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, అవసరమైన సేవలందించాలని అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు అందించారు.

రక్తదానం విలువ నిండు ప్రాణం

- కుత్బుల్లాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బంటు నరేశ్ ముదిరాజ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రక్తదానం విలువ ఒక నిండు ప్రాణమని కుత్బుల్లాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బంటు నరేష్ ముదిరాజ్ అన్నారు.బుధవారం ఏఐసిసి అగ్రనేత, ఎంపి.రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని గాంధీభవన్‌లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో బంటు నరేష్ ముదిరాజ్,మిత్ర బందం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాహుల్ గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా రక్తదానం చేస్తున్నట్లు తెలిపారు.భావితరాల ప్రధానిగా రాహుల్ గాంధీని చూడడమే తమ ముందున్న లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

- కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

దోమల బెడద లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఏంటమాలజీ సిబ్బందికి మూసాపెట్ డివిజన్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ సూచించారు. డివిజన్ పరిదిలో దోమల తీవ్రత అధికంగా ఉండడంతో ఎంటమాలజీ సిబ్బందితో బుధవారం మైసమ్మ చెరువులో ఆయిల్ బాల్స్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా, మైసమ్మ చెరువు చుట్టు పక్కల ఉన్న బస్తీలలో ఉన్న ప్రజలకు దోమల బెడద ఎక్కువ అవ్వడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిసిందదన్నారు. అందుకే రానున్నది వర్షం కాలం కాబట్టి, ఎక్కడికక్కడ వర్షం నీరు నిల్వ ఉండటం వల్ల, దోమల బెడద నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే చెరువు లో ఉన్న గుర్రపు డెక్క ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి గుర్తు చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు మల్లేష్ గౌడ్ , అబ్బాస్ , ఏంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజల సహాయ సహకారాలతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు.బుధవారం డివిజన్ పరిధిలోని జగద్గిరి నగర్ లో సుమారు రూ.29 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సి.సి.రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం తాను శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ముఖ్యంగా భూగర్భ డ్రయినేజీ, సీసీ రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పన కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు.ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, బీఆర్ఎస్ యువజన నాయకుడు కొలుకుల జైహింద్, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ కమిటీ ఛైర్మెన్ వేణు యాదవ్, మాజీ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, బొగ్గుల సురేష్, పాపులు గౌడ్, అజాం,సిహెచ్.దాసు,విటల్ ముదిరాజ్,పాపిరెడ్డి, యాదగిరి, బ్రహ్మచారి,మనోజ్,స్థానిక నాయకులు జగన్ ముదిరాజ్,చందు,రాజ్ కుమార్, వరలక్ష్మి, చిన్న, సునీత,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాలపై జేఎన్‌టీయూహెచ్ ప్రొటక్షన్ ఫోర్స్ హర్షం

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



విద్యారంగం బలోపేతానికి కృషి చేసే నిర్ణయాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేయటంపై జేఎన్టీయూహెచ్ ప్రొటక్షన్ ఫోర్స్ హర్షం వ్యక్తం చేస్తుందని విద్యార్థి నాయకులు జవ్వాజి దిలీప్, రాహుల్ నాయక్‌లు అన్నారు. బుధవారం కూకట్ పల్లిలోని జేఎన్టీయూ హెచ్‌లో జేఎన్టీయూ హెచ్ ప్రొటక్షన్ ఫోర్స్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలోని 65 ఐటీఐ లను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా తీర్చి దిద్దే నిర్ణయాన్ని జేఎన్టీయూ హెచ్ ప్రొటక్షన్ ఫోర్స్ స్వాగతిస్తుందన్నారు. మల్లెపల్లి ఐటీఐ ప్రాంగణంలో భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించటం నిజంగా ఆనందదా యకమన్నారు. విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధంగా ఆలోచన చేయటం శుభపరిణామమన్నారు. ప్రభుత్వం ప్రకటించినట్లు పాఠశాల ఫీజుల నియంత్రణ చట్టం, ఇంజనీరింగ్ బి కేటగిరీ సీట్లును ఆన్‌లైన్‌లో ఎంపి క చేసే విధంగా అడుగులు వేయాలని కోరారు. కనీసం ప్రభుత్వ ఇంజి నీరింగ్ కళాశాలల. విద్యార్థులకు సైతం వివిధ రకాల పరిశ్రమలతో, వివిధి రకాల కంపెనీలతో ప్రత్యేకమైన ఎంఓయూలు చేసుకోని, ప్రభుత్వ ఇంజి నీరింగ్ కళాశాలలు విద్యార్థులకు సైతం ఇండస్ట్రియల్ ఎక్స్పోజల్ , నైపు ణ్యాలను అభివృద్ధి చేసే విధంగా యోజన చేయాలని కోరారు. ఈ కార్యక్ర మలతో విద్యార్థి నాయకులు శివకష్ణ, గాదె పవన్, చందు, అనిష్, అర్జున్, రంజిత్, అరవింద్,బ్రహ్మం, ప్రేమ్, రామకృష్ణ, సందీప్ పాల్గొన్నారు.

ఈటలకు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ భారీ మెజారిటీతో గెలవడం తమకెంతో ఆనందంగా ఉందని భట్రాజు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లెపల్లి సీతారామరాజు,మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కూరపాటి కరుణాకర్ రాజు లు సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం పలువురు సంఘ సభ్యులు, నిజాంపేట్, హైదర్నగర్ కార్యకర్తలతో ఎంపీని ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీతారామరాజు మాట్లాడుతూ తమ కులస్తుల సమస్యలు పరిష్కరించడంతోపాటు అండగా ఉండాలని ఎంపీ ఈటలను కోరారు.భట్రాజు కులస్తులకు అన్నివిధాలుగా అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్రఅసోసియేట్ అధ్యక్షుల శ్రీరామరాజు,శ్రావణ్ కుమార్ రాజు తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గహకల్ప పరిధిలోని శ్రీశ్రీశ్రీ ఆది జాంబవ అరుంధతి మాతకు బహుజన పూజారుల సంఘం అధ్యక్షులు బాబురావు, మహిళా అధ్యక్షురాలు కోటేశ్వరమ్మ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆది జాంబవ గురువు శ్రీశ్రీశ్రీ అరుంధతి మాత మహాశక్తి పీఠం వ్యవస్థాపకులు గజ్జల రాజయ్య జంబవ గురువు బహుజన పూజారుల సంఘానికి ముఖ్య సలహాదారుడిగా ఉండాలని కోరారు.

నవతెలంగాణ-దుండిగల్

శ్రీ చైతన్య పాఠశాలను వెంటనే మూసివేయాలి

- ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు
- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుచిత్రలో నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా నడుపుతున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోని మూసివేయాలని కుత్బుల్లాపూర్ ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు డిమాండ్ చేశాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 డివిజన్ పరిధిలోని సుచిత్ర మూడుగుళ్ళు ఎదురుగా ఉన్న శ్రీ చైతన్య పాఠశాలకు అనుమతులు లేకపోవడంతో మే నెలలో విద్యాశాఖ అధికారులు సీజ్ చేశారు. అయిన ప్పటికీ పాఠశాల యజమాన్యం అడ్మిషన్ స్వీకరిస్తూ... విద్యార్థులను చేర్చుకుంటోందని తెలిసింది. ఈ విషయంపై ఇప్పటికే ప్రయివేటు స్కూల్ యజమా న్యాలు కోర్టును ఆశ్రయించాయి. అయితే బుధవారం నుండి పాఠశాల ప్రారంభం చేస్తున్నమంటూ శ్రీ చైతన్య స్కూల్ మెసేజ్ లు పెట్టడంతో కుత్బుల్లాపూర్ బడ్జెట్ స్కూల్ యాజమాన్య సంఘం పాఠశాల ముందు ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధలుకు విరుద్ధంగా, ప్రభుత్వ అనుమతలు లేకుండానే 300 మంది విద్యార్థులును చేర్చుకొని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి కార్పొరేట్ పాఠశాలలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ధర్నాను ఉధతం చేస్తామని హెచ్చరించారు. పేద మధ్య తరగతి విద్యార్థులకు తక్కువ ఫీజుతో విద్యను అందిస్తున్న బడ్జెట్ పాఠశాలలపై కార్పొరేట్ విద్యాసంస్థల ఆధిపత్యం చలాయిస్తూ, విద్యార్థుల తల్లిదండ్రులతో లక్షల్లో ఫీజులు వసూలు చేసి వారిపై పెనుభారం మోపుతున్నాయన్నారు.

తెలంగాణ స్టేట్ ప్రయివేటు పాఠశాల అధ్యక్షులు మధు సుధన్ మాట్లాడుతూ నైతిక విలువలు లేని, సామాజిక విలువలు తెలియని శ్రీ చైతన్య పాఠశాలను మూసి వేయాలని కోరారు. తెలంగాణ ప్రయివేటు స్కూల్ సెక్రటరీ ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల పై క్రిమినల్ కేసుల పెట్టాలని కోరారు. మేడ్చల్ జిల్లా ప్రయివేటు పాఠశాల అధ్యక్షుడు రామేశ్వర రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు పాఠశాలకు మధ్య వ్యత్యాసం లేకుండా నడపడం వల్ల బడ్జెట్ పాఠశాల మనుగడ అగమ్యాగోచరంగా మారిందన్నారు. కుత్బుల్లాపూర్ ప్రయివేటు పాఠశాలల మండల అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ గతేడాది అర కిలోమీటర్ దూరంలో శ్రీ చైతన్య స్కూల్ పెట్టడం జరిగిందని, నేడు అదే పాఠశాలను నిబంధనలకు విరుద్ధంగా సెయింట్ ఆంథోనీ పాఠశాల ఎదురుగా పెట్టడంతో బడ్జెట్ పాఠశాలలను దెబ్బతీయలనే ఉదేశంతో ఇక్కడ ప్రారంభించారని.. దీన్ని ఖండిస్తున్నామన్నారు. సెక్రెటరీ రవి మాట్లా డుతూ బడ్జెట్ పాఠశాలల హక్కులు ను కాపాడాలని కోరారు. సెయింట్ అంథోనీ హై స్కూలు కరెస్పాం డంట్ ఎస్‌పీ సుందర్ రాజు మాట్లాడుతూ సెయింట్ ఆంటోనీ పాఠశాలను గత 25 ఏండ్లుగా ఇక్కడే నడుపుతూ అనేకమంది పేద విద్యార్థులకు విద్య అందిస్తు ముందుకు సాగుతున్నామని తెలిపారు. కానీ శ్రీ చైతన్య పాఠశాల బడ్జెట్ పాఠశాలలను టార్గెట్ చేస్తూ 40 పాఠశాలలు మూత పడేవిధముగా వ్యవహరిస్తూ , బానిస విద్యని అందిస్తూ సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్నదన్నారు. మాజీ అధ్యక్షుడు వర ప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యను నియంత్రించాలని కోరారు. అనంతరం తెలంగాణ సెక్రటేరియట్‌లోని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసిశ్రీ చైతన్య పాఠశాల పై వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. కార్పొరేట్ పాఠశాలను నియంత్రించాలని బడ్జెట్ పాఠశాలలు హక్కులు కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్ మండల శ్రీనివాస గౌడ్, మల్లేష్ చింత, గోవర్ధన్, పలు పాఠశాలల కరస్పాండెంట్లు, మండల కరెస్పాండెంట్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

- గోగులపాటి కృష్ణమోహన్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గోగులపాటి కృష్ణమోహన్ ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. ఇటీవల సైబర్ నేరాలు హెచ్చు మీరుతున్నాయని, క్షణాల్లో డబ్బులు మాయమైపోతున్నాయని, అమాయక ప్రజలు పెద్ద మొత్తంలో ఆర్థికం గా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సైబర్ నేరాలను అరికట్ట డం అసాధ్యమని, ప్రజల్లో అవగాహన పెంపొందించడం, జాగ్రత్తలు పాటిం చడం ద్వారానే సైబర్ నేరాలను నివారించవచ్చని తెలిపారు. అయితే కొన్ని వ్యాపార సంస్థల్లో ముఖ్యంగా హోటల్స్, హాస్టల్స్, హాస్పిటల్స్, పబ్స్, రెస్టారెం ట్స్ ఎడ్యుకేషనల్ యూనివర్సిటీస్, షాపింగ్ మాల్స్ లాంటి ప్రధాన వ్యాపార కేంద్రాలలో వినియోగదారులను ఆకర్షించేందుకు ఉచిత వైఫై అందజేస్తుం టారని, ఇలాంటి చోట్ల నుండి సైబర్ నేరాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఇలాంటి ఫ్రీ వైఫై జోన్లలో ఓకే పాస్వర్డ్ యూసర్ నేమ్ ను ఎక్కువమంది ఉపయోగించడం వల్ల ఏ పరికరాన్ని ఎవరు ఉపయో గిస్తు న్నారో అని కచ్చితంగా తెలుసుకునే అవకాశం ఉండదని, సైబర్ నేరగాళ్లను త్వరితగతిన గుర్తించడానికి అవకాశం ఉండదని కృష్ణమోహన్ తెలిపారు. ఇలాంటి ఫ్రీ వైఫై అందజేసే వ్యాపార సంస్థలు ఐకాన్ వేవ్, ఐకాన్ వైఫై లాంటి బ్యాండ్ విడ్త్ మేనేజ్మెంట్ సేఫ్టీ అప్లికేషన్లను ఉపయోగించి నట్టయితే ప్రతి యూజర్‌కు అతేంటికేషన్, ఆథరైజేషన్, ఎకౌంటబిలిటీ ఉంటుందని, దాని ద్వారా నేరాలు జరిగినప్పుడు వెంటనే గుర్తించే అవకాశం, కాల్ లాగ్స్ స్టోరేజ్ మొదలగు సదుపాయాలు ఉంటాయని, సైబర్ పోలీసులు కూడా సైబర్ నేరగాళ్ళను తొందరగా గుర్తించి పట్టుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ము ఖ్యంగా అపరిచితుల ఫోన్ కాల్స్ ను ఎత్తకపోవడం, అపరిచితులకు అకౌంట్ వివరాలు చెప్పకపోవడం, సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన లింకుల జోలికి వెళ్లకపోవడం లాంటి జాగ్రత్తలు పాటిస్తే సైబర్ నేరాల భారిన పడకుండా ఉంటామన్నారు.సైబర్ నేరాలకు నియంత్రించలేకున్నా, వాటిపట్ల ప్రజలను జాగృతం చేసినట్టయితే వాటి బారిన పడకుండా కాపడగలిగిన వారిమౌతామన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎక్కడికైనా వెళ్తాను..

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- టెండర్లు జరిగిన పనులను సైతం పక్కన పెట్టడంతో అధికారుల పై ఆగ్రహం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎక్కడికైనా వెళ్తానని.. ముఖ్యమంత్రి, ఎంపీ ఎవరినైనా కలుస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పది సంవత్సరాలుగా వేల కోట్ల రూపాయలతో కూకట్ పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని, అభివద్ధిలో ఎలాంటి ఆటంకాలు జరగకుండా అందరి సహకారంతో డ్రయినేజీ, మంచినీటి సమస్యలను, ట్రాఫిక్ సమస్యలను నిర్మూలించామన్నారు. ప్రభుత్వం మారిన ఆరు నెలల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోగా, గత సంవత్సరంలో రూ. 65 కోట్లతో ,రోడ్లు ,డ్రయినేజీ, మంచినీటి పైప్లైన్ లకు శంకుస్థాపనలు చేసి టెండర్లు జరిగినా అలాంటి పనులను పక్కన పెడుతున్నారని అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్లను కాదని ప్రోటోకాల్ పక్కన పెట్టి ఇతర లీడర్ల ద్వారా పనులు చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినా ప్రజలకు చేసే అభివృద్ధిలో ఎలాంటి ఆటంకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని, కూకట్ పల్లి నియోజకవర్గంలోని చెరువులలో గుర్రపు డెక్కలు తొలగించాలని, దోమల మందు పిచికారీ చేయాలని అధికారులకు తెలిపారు. అంతేకాకుండా అభివృద్ధి కోసం తాను ఎక్కడికి వెళ్లడానికైనా వెనకాడనని చెప్పారు. కార్పొరేటర్లు ముద్దం నరసింగ్ యాదవ్, పండాల సతీష్ గౌడ్, శిరిషా బాబురావు, ఆవుల రవీందర్ రెడ్డి, జూపల్లి సత్య నారాయణ, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, మందాడి శ్రీనివాస్ రావు, కూకట్ పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని, పీజేఆర్ కాలనీలో డ్రయినేజీ లైన్లు అలాగే తాగు నీటికి సంబంధించి సమస్యలు ఉన్నాయని, కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దష్టికి తీసుకురాగా కార్పొరేటర్ జీహెచ్ఎంసీ అధికారులు కాలనీ వాసులతో కలిసి బుధవారం పేజీఆర్ నగర్‌లో పర్యటించారు. సమస్యలను పరిశీలించిన కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో ప్రధానంగా ఉన్న డ్రయినేజీ సమస్యను అతిత్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీ లోని డ్రయినేజ్ లైన్స్ కు సంబంధించి అవసరమైన బడ్జెట్‌ను, ఎస్టిమేషన్ వేసి ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే కొంతమంది తాగు నీరు ప్రెషర్ రావడం లేదని తెలియజేయగా, సమస్య ఎక్కడ ఉందో తెలుసుకుని పరిష్కరించాలని వాటర్ వర్క్స్ అధికారులకు తెలిపారు. కాలనీలో పారిశుధ్య సమస్య ఎక్కువగా ఉందని, చెత్తను రోడ్ల మీద, బిల్డింగ్ ల మధ్యలో వేయడం వల్ల పరిసర ప్రాంత ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది కాబట్టి.మీరందరు మీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని, తడిచెత్తా, పొడిచెత్తను వేరువేరుగా బస్తీకి వచ్చి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని, చెత్తను నాలాలలో గాని, రోడ్లమీద గాని, చెరువులలో గాని వేయవొద్దని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు వాటర్ వర్క్స్ మేనేజర్ ఝాన్సీ, వర్క్ ఇన్స్పెక్టర్స్ రవి కుమార్, రవీందర్ రెడ్డి, యూబీడీ సూపర్వైజర్ నాగ రాణి, ఎంటమాలజీ సూపర్వైజర్ డి.నరసింహులు, సూపర్వైజర్ శివ, ఎస్ఎఫ్ఎ మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరేళ్ల శ్రీనివాస్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, భాస్కర్, బాలస్వామి, యాదగిరి, సంగమేష్, అగ్రవాసు, వాలి నాగేశ్వరరావు, మధులత, భిక్షపతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారుల సహకారంతోనే రూ. 4 వేల కోట్ల లావాదేవీలు

- ది సిటీజన్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మెన్ రంగరాజు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఖాతాదారులందరి సహకారంతోనే సొసైటి రూ. 4000 కోట్ల లావా దేవిలు చేసిందని ది సిటీజన్ కో ఆపరేటివ్ సొసైటీ ఛైర్మెన్ రంగరాజు అన్నారు. బుధవారం కూకట్ పల్లి లో గల ఏటీసి హెూటల్లో ఖాతాదారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన తో పాటు వైస్ ఛైర్మన్ వైఎస్ఆర్ మూర్తి, మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.సుబ్బయ్య, డైరెక్టర్లు కోటేశ్వర్ రావు, సోమలింగంగౌడ్, ప్రభాకర్ రావులు పాల్గొన్నారు. రంగరాజు మాట్లాడుతూ పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ మన సొసైటి పని చేస్తుందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.సుబ్బయ్య మాట్లాడుతూ 42 బ్రాంచులతో ఐదు రాష్ట్రాలలో పని చేస్తుందని తెలిపారు. దేశంలోనే టాప్ 10 సొసైటీలలో మన సిటీజన్ కో అపరేటీవ్ సొసైటీ ఒకటన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట, కూకట్ పల్లి, మియాపూర్, కేపీహెచ్ బీ కాలనీ, భరత్నగర్, ఎస్ఆర్నగర్ మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు అండగా కాంగ్రెస్



- కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రజల సమస్యలకు పరిష్కరించే విధంగా కాంగ్రెస్ అండగా ఉంటుందని కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి తెలిపారు. బాచుపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం సీఎం సహాయనిధి చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్‌కు చెందిన నాగరాజు భార్య సుజాత కొన్నిరోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందేందుకు ఆర్థిక స్థోమత లేకపోవటంతోకొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 2,50,000/- ల సీఎం సహాయనిధి - ఎల్వోసీ ని మంజూరి చేయించారు. రూ.2,50,000/- అలాగే 131 వ డివిజన్ కు చెందిన రవికుమార్ కుమార్తె ప్రసూతి సమయం టర్నర్ సిండ్రోమ్స్‌తో అనారోగ్యం బారిన పడటంతో కొలను హనుమంత రెడ్డిని సంప్రదించగా మంత్రి శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్సకు సీఎం సహాయ నిధిని సహాయం అందించడంతో సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి మంజూరు పత్రాలను నాగరాజు కుటుంబ సభ్యులకు, రవికుమార్ కుటుంబానికి కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. బి -బ్లాక్ అధ్యక్షులు బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి సీనియర్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, గడ్డం రాజేందర్ రెడ్డి, గణేష్, నర్సింగ్ రావు, ప్రసన్న కుమార్, నరేష్, అమీర్ అలీ, స్వాతి, శ్రీలత ముదిరాజ ఫారీన్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ 54వ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-బాలానగర్

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ 54వ జన్మదిన సందర్భంగా ఎన్ఎస్‌యుఐ కూకట్ పల్లి ప్రెసిడెంట్ సాయితేజ అధ్యరంలో బుధవారం కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్‌లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు అందజేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ముఖ్య అతిథిగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాఘవేంద్ర, ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ మిస్బావుద్దీన్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీ వర్ధన్ ముదిరాజ్, పాఠశాల సిబ్బందితోపాటు నాయకులు జమీల్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి, నాగార్జున, నాయకులు దినేష్, వినయ్, గున్న, రుత్విక్ ఇతర తదితర నాయకులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ : ప్రజలు ఆశీర్వాదంతో ప్రధాని పీఠం ఎప్పటికైనా రాహుల్ గాంధీ కూర్చుంటారని కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బుధవారం కేపీహెచ్ బీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అంతకు ముందు వాడ వాడలా కేక్ కటింగ్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రమ్య గ్రౌండ్‌లో కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ జోడో యాత్ర , న్యాయ యాత్ర చేసి దేశంలో బీజేపీ తలదన్నే పార్టీగా ఇండియా కూటమికి బలం చేకూర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సేరి సతీష్ రెడ్డి ,బచ్చు రాజు , డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ , అరవింద్ రెడ్డి ,మేకల మైకల్ ,ఫణి కుమార్, బాబ్జి కుమార్ ,నల్లి నీ కాంత్ చౌదరి ,శివ చౌదరి, నాగమల్లేశ్వరరావు, రాజు ముదిరాజ్, నిలీష్ గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు రాజు, సోను మహిళా నాయకురాలు బండి సుధా, సంధ్యారాణి, జోజమ్మ, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు.కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మహిళకు బుధవారం రూ.2 లక్షల50 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి చెక్కును ఆయన అందజేశారు. సూరారం 129 డివిజన్ మార్కండేయ నగర్ కు చెందిన ఆకోజు శోభారాణి కిడ్నీ సంబంధిత వ్యాధితో భాధపడుతుండడంతో ఆమె కుమారుడు ఆకోజు వెంకటేష్ కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ దష్టికి తీసుకురాగా ఆయన సత్వరమే స్పందించి, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 2,50,000 ల సీఎం సహాయనిధి ఎల్ఓసిని మంజూరి చేయించారు. బుధవారం షాపూర్ నగర్‌లోని తన కార్యాలయం వద్ద రూ.2 లక్షల50 వేల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి మంజూరి పత్రాలను ఆకోజు శోభారాణి కుటుంబ సభ్యులకు కూన శ్రీశైలం గౌడ్ అందజేశారు.

నా విజయంలో అందరి కృషి : ఈటల



నవతెలంగాణ-కూకట్‌పల్లి

తన విజయంలో ప్రతి ఒక్కరి కషి ఉందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రత్యేక ఆహ్వానం మేరకు బుధవారం మధ్యాహ్నం ఎంపీ ఆయన ఇంటికి విచ్చేశారు. వడ్డేపల్లి రాజేశ్వరరావు బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈటలకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తన విజయం లో ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త, నా అభిమానులతో పాటు తెలంగాణ ఉద్యమకారుల సహకారం ఎంతగానో ఉందన్నారు. కష్టపడే వారికి ప్రతిఫలం ఖచ్చితంగా దక్కుతుందని, పార్టీ వారికి తగిన గుర్తింపు ఇస్తుందని తెలియజేస్తూ, ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నటువంటి వడ్డేపల్లి రాజేశ్వరరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

జులై 7న దండోరా రజతోత్సవ వేడుకలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

మాదిగ, మాదిగ ఉపకుల ప్రజలను చైతన్య పరుస్తూ, సమస్యల పరిష్కారం కోసం ఆవిర్భవించిన సంస్థ మాదిగ దండోరా రజతోత్సవ వేడుకలను వచ్చేనెల 7న రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్నట్టు మేడి పాపన్న తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. 30 ఏండ్లుగా మాదిగల లో చైతన్యం కల్పిస్తున్న మాదిగ దండోరా రాజతోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్యే వేముల వీరేశం తదితరులు హాజరవుతారని తెలిపారు. దండోరా 30 ఏండ్లుగా ఎదుర్కొన్న ఆటుపోట్లు మాదిగల జీవిత విశేషాలను వివరిస్తూ రూపొందించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఈ సందర్భంగా నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మార్పీఎస్ జాతీయ గౌరవ అధ్యక్షులు గుర్రాల శ్రీనివాస్,చంద్రపల్లి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులు బుధవారం బోయిన్‌పల్లి ప్లేగ్రౌండ్ వద్ద పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ ముఖ్యఅతిథులుగా హాజరై కక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొల్లు కిషన్, బంగారు సదానంద రెడ్డి, మధుకర్ ప్రభు గుప్తా తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కంటోన్మెంట్



శ్మశాన వాటికలో షెడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధి వెస్ట్ మారేడ్‌పల్లి హిందూ స్మశాన వాటికలో దివంగత శ్రీ గుండెల్లి రాజయ్య జ్ఞాపకార్థం వారి వారసులు గుండెల్లి మహేష్, రాహుల్ ప్రవీణ్ ప్రమోద్ నిర్మించిన కర్మ షెడ్డును బుధవారం ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రారంభించారు అనంతరం స్మశాన వాటికలో చెట్లు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతలు ఇలా ముందుకొచ్చి మంచి పనులు చేయడం సంతోషకరమని అభినందించారు. అదేవిధంగా స్మశానవాటికలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇంకా అవసరమైన వసతులు కల్పించడానికి ప్రభుత్వం దష్టి కి తీసుకెళ్లి వసతులు ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో హిందూ స్మశాన వాటిక ఇన్‌చార్జ్ సదానందం,అధ్యక్షులు వెంకటస్వామి,ఉపాధ్యక్షులు చిట్టిబాబు జాయింట్ సెక్రెటరీ భీమ్ రావు, స్మశాన వాటిక సభ్యులు పాల్గొన్నారు.



మానికేశ్వర్ నగర్‌లో డిప్యూటీ మేయర్ పర్యటన

- బస్తీల్లోని పలు సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం

నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్‌లోని మానికేశ్వర్ నగర్‌లో బుధవారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి , ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ నేత మోతె శోభన్ రెడ్డి పర్యటించారు. కాలి నడకన అధికారులతో కలిసి నడుస్తూ బస్తీ వాసుల సమస్యలను తెలుసుకుంటూ, విద్యుత్, నీటి, పారిశుధ్య తదితర సమస్యలకు తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికలతో సంబంధం లేకుండా బస్తీ సమస్యల పరిష్కారం కోసం విచ్చేసిన డిప్యూటీ మేయర్ పని తీరును బస్తీవాసులు ప్రశంసిస్తూ హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ సుభాష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆశలత, డిప్యూటీ ఇంజనీర్ సువర్ణ, ఆర్‌యూబీ ప్రాజెక్టు అధికారి రేణుక, ఎంటమాలజీ ఎస్సీ దుర్గ ప్రసాద్, ఏఎంఓహెచ్ రజనీకాంత్, అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేష్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ఆర్‌బీ డీజీఎం సరిత, కృష్ణ ప్రసాద్, టీజీఎస్‌పీడీసీఎల్ ఏఈ శ్రీకాంత్ రెడ్డి, అధికారులు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దక్షిణాదికి ఏం చేశారని ప్రియాంక గాంధీని గెలిపించాలి

- దక్షిణ భారత జేఏసీ చైర్మెన్ ప్రొ. గాలి వినోద్ కుమార్

నవతెలంగాణ-ఓయూ



దక్షిణ భారతదేశానికి కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ ఏం చేశారని ప్రియాంక గాంధీని వయనాడు ప్రజలు గెలిపించాలని దక్షిణ భారత జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ అన్నారు. బుధవారం తార్నాక లోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణాదికి హైదరాబాద్‌ను దేశ రెండవ రాజధానిగా చేయాలని అంబేద్కర్ 1955లో ప్రతిపాదిస్తే కాంగ్రెస్, బీజేపీలు ఎందుకు పట్టించు కోలేదని ఆయన ప్రశ్నించారు. దక్షిణాదికి సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు, దక్షి ణాది రాష్ట్రాల అభివద్ధి మండలి, దక్షిణాది రాష్ట్రాల ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమి షన్, దక్షిణాది భాషల అభివృద్ధి మండల ఏర్పాటు, ఇండస్ట్రియల్ పార్క్, ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా, పోలవరానికి జాతీయ హోదా, తెలం గాణకు బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాళేశ్వరానికి జాతీయ హోదా, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఇలా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్ని పరిష్క రించని బీజేపీ, కాంగ్రెస్‌లను దక్షిణాదిలో ఓడించాలని ఆయన పిలుపు నిచ్చారు. దక్షిణాదిలోని అతిపెద్ద రాష్ట్రం తమిళనాడు కర్ణాటక కావేరి జలవి వాద పరిష్కారం కాలేదని, ఆ రాష్ట్రాలతో పాటు కేరళ రాష్ట్రానికి అభివద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదని, ఇలా దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల పట్ల ఉత్తరాది పాలకులు చిన్న చూపు చూశారన్నారు. ఉత్తరాదికి చెందిన రాహుల్ గాంధీ దక్షిణాదిన ఐదేండ్లు ఎంపీగా ఉండి ఏమీ పట్టించుకోలేదని, ఢిల్లీకే పరిమితమయ్యే ప్రియాంక గాంధీ వయనాడును ఏం పట్టించుకుంటుందన్నారు.

గ్రూప్ 1 పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్య చెప్పాలి

- సుమోటోగా కేసు తీసుకోవాలని హైకోర్టు సీజేకు లేఖ రాస్తాం
- దళిత మైనారిటీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణలో గ్రూప్ 1 పరీక్ష జరిగి పది రోజులు గడిచినా ఇప్పటి వరకు హాజరైన అభ్యర్థుల సంఖ్య తెలపడం లేదనిదళిత మైనారిటీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ అన్నారు. వెంటనే గ్రూప్ 1 పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్య తెలపాలని డిమాండ్ చేశారు. దళిత మైనారిటీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల సంఖ్య తెలపకుంటే పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్ 1 అభ్యర్థులకు న్యాయం జరిగేలా హైకోర్టు సుమోటో కేసుగా పరిగణించాలని కోరారు. ఈ విషయంపై హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ రాస్తామని తెలిపారు. అలాగే రాష్ట్ర మానవ హక్కుల కమీషన్‌కు, సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాస్తామన్నారు. గ్రూప్ 1 ఫలితాలకు ముందే అప్లికేషన్ల సంఖ్య, హాజరైన విద్యార్థుల సంఖ్యను అధికారికంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీ మీటింగ్‌లకు హాజరైనట్టుగా మూడు లక్షలు అని కాకుండా ఖచ్చితమైన లెక్కలు చెప్పాలన్నారు. ఆదివారం జరిగిన సివిల్స్ పరీక్షకు హైదరాబాద్‌లో 99 కేంద్రాల్లో 49883 మంది హాజరయ్యారని అధికారికంగా ప్రకటించారని గుర్తుచేశారు. కానీ గ్రూప్ 1 జరిగి పది రోజులైనా, ప్రిలిమినరీ కీ విడుదలైనా అభ్యర్థుల వివరాలు మాత్రం ఖచ్చితంగా చెప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖచ్చితమైన లెక్కలు చెపాపకపోతే అవకతవకలు జరిగే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల కష్టపడి చదివే విద్యార్థులు నష్టపోతారని తెలిపారు. ప్రభుత్వాలు మారినా,పబ్లిక్ సర్వీస్ కమీషన్ బోర్డు మారినా నిరుద్యోగులకు మాత్రం న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలను సమన్వయం చేసి ఉద్యమం నిర్మిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎమ్ఎస్‌ఏ ప్రెసిడెంట్ దూడపాక నరేష్, డీటీఎస్‌ఏ ఓయూ అధ్యక్షులు సమీర్, ప్రవీణ్ ,కుమార్,పాల్గొన్నారు.

హిందీ జాతీయ సదస్సు విజయవంతం



నవతెలంగాణ-ఓయూ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మల్కాజిగిరి హిందీ విభాగం, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో " డాక్టర్ మోహన్ సింగ్ వ్యక్తిత్వము, రచనలు, చర్చలు " అనే అంశంపై బుధవారం జాతీయ సదస్సును ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల రూమ్ నెంబర్ 57 లో నిర్వహించారు. ఈ ప్రారంభ సదస్సులో కన్వీనర్ డాక్టర్ జగన్ సదస్సు లక్ష్యాన్ని సభకు వివరించారు. ప్రారంభోపన్యాసంలో ఓయు ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగాధ్యక్షురాలు ప్రొఫెసర్ మాయ ప్రొ. మోహన్ సింగ్ వ్యక్తిత్వాన్ని కొనియాడారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ. లింబాద్రీ ప్రొ. మోహన్ సింగ్‌ను బహుముఖ ప్రజ్ఞాశాలిగా అభివర్ణించారు. హిందీ, తెలుగు సాహిత్యాలకు వారు చేసిన కషిని గుర్తుకు చేశారు. విశిష్ట అతిథి కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొ. సాయన్న పేద విద్యార్థులకు మార్గదర్శిగా ఆచార్య మోహన్ సింగ్‌ను స్మరించుకున్నారు.ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. అర్జున్ రావు మాట్లాడుతూ పరిపాలనా దక్షులుగా వారు ఆర్ట్స్ కళాశాలకు చేసిన సేవలను తెలియజేశారు. ఉన్నత విద్యా మండలి జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్,తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మెన్ మహమూద్, ప్రొ. మాణిక్యాంబ,ప్రొ. వేణుగోపాల్ రెడ్డి,బాలాజీ సింగ్ వారికి ఆచార్య మోహన్ సింగ్ తో ఉన్న పరిచయాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రొ. మోహన్ సింగ్ సాహితీ సజన పై వచ్చిన పుస్తకాలను ఆవిష్కరించారు.కార్యక్రమంలో పాల్గొన్న అతిథులందరినీ సదస్సు నిర్వాహ కులు ఘనంగా సత్కరించారు.డాక్టర్ దత్త,డాక్టర్ శ్యామ్ సుందర్, డాక్టర్ సంగీత, డాక్టర్ అజయ్‌లతో పాటు సదస్సు కో కన్వీనర్ లు డాక్టర్ బ్రిజేష్, డాక్టర్ స్వప్న, డాక్టర్ సీతారాం, డాక్టర్ బండి రాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు పరామర్శ

నవతెలంగాణ-బేగంపేట్

మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను బుధవారం పలువురు నాయకులు పరామర్శించారు. ఇటీవల ఆయన సోదరుడు, మోండా మార్కెట్ వర్తకుల సంఘం అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ మరణించగా బుధవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంతరావులు వెస్ట్ మారేడ్ పల్లి లోని నివాసంలో తలసానిని కలిసి పరామర్శించారు. శంకర్ యాదవ్ బోయిన్ పల్లి వర్తకులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కషి చేశారని వారు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అదేవిధంగా సనత్ నగర్ కు చెందిన ముస్లీం మైనార్టీ నాయకులు నుమాన్, జమీర్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. వారి వెంట బొల్లారం కార్పొరేటర్ జితేంద్రనాథ్, బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ తదితరులు ఉన్నారు.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే శ్రీ గణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయిన్‌పల్లి ప్రాంతంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా త్వరిత గతిన పరిష్కరిస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. బుధవారం బోయిన్‌పల్లిలోని హిందూ శ్మశానవాటిక ను వారు పరిశీలించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్.. స్మశాన వాటికలో సమస్యలతో పాటు స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో శ్రీ గణేష్ స్మశాన వాటికను సందర్శించటమే కాకుండా స్థానికంగా ఉన్న సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. జంపన్న ప్రతాప్ , ముప్పిడి మధుకర్‌లతో కలిసి బోయిన్‌పల్లి ప్రాంతంలో పర్యటించారు

అనంతరం బోయినపల్లి గిరిజన విద్యార్థుల హాస్టల్ లో ఉపాధ్యాయుల నిర్వహించిన సికిల్ సెల్ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారుగిరిజన ప్రాంత ప్రజలకు గిరిజన విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియాపై మరింతగా అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలో ప్రిన్సిపాల్ లాలూ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా ట్రైబల్ డెవల ప్మెంట్ అధికారి కోటజీ గోని ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సికిల్ సెల్‌పై సదస్సు, ర్యాలీ నిర్వహించచి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఇది వారసత్వంగా వచ్చే ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమని, ఇవి మన రక్తంలో ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోప బూయిష్టంగా ఉంటాయని తెలిపారు. దీనిపై ప్రజలు అవగాహన కలిగి ఉండలన్నారు రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్ల పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, అలసట మొదలైనవి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలని తెలిపారు ఈ లక్షణాలు కలిగివున్న వారు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అనంతరం పలు క్రీడలలో ఇటీవల మెడల్స్ సాధించిన విద్యార్థులను ఆయన ఘనంగా సత్కరించారు . కార్యక్రమం లో డాక్టర్ స్నుజోనా , స్పోర్ట్స్ అధికారిని జ్యోతి అమృత , నీలిమ , ఎల్లమ్మ , రఘుమ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో ఒక్కరే ఆయా

- ఎమ్మార్వో కార్యాలయాన్ని హైస్కూల్ కు కేటాయించాలి
- సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్

నవతెలంగాణ-ఓయూ

మారేడుపల్లి మండలంలోని 500 పైగా విద్యార్థులు చదువుకునే అతిపెద్ద స్కూలు అడ్డగుట్ట ప్రభుత్వ హైస్కూల్‌లో ఒక్కరే ఆయా ఉన్నారని, దాంతో విద్యార్థిని విద్యార్థులు చాలా అవస్థలకు గురువుతున్నారని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల పేరుతో పేద వర్గాల ప్రజల నెత్తురు తాగుతున్న ప్రయివేటు పాఠశాలల ఆగడాలను అరికట్టాలని.. సర్కార్ బడులను బలోపేతం చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రభుత్వ బడుల పరిశీలన కార్యక్రమంలో భాగంగా బుధవారం అడ్డగుట్టలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలను సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం మూలాన ప్రభుత్వ బడులు పూర్తిగా నిర్వీర్యానికి గురయ్యాయని తెలిపారు. సరైన మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల గురవుతున్నారని చెప్పారు. అడ్డగుట్టలోని ప్రభుత్వ హైస్కూల్లో సగానికి పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి అని తెలిపారు. సరిపడ తరగతి గదులు లేకపోవడంతో చాలామంది విద్యార్థులు అడ్మిషన్స్ దొరక్క ప్రయివేటు వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. కావున విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తక్షణమే ఎమ్మార్వో కార్యాలయాన్ని అక్కడ నుంచి తరలించి పాఠశాలకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఫీజుల పేరుతో విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్న ప్రయివేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి వారి ఆగడాలను కట్టడి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్ సువర్ణ, సీపీఐ నాయకులు కొమురెల్లి బాబు, పాకాల యాదగిరి,గౌరీ నాగరాజ్, శ్రీహరి, సయ్యద్ గౌస్,సాయిలు పాల్గొన్నారు.



22న పీఓడబ్ల్యూ అర్ధ శతాబ్ది వార్షికోత్సవం

- పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-బంజారా హిల్స్

ఈనెల 22న బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్లఓ పిఓడబ్ల్యూ అర్ధ శతాబ్ది సభ నిర్వహిస్తున్నట్టు పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో పీఓడబ్ల్యూ 50 సంవత్సరాల వార్షికోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను వారు సమన్వయ కమిటీ జి ఝాన్సీ , చెంద్ర అరుణ పిడబ్ల్యుఓ సంస్థల ప్రతినిధులు మహిళా మేధావులు విమలక్క, ఝాన్సీ, స్వరూప, పద్మాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సభకు ప్రముఖ రచయిత్రి భాషా సింగ్ అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని,ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సభ జరగనున్నట్టు తెలిపారు.



కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను, జూబ్లీహిల్స్ బీజేపీ నాయకులు వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీజూబ్లీ హిల్స్ అసెంబ్లీ సీనియర్ నాయకులు ఎస్ వి ఎస్ సుభాష్, బరి గల జ్ఞానేశ్వర్, పులి రామ్, బడుగు సతీష్, నగ్నూర్ సందీప్ తదితరులు కలిసి కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బండి సంజయ్ కుమార్ ను అభినందించారు. - జూబ్లీహిల్స్

రాహుల్ గాంధీ గొప్ప నాయకుడు

- ఎమ్మెల్సీ వెంకట్
- పలు ప్రాంతాల్లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

రాహుల్ గాంధీ గొప్ప నాయకుడు అని ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. ఓయూ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మేడ శ్రీను ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా నీట్ అభ్యర్థుల సమస్యలు పరిష్కారం కోసం సంతకాల సేకరణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాహుల్ గాంధీ ఆలోచన విధానాలు సమాజం మీద ఉన్న అవగాహన మరెవరికీ లేదని, సమాజంలో ఉన్న అసమానతలు పోవటానికి భారత్ జోడో యాత్ర, న్యాయ యాత్ర చేపట్టారని... ఈ సమాజంలో ఉన్న నిరుద్యోగ సమస్య పేదరికం పోగొట్టడానికి ఎంతో శ్రమించాడని తెలిపారు. భవిష్యత్తులో రాహుల్ గాంధీ నాయకత్వంలో ఈ సమాజం అభివద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూర చందనారెడ్డి, ఉపాధ్యక్షురాలు అభిజిత్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ శ్రీకర్, వికాస్, వర్కింగ్ ప్రెసిడెంట్, వంశీ, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ ముదిరాజ్, వైస్ ప్రెసిడెంట్ సాయి ఓంకార్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్, జనరల్ సెక్రెటరీ వినయ్, ఓయూ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తార్నాక డివిజన్ మానికేశ్వర్ నగర్‌లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో జీహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్



చేశారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ సారధ్యంలో రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశ ప్రగతి సాధిస్తుందని, వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, రాజా రాష్, లింగయ్య, వెంకటేష్, రవి, నర్సింహా, ముత్యాలు, బ్రహ్మాజీ పాల్గొన్నారు.



రాహుల్ గాంధీకి పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ అభ్యర్థి అదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం బౌద్ధ నగర్‌లోని ఎల్ నారాయన్ నగర్ ప్రభుత్వ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు పంపిణీ చేశారు. దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తూ అన్ని వర్గాలకు దగ్గర అయిన వ్యక్తి రాహుల్ అన్నారు .కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

బేగంపేట్ : నగర కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారుల మధ్య కేకను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెక్లోడ్లూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, హైదర్‌బస్తీ, మోండా మార్కెట్, పార్టేస్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కతారీ మహేష్, నాయకులు నాగరాజు, రహీం, సోహైల్, రఘు, ఎల్లేష్, సతీష్,



రాజు గౌడ్, నౌమాన్, శ్యామ్, వెంకటేష్‌లు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, స్టేషనరీ, స్పోర్ట్స్ కిట్లను అందించారు. భారతదేశానికి కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ అని వారు అన్నారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశానికి ఎంతో సేవలు చేశారని, దేశం కోసం ప్రాణాలు సైతం అర్పించారని కొనియాడారు.

ఔట్ పేషెంట్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ సర్వీసింగ్ ఆవిష్కరించిన 'అపోలో'



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

అపోలో క్యాన్సర్ సెంటర్స్ (ఏసీసీ) హైదరాబాద్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మొదటి అవుట్ పేషెంట్ బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్‌బీఎంటీ- ఎముక మజ్జ మార్పిడి) సర్వీసును ప్రారంభించినట్టు అపోలో హాస్పిటల్ ప్రకటించింది. ఈ సేవ రోగులకు బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ లైఫ్ సేవింగ్ ప్రయోజనాలను అందించటంతో పాటు, ఎక్కువకాలం ఆస్పత్రుల్లో ఉండవలసిన అవసరాన్ని గణనీయగా తగ్గించటం ద్వారా ఖర్చులను 50 శాతం వరకు తగ్గిస్తుంది. రోగి కుటుంబ సభ్యులకు ఆర్థిక భారం పడకుండా ఉపయోగపడుతుంది.

ఈ సందర్భంగా అపోలో హాస్పటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అపోలో క్యాన్సర్ సెంటర్స్ అంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ పద్మజాలోకి రెడ్డి మాట్లాడుతూ హైదరాబాదులోని ఏసీసీలో అవుట్ పేషెంట్ బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ సర్వీసును ప్రారంభించడం అనేది హెమటోలాజికల్ చికిత్సను మార్చే ఒక గొప్ప కార్యక్రమం అన్నారు. సుదీర్ఘకాలం ఆస్పత్రిలో ఉండవలసిన అవసరాన్ని గణనీయంగా తగ్గించటం, ఖర్చులను 50 శాతం తగ్గించడం ద్వారా ఈ సేవ రోగులకు సౌలభ్యం సౌకర్యం, జీవన నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ లైఫ్ సేవింగ్ ప్రయోజనాలను అందిస్తుందన్నారు. మిస్టర్ దినేష్ మాధవన్ ప్రెసిడెంట్ గ్రూప్ అంకాలజీ (ఇంటర్నేషనల్ అపోలో హాస్పిటల్ ఎంటర్ప్రైజెస్ లిమిటెడ్) మాట్లాడుతూ ఈ రకమైన వైద్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొన్ని ప్రముఖ ఆస్పత్రులలో మాత్రమే అందించడమవుతోందన్నారు. ఇప్పుడు భారతదేశంలోని అపోలో క్యాన్సర్ సెంటర్లు దీన్ని అందిస్తున్నందుకు తాము సంతోషిస్తున్నామన్నారు. అనంతరం అపోలో క్యాన్సర్ సెంటర్ హైదరాబాద్ సీఈవో తేజస్వి వీరేపల్లి మాట్లాడుతూ తమ అపోలో క్యాన్సర్ సెంటర్లలో రోగుల శ్రేయస్సును మునుగడ రేటును మెరుగుపరచడం, బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటును మరింత అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, రోగులు, వారి కుటుంబాలకు తక్కువ భారం కలిగించడం తమ లక్ష్యం అన్నారు. బోన్ మ్యారో బాధితురాలు నేహా కుమారి మాట్లాడుతూ అపోలో క్యాన్సర్ సెంటర్స్‌లోని అవుట్ పేషెంట్ బోన్ మారో ట్రాన్స్ ప్లాంట్ సర్వీస్ తన చికిత్స అనుభవాన్ని పూర్తిగా మార్చివేసిందన్నారు. దీర్ఘకాలం పాటు ఆస్పత్రిలో ఉండే అవసరం రాలేదన్నారు. అటువంటి క్లిష్టమైన చికిత్సను తీసుకోగలిగినందుకు అపోలో డాక్టర్స్‌కు కతజ్ఞత తెలుపుతున్నానని అన్నారు. చాలా సంతోషంగా ఉన్నానని తెలిపారు.

ఈ సందర్భంగా అపోలో యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం అపోలో క్యాన్సర్ కేంద్రాల నెట్వర్క్ భారతదేశమంతటా ఉంది. ప్రస్తుతం 147 దేశాల నుంచి అపోలో క్యాన్సర్ సెంటర్‌లో క్యాన్సర్ చికిత్స కోసం భారతదేశానికి వస్తున్నారు. దక్షిణాసియా, మిడిల్ ఈస్ట్ లోని మొట్టమొదటి, ఏకైక పెన్సిల్ బీమ్ ప్రోటాన్ థెరపీ సెంటర్ తో అపోలో క్యాన్సర్ సెంటర్లు, క్యాన్సర్ పై పోరాటాన్ని పటిష్టం చేయడానికి అవసరమైనవన్నీ కలిగి ఉన్నాయి.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
గురువారం | జూన్ 20, 2024 | www.navatelangana.com

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మల్కాజిగిరి

రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా మల్కాజిగిరి చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్, బీబ్లాక్ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, ఎస్ఆర్. ప్రసాద్, బికే. శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, సంతోష్ రాందాస్, నయీమ్ ఖాన్, సయ్యద్ మబ్బు, కొండ గౌడ్, నరేందర్ గౌడ్, మహేందర్ గౌడ్ సాయినాథ్ గౌడ్, సయ్యద్ మబ్బు, జీడి సంపత్ గౌడ్, ఉమేష్ సింగ్, వైనాల ప్రవీణ్, పంజా శ్రీనివాస్ యాదవ్, వినోద్ యాదవ్, ప్రభావతి, అర్వరాజు, సత్యమూర్తి బాబు, గడప దేవేందర్, సత్యనారాయణ, బ్రహ్మయ్య, చెన్నారెడ్డి, రోజా రమణి, బబితా, గాయత్రి రాణి, మైమూదా బేగం, గఫూర్, వెంకు, మెహన్ రెడ్డి, కన్నా, ఇస్తారి, తదితరులున్నారు.



కాప్రాలో..



రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కాప్రాలో మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు పత్తి కుమార్ కేకు కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం పేద ప్రజలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎస్సీ సలహాదారులు పీజీ. సుదర్శన్, మధు, మోహన్, తోటకూర శ్రీకాంత్, సింగం కిరణ్, సందీప్‌గౌడ్, ముఖేందర్, గండి సునీత, సాయి, భారతి, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగ శేషు, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు, తదితరులున్నారు.

ఘట్కేసర్‌లో..



హుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘట్కేసర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మామిండ్ల ముత్యాలు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం అంబేద్కర్ విగ్రహం దగ్గర మున్సిపల్ చైర్మెన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ కేక్ కట్ చేశారు. అనంతరం గవర్నమెంట్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లేష్, కూతాడి రవీందర్, మాజీ సర్పంచ్ మేడ బోయిన వెంకటేష్ ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ బాల్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు బర్ల దేవేందర్ ముదిరాజ్, మీసాల సుధాకర్ రావు, వైస్ ప్రెసిడెంట్, నాగరాజు ముదిరాజ్, రాష్ట్ర కాంగ్రెస్ మహిళా కార్యదర్శి సగ్గ అనిత, డీసీసీ కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు, యూత్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు వీరేందర్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నర్సింగ్ రావు, సగ్గ శ్రీనివాస్, రాజ రత్నం, సీరాజ్, బొక్క సత్తి రెడ్డి, మేకల సునీల్ కుమార్, నాయకులు మెరుగు నరేష్ గౌడ్, కడపోల్ల సుధాకర్, బాబురావు, జగదీష్, ఫయ్యాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

జవహర్ నగర్‌లో..



అఖిల భారత కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జవహర్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. బుధవారం బాలాజీ నగర్ అంబేద్కర్ చౌరస్తాలో మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గొడుగు వేణు, పల్లపు రవి, కుతాడి సాయి, జమాల్పూర్ నవీన్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, పానుగంటి బాబు, గుండ్రాతి కృష్ణ, బింగి లావణ్య సతీష్ గౌడ్, మారగోని నాగరాణి వెంకటేష్, మెట్టు ఆశా కుమారి, కో ఆప్షన్ సభ్యులు గండి నరసయ్య, కుతాడి శ్వేత ముఖేష్, సీనియర్ నాయకులు కల్లేపల్లి సదానంద్, కాయిత రాజు యాదవ్, మంద ఆనంద్, అనంతలక్ష్మి, మాట్ల శ్రీను, వినయ్, గడిపే సునీల్, శ్రీనాథ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

అల్వాల్‌లో..



రాహుల్‌గాంధీ 54వ జన్మదిన వేడుకలను మైనంపల్లి హనుమంతరావు సూచన మేరకు టెంపుల్ అల్వాల్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర ఏబ్లాక్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాల వేశారు. అనంతరం అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రములో టి.లక్ష్మీకాంత్‌రెడ్డి, యాదగిరి, కృష్ణాగౌడ్, చిట్టిబాబు, సురేందర్‌రెడ్డి, శివశంకర్, నాగేశ్వర్ రావు, శ్రీశైలం, నరేష్, శకుంతల నాయుడు, విష్ణురావు, వెంకట్, సి.వినయ్, రాజు, సుదర్శన్‌రెడ్డి, మంగలి విష్ణు, మధు ఉన్నారు.

'స్టార్ ట్రామా అండ్ యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్'ను ప్రారంభించిన స్టార్ హాస్పిటల్స్



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్టార్ హాస్పిటల్స్ హైదరాబాద్‌లో అత్యవసర సంరక్షణను మెరుగుపరిచే లక్ష్యంతో "స్టార్ ట్రామా అండ్ యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్'ను ప్రారంభించింది. నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్స్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అధికారికంగా అల్లు అరవింద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ గోపీచంద్ మన్నం (మేనేజింగ్ డైరెక్టర్), డాక్టర్ రమేష్ గూడపాటి (జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్), డాక్టర్ రాహుల్ కట్టా (గ్రూప్ లీడ్, ఎమర్జెన్సీ మెడిసిన్) హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ప్రతినిధులు సహ స్టార్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. తక్షణమే అప్పటికప్పుడు సమర్థవంతమైన వైద్య సహాయం అందించే ఉద్దేశ్యంతో, స్టార్ హాస్పిటల్స్ హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల సహకారంతో నగరం అంతటా 10 అధునాతన కార్డియాక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లను ప్రవేశపెట్టింది. అత్యవసర కాల్ వచ్చిన 15 నిమిషాల్లోపు అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూడటం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఈ సందర్భంగా స్టార్ హాస్పిటల్స్ ఎమర్జెన్సీ మెడిసిన్ గ్రూప్ లీడ్ డాక్టర్ రాహుల్ కట్టా మాట్లాడుతూ, "స్టార్ హాస్పిటల్స్ ప్రతి ప్రాణాన్ని కాపాడేందుకు కట్టుబడి ఉంది. ఈ చొరవతో హైదరాబాద్‌లో భద్రత స్థాయిలను గణనీయంగా పెంచాం. 15 నిమిషాల్లోపు బాధితుల పరిస్థితిని అంచనాతో వారి పరిస్థితిని మెరుగుపరచడానికి వారిని సమీప వైద్య సదుపాయానికి తరలించడం కోసం బాధితులను చేరుకోవడమే మా బృందం లక్ష్యం' అని అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ " స్టార్ ట్రామా అండ్ యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్ ప్రోగ్రాం ప్రారంభించిన వాహనాలను చూసిన తర్వాత, ట్రామా కేర్ టీమ్‌తో ఇంటరాక్ట్ అయ్యాను. హైదరాబాద్‌లో అత్యవసర పరిస్థితులను నిర్వహించే విధానంలో ఇది గణనీయమైన మార్పును తీసుకువస్తుందని విశ్వసిస్తున్నాను. ఇంత విలువైన కార్యక్రమాన్ని రూపొందించినందుకు స్టార్ హాస్పిటల్స్ మేనేజ్‌మెంట్‌ను నేను అభినందిస్తున్నాను" అని అన్నారు. స్టార్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ మన్నం మాట్లాడుతూ " 15 ఏండ్లుగా స్టార్ హాస్పిటల్స్‌లోని బృందం నైపుణ్యం, శ్రేష్ఠత, సానుభూతిని అందించడానికి అంకితభావంతో ఉంది. అసాధారణమైన వైద్య సంరక్షణ సహాయం కోసం మా నిరంతర నిబద్ధతకు ఈ నూతన చొరవ నిదర్శనం" అన్నారు.

73 ఏండ్ల వృద్ధుడికి మెదడులో నీరు

- మతిమరుపు, వేగంగా నడవడం, మూత్రంపై కొరవడిన నియంత్రణ
- శస్త్రచికిత్సతో నయం చేసిన 'కామినేని' వైద్యులు

నవతెలంగాణ-సిటీబ్యూరో


డాక్టర్ రమేష్

కాస్త పెద్ద వయసు వచ్చిన తర్వాత డిమెన్షియా (మతిమరుపు) అనేది సర్వసాధారణంగా కనిపిస్తుంది. సరిగ్గా ఇలాంటి సమస్యే ఉన్న 73 ఏండ్ల వృద్ధుడికి ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రి వైద్యులు చిన్నపాటి చికిత్స చేసి మొత్తం నయం చేశారు. వివరాలను ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ రమేష్ వివరించారు. "విశాఖపట్నానికి చెందిన 73 ఏండ్ల శంకర్‌రావు ఆరేడు నెలలుగా ఇబ్బంది పడుతున్నారు. ఆయనకు మూత్రవిసర్జనపై నియంత్రణ లేదు. మామూలుగా నడిచేదాని కంటే చాలా నెమ్మదిగా నడుస్తున్నారు. దాంతోపాటు, మధ్యాహ్నం ఏం తిన్నారో సాయంత్రానికి గుర్తు ఉండేది కాదు. ఇలా పలు రకాల సమస్యలు ఉండేవి. కుటుంబ సభ్యులు మొదట్లో కాస్త ఇబ్బంది పడేవారు. పిల్లలకు ఫోన్ చేసినా, చేయలేదనుకుని మళ్లీ మళ్లీ చేసేవారు. దీంతో పిల్లలకు కూడా బాగా ఇబ్బందిగా ఉండేది. దీంతో వేర్వేరు ఆస్పత్రుల్లో చూపించి, చివరకు ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రికి వచ్చారు. ఇక్కడ ఆయనను పరీక్షిస్తే మెదడులో నీరు చేరినట్టు తెలిసింది. సాధారణంగా చిన్నవయసులో వారికి ఇలా నీరు చేరితే ఆ భారాన్ని మోయలేక కోమాలోకి వెళ్లిపోతారు. కానీ పెద్ద వయసు వచ్చే కొద్దీ మెదడు క్రమంగా కుచించుకుపోతుంది. దానివల్ల అక్కడ కొంత స్థలం ఏర్పడి, అందులోకి ఈ నీరు చేరుతుంది. ఇలా నీరు చేరడం వల్ల అది మెదడుపై ఒత్తిడి కలిగించి, అందువల్ల డిమెన్షియా వస్తుంది. ఈ తరహా డిమెన్షియాను మాత్రం చిన్నపాటి శస్త్రచికిత్స పద్ధతులతో నయం చేయవచ్చు. ఈ కేసులో శంకర్‌రావుకు వరుసగా మూడు రోజుల పాటు వెన్నెముక నుంచి నీరు తొలగించాం. దానివల్ల మెదడులో ఉన్న నీరు క్రమంగా తగ్గింది. ఆ తర్వాత మెదడులో ఒక స్టెంట్ వేశాం. దాన్నుంచి మెదడులో ఉండే నీరు క్రమంగా పొట్టలోకి వచ్చి, విసర్జన మార్గాల ద్వారా బయటకు వెళ్లిపోతుంది. ఇలా నీరు తీసిన మరు నిమిషం నుంచే శంకర్‌రావు పరిస్థితి పూర్తిగా మారింది. అందరినీ గుర్తుపడుతున్నారు. నడక కూడా సాధారణ స్థితికి చేరుకుంది. రాబోయే ఐదేండ్ల వరకు ఆయనకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఎప్పటికప్పుడు వైద్యులకు చూపించుకుంటూ, అవసరమైన మందులు వాడితే సరిపోతుంది" అని డాక్టర్ రమేష్ వివరించారు. అయితే, అన్ని రకాల డిమెన్షియాలకూ ఈ చికిత్స పనికిరాదని, కేవలం మెదడులో నీరు చేరడం వల్ల కలిగే డిమెన్షియాను మాత్రమే ఇలా తగ్గించగలమని ఆయన తెలిపారు.

బీసీలు రాజ్యాధికారం సాధించే దిశగా కృషి చేస్తాం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వేద్ ప్రకాష్ యాదవ్



నవతెలంగాణ-ముషీరాబాద్

బీసీలు రాజ్యాధికారం సాధించే దిశగా కృషి చేస్తానని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వేద్ కుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గా ఆందోల్ బొమ్మన బోయిన వేద్ ప్రకాష్ యాదవ్‌ను ఎంపీ ఆర్.కృష్ణయ్య నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీలకు రాజ్యాధి కారం సాధించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కులగన చేసిన తర్వాతనే పంచాయతీ రాజ్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది బత్తుల కృష్ణ , తదితర నాయకులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- బీసీ సంఘాల నేతల డిమాండ్



నవతెలంగాణ-అంబర్‌పేట

నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జా కృష్ణ, బీసీ సంఘాల నేతలు కె.శ్రీనివాస్, సుధాకర్ ముదిరాజ్ జ్యోష్ రాఘవలు డిమాండ్ చేశారు. బుధవారం బర్కత్‌పుర నుంచి ర్యాలీ నిర్వహించడానికి ప్రయత్నించగా గుజ్జ కృష్ణతోపాటు పలువురి బీసీ సంఘాల నేతలను కాచిగూడ పోలీసులు ముందస్తు గా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే నీట్ పరీక్షా పేపర్ లీక్ అయిందని దీనికి ప్రధాని మోడీ నైతిక బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. నీట్‌ను రద్దు చేసేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు.

లైఫ్ ట్యాక్స్ కట్టండి

- వాహనదారులకు రవాణాశాఖ హెచ్చరిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలోని ద్విచక్ర వాహనాలు సహా ఇతర భారీ వాహనాలు తప్పనిసరిగా లైఫ్‌ట్యాక్స్‌ను చెల్లించాలని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) సి.రమేష్ తెలిపారు. తెలంగాణలోకి ప్రవేశించే ఇతర రాష్ట్రాల వాహనాలూ లైఫ్ ట్యాక్స్‌ను చెల్లించాల్సిందేననీ, తనిఖీల్లో పట్టుబడితే, ట్యాక్స్ కట్టాకే వాహనాలను రిలీజ్ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఏదైనా వాహనం తెలంగాణలో 30 రోజులకు మించి ఉన్నట్టయితే, ఆయా వాహనాల వయసును పరిగణనలోకి తీసుకొని టాక్స్ వసూలు చేస్తామని జేటీసీ రమేష్ తెలిపారు.

నీ సెల్‌నెంబర్‌తో డ్రగ్స్ సరఫరా చేస్తున్నావ్..

- 200 బ్యాగ్‌లలో ఎండీఎంఏ డ్రగ్స్ ట్రాన్స్‌పోర్ట్
- నీపై కేసునమోదైంది, కొద్ది సేపట్లో నీ ఫోన్ ఆపేస్తాం
- అరెస్టుచేస్తామంటూ ఓ 78 ఏండ్ల వృద్ధిన్ని బెదిరించిన సైబర్ నేరస్తులు
- భయాందోళనకు గురై రూ.10లక్షలు ట్రాన్స్‌ఫార్ చేసిన బాధితుడు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌కు చెందిన 78ఏండ్ల వృద్ధిన్ని టార్గెట్ చేసిన సైబర్ నేరస్తులు తాము ట్రై నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. నీ సెల్‌ఫోన్‌తో డ్రగ్స్ సరఫరా చేస్తున్నావని దాంతో కొద్ది సేపట్లోనే నీ సెల్ నెంబర్ బ్లాక్ అవుతుందని చెప్పారు. దాదాపు 200 బ్యాగుల్లో ఏండీఏంఏ డ్రగ్స్‌ను సరఫరా చేశావని బెదిరించారు. ఆ తర్వాత మరో వ్యక్తి వాట్సాప్‌లో వీడియో కాల్ చేశాడు. తాను ముంబాయ్ సైబర్ క్రైమ్ నుంచి మాట్లాడుతున్నానని, నీపై ముంబాయ్‌లో డ్రగ్స్ సరఫరా చేశావంటూ కేసునమోదైందని, త్వరలో నిన్ను అరెస్టుచేస్తారని బెదిరించాడు. దాంతో భయాందోళనకు గురైన బాధితుడు తనను ఎలాగైనా రక్షించాలని కోరాడు. అందుకు రూ.10లక్షలు ఇస్తేనే సహాయం చేస్తామని చెప్పారు. గత సోమవారం బక్రీద్ కావడంతో బ్యాంక్‌కు సెలవు ఉందని చెప్పడంతో, విషయం ఎవరితో చెప్పొద్దని తాను చెప్పినట్లు చేయాలంటూ బ్యాంక్‌తో పాటు అన్ని వివరాలను సైబర్ నేరస్తులు సేకరించారు. వెంటనే డబ్బులు చెల్లించకుంటే నేను చేసేదీ ఏం లేదు, నిన్ను అరెస్టుచేస్తారని చెప్పడంతో భయాందోళనకు గురైన వృద్ధుడు తన స్నేహితులు, తెలిసిన వారి వద్ద అర్జెంట్‌గా డబ్బులు కావాలని రూ.10లక్షలను తీసుకుని సైబర్ నేరస్తులకు (ఆర్‌టీజీఎస్) ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చిన బాధితుడు కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసునమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. ఆన్‌లైన్‌లో ఎవరితోను బ్యాంక్ వివరాలు షేర్ చేయవద్దని పోలీసులు తెలిపారు. వాట్సాప్ కాల్స్, వీడియోకాల్స్‌కు స్పందించొద్దన్నారు. సైబర్ నేరస్తుల చేతిలో మోసాలకు గురైతే వెంటే 1930 ఆన్‌లైన్‌కు ఫోన్‌చేయాలని, సీసీఎస్‌లో, లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

మీ ఫిర్యాదు కన్ఫర్మేషన్‌కు రూ.5 పంపించండి

ఆన్‌లైన్‌లో కస్టమర్ కేర్ నెంబర్ సెర్చ్ - రూ.2.11లక్షలు గుల్ల

సీసీఎస్‌లో ఫిర్యాదు చేసిన వృద్ధుడు

హైదరాబాద్‌కు చెందిన 62ఏండ్ల ఓ వృదుడు తన ఇంట్లో శామ్సంగ్ కంపెనీకి చెందిన 'ఏసీ' ఏయిర్ కండీషనర్ రిపేర్‌కు రావడంతో గూగుల్‌లో శామ్సంగ్ కస్టమర్ కేయిర్ నెంబర్‌ను సెర్చ్ చేశాడు. గూగుల్‌లో శామ్సంగ్ కస్టమర్ కేయిర్ (నకిలీ) ఫోన్‌నెంబర్ కనిపించడంతో దానికి ఫోన్ చేసి మాట్లాడాడు. ఫోన్‌లో స్పం దించిన వ్యక్తి మీరు డెస్కటాప్‌లోని ప్లేస్టోర్‌లో 'అవయాల్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరస్తులు చెప్పిన విధంగా వృద్ధుడు చేశాడు. ఆ తర్వాత ఫిర్యాదు ధృవీకరణ (కన్ఫార్మేషన్) కోసం రూ.5 పంపిచాలని సైబర్ నేరస్తులు చెప్పారు. వృద్ధురాలు డబ్బులు పంపించగానే బాధితురాలి కి తెలియకుండానే యూపీఐ యాప్‌ద్వారా సైబర్ నేరస్తులు బాధితురాలి బ్యాంక్ ఖాతా నుంచి రూ.2,11,664 ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. తీరా మోసపోయిన తర్వాత గుర్తించిన బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసునమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు.

'నీట్ పేపర్ లీకేజ్‌పై బండి సంజయ్, కిషన్ రెడ్డి గొంతులు మూగబోయాయా?'

- ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆప్ యువజన, విద్యార్థి సంఘాల నిరసన ప్రదర్శన



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నీట్ పేపర్ లీకేజ్‌పై కేంద్ర మంత్రులైన బండి సంజయ్, జి.కిషన్ రెడ్డిల గొంతులు మూగబోయయాని ఆప్ యువజన, విద్యార్థి సంఘాలు ప్రశ్నించాయి. నీట్ పేపర్ లీకేజీ పై ఆమ్ ఆద్మీ పార్టీ యువజన, విద్యార్థి సంఘాల జాతీయ కమిటీ పిలుపు మేరకు బుధవారం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ స్కాంపై ఆమ్ ఆద్మీ పార్టీ యువజన, విద్యార్థి విభాగాలు ఏవైడబ్ల్యూ, సీవైఎస్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవైడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లంగి విజయ్, మాలోతు సురేష్ బాబులు మాట్లాడుతూ గత 3 ఏండ్లుగా వెలువడిన నీట్ పరీక్ష ఫలితాల్లో ఏ ఒక్కసారి ముగ్గురికి మించి మొదటి ర్యాంకు రాలేదని, అలాంటిది ఈసారి ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకు రావడం అనేక అనుమానాలకు తావిచ్చిందన్నారు. సుమారు 23 లక్షల మంది యువత భవిష్యత్తును నిర్ణయించే ఈ నీట్ పరీక్షలో ఇంత పెద్ద ఎతున అవకతవకలు జరగడం బీజేపీ ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు. ఇది కేవలం ఒక పరీక్ష పేపర్ లీక్ మాత్రమే కాదని, మన దేశ ఆరోగ్య రంగాన్ని అతలాకుతలం చేసే ఒక పెద్ద కుంభకోణమన్నారు. కేంద్ర కేబినెట్ లో కొంత మంది పెద్దలు ఒక్కొక్క విద్యార్థి దగ్గర రూ.30 లక్షలు వసూలు చేసి పేపర్లను అమ్ముకున్నారని మండిపడ్డారు. దీనిపై ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోడీ వెంటనే స్పందించి నీట్ పరీక్షను రద్దు చేసి దేశ ప్రజలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలను తిరిగి నిర్వహించాలని అలాగే దీనికి బాధ్యులైన వారందరి పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి వెంటనే శిక్షించాలని, ఎన్టీఏని రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వాలకు బాధ్యత ఇచ్చి నీట్ పరీక్షలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు దర్శనం రమేశ్, కొడంగల్ శ్రీనివాస్, విశాల్, మౌనిక, కంచర్ల అక్షయ్, మహమ్మద్ సోహల్, అహసాన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ లక్ష్యాన్ని చేరుకోవాలి..!



నవతెలంగాణ-సిటీబ్యూరో

రెవెన్యూపై నిర్దేశించిన లక్ష్యాల్ని ఈ నెలాఖరులోపు చేరుకోవాలని ఎండీ సుదర్శన్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం రెవెన్యూపై ఎండీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎండీ సుదర్శన్ రెడ్డి జలమండలి పరిధిలోని డివిజన్ల పరంగా రెవెన్యూ కలెక్షన్‌పై వివరాలు తెలుసుకున్నారు. నిర్దేశిత లక్ష్యాల్ని ఈ నెలాఖరులోపు చేరుకోవాలని సూచించారు. ముఖ్యంగా మొండి బకాయిలు, కమర్షియల్ వినియోగదా రుల బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటి దాకా ఉన్న పెండింగ్ బిల్స్‌పై ఆరా తీశారు. బిల్లులు చెల్లిం చని వారికి బిల్లు చెల్లించేలా మెసేజ్ పంపించాలన్నారు. అందులో వారు కట్టాల్సిన మొత్తం వివరాలు ఉండాలని చెప్పారు. వారు స్పందించని పక్షంలో మరోసారి హెచ్చిరిక సందేశం పంపాలన్నారు. అయినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వినియోగదారుల నల్లా కనెక్షన్లు తొలగించాలని ఆదేశించారు. బిల్లులు కలెక్షన్ చేసేలా మీటర్ రీడర్లను ప్రోత్సహించాలని సూచించారు. వచ్చే 10 రోజుల్లో టార్గెట్ చేరుకునేలా పనిచేయాలన్నారు. ఆ విధంగా జనరల్ మేనేజ ర్, డీజీఎం, మేనేజర్లు పని చేయాలని సూచించారు. ఈ సమీక్షలో రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్ - 1 అజ్మీరా కష్ణ, ఆపరేషన్ డైరెక్టర్ - 2 స్వామి, అన్ని సర్కిళ్ల సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు పాల్గొన్నారు.



అబిడ్స్ మహబూబియా జూనియర్ కాలేజ్ ముందు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు రావడంతో అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారు. స్థానికులు, బాటసారులు ఊపిరి పీల్చుకున్నారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

విద్యా, వైద్య అభివృద్ధికి బడ్జెట్‌లో తగిన నిధులు విడుదల చేయాలి



- బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాష్

నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రభుత్వ రంగంలోని విద్య, వైద్యం అభివృద్ధి కోసం తగిన నిధులు విడుదల చేసి ప్రభుత్వ ఆస్పత్రులు, స్కూల్స్ లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నల్ల సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. నల్లకుంటలో బహుజన లెఫ్ట్‌పార్టీ- బీఎల్పీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బీఎల్ఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు, కార్పొరేట్ వైద్యసంస్థల అధిక ఫీజుల దోపిడిని నియంత్రించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఎల్ఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది పేదలు నివాసం ఉంటున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. జూన్ 30 వరకు స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ రిజర్వేషన్ అనే అంశం మీద జిల్లాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు ఇంకా కొనసాగించాలని, అలాగే జూలై 4న దొడ్డి కొమరయ్య వర్ధంతి భూ సమస్యపై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించాలని సమావేశం నిర్ణయించినట్లు తెలియజేశారు. ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి బహుజన లెఫ్ట్ పార్టీ- బీఎల్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఐదు గ్యారెంటీల అమలుపై దృష్టి కేంద్రీకరించాలని రాష్ట్రంలో బీజేపీ విస్తరణను అడ్డుకోవడానికి కుల జనగణన జరపడం ద్వారా సామాజిక న్యాయాన్ని అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో బహుజన కమ్యూనిస్టు పార్టీ- బీసీపీ రాష్ట్ర కార్యదర్శి కె. పర్వతాలు, ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నూనె వెంకట స్వామి, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అద్యక్షులు పాండురంగ చారి బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్ , రాష్ట్ర నాయకులు ఎస్. సిద్దిరాములు, మాస్ సావిత్రి ,మారోజు సునీల్ కుమార్ ఎం, జంగయ్యులు పాల్గొన్నారు.

నీట్‌పై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

నీట్ పై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని నీట్ పరీక్ష నిర్వహణను ఏ రాష్టానికి ఆ రాష్టానికి అప్పగించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నీట్ పరీక్ష అవకతవకలపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ హాజరై మాట్లాడుతూ మెడికల్ వృత్తిలోకి ప్రవేశించాలని విద్యార్థులు ఎంట్రన్స్ డోర్ అయినటువంటి నీట్ పరీక్షలో భారత దేశంలోని అతిపెద్ద స్కాం జరిగిందన్నారు. నీట్ పరీక్ష అవకతవకలతో 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు తో చెలగాటమాడుతున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పై చర్యలు చేపట్టి నీట్ పరీక్ష నిర్వాహనను ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రానికి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. భారతదేశమంత ఎలక్షన్ ఫలితాల మీద దృష్టి సాధించిన టైంలో నీట్ రిజల్ట్ బయటకు వచ్చాయని 14న విడుదల కావలసిన రిజల్ట్ హడావిడిగా ఎలక్షన్ రిజల్ట్ రోజున విడుదల చేశారని తెలిపారు. నీట్ అనేది అతి కష్టమైన పరీక్ష ప్రతి సంవత్సరం కేవలం ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధిస్తారు కానీ ఈసారి మాత్రం ఏకంగా 67 మంది ఆల్ ఇండియా లెవెల్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించారని ఇది ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. 8 మంది విద్యార్థులకు ఒకే ఎక్సామ్ సెంటర్ నుండి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ రావటం చూస్తే తెలుస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దీనిపై మౌనం వీడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్, అనంతయ్య, నందగోపాల్, చెరుకు రాజేందర్, రాందేవ్ మోడీ, శ్రీనివాస్, పవన్, బలరాం, తదితర నాయకులు పాల్గొన్నారు.

'మహిళ అదృశ్యం'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఇప్పుడే బాత్ రూమ్ కి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన ఒక మహిళ అదృశ్యమైన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఈ మేరకు బుధవారం నారాయణ గూడ ఎస్ఐ షేక్ షఫీ తెలిపిన వివరాల ప్రకారం ఉప్పుగూడ, సాయిబాబా కాలనీ ప్రాంతానికి చెందిన నాగడి కాశయ్య అతడి భార్య నాగడి రేవతమ్మ (34), వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.వృత్తి రీత్యా మేస్త్రి, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత నెల రోజులుగా నారాయణగూడలోని వెంకటేశ్వర కాలనీలో భార్య, భర్తలు ఇద్దరూ మేస్త్రి పనులు చేసుకుంటున్నారు.ఈ పనుల్లో భాగంగా మంగళవారం సుమా రు మధ్యాహ్నం 12 గంటల సమయంలో నాగడి రేవతమ్మ ఇప్పుడే బాత్ రూమ్ కి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన ఆమె ఎంతకు రాకపోవడంతో ఆమె భర్త నాగడి కాశయ్య కంగారు పడుతూ ఆ ప్రాంతా చుట్టు పక్కల మొత్తం వెతికిన ఆచూకీ తెలియలేదు. సమీప బంధువులను అడిగి తెలుసుకున్న ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో నారాయణగూడ పీఎస్ లో ఫిర్యాదు చేశారు.ఆమె భర్త నాగడి కాశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ షేక్ షఫీ తెలిపారు. ఎవరైనా ఈ మహిళ ఆచూకీ తెలిసినట్లయితే నారాయణ గూడ పీఎస్ కు సమాచారం అందించగలరని ఆయన కోరారు.

కలుషిత మంచినీటి సమస్యను త్వరగా పరిష్కరించాలి

- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

కలుషిత మంచినీటి సరఫరా సమస్యను త్వరగా పరిష్కరించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అధికారుల ఆదేశించారు. డివిజన్‌లోని చిక్కడపల్లి బాపు నగర్‌లో మూడు నెలలుగా మంచినీటి లో కలుషిత నీరు సరఫరా అవుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ బుధవారం జల మండలి అధికారులతో కలిసి సమస్యత్మక ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలుషిత మంచినీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను ఆదేశించిన సమస్య పరిష్కారంలో విఫలమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని త్వరగా సమస్య పరిష్కరించాలని లేనిపక్షంలో డివిజన్ ప్రజలతో కలిసి జలమండలి కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, ,సాయి కుమార్,ఆనంద్ రావు,ముక్కపల్లి సాయి , బాపు నగర్ స్థానికులు ఎస్.అశోక్, సతీష్, ఈశ్వర్, అనురాధ, కళావతి పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట

ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు హాజరై బాగ్ అంబర్‌పేట డివిజన్ పోచమ్మ బస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో కేక్‌కట్ చేసి పుస్తకాలు, స్టేషనరీ ఐటమ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ కోమల్ బాయ్, బ్లాక్ ప్రెసిడెంట్ ప్రసన్న, డివిజన్ ప్రెసిడెంట్ శాంతా మణి, హర్షియా బేగం, డివిజన్ వైస్ ప్రెసిడెంట్లు కవిత, డివిజన్ జనరల్ సెక్రెటరీ ఫాతిమా బేగం, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతం.. రివార్డ్స్ అందజేసిన సీపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగర కమిషనరేట్ పరిధిలో జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తికావడంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లోని సీసీసీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎన్నికల విధులు నిర్వహించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో పూర్తి కావడంలో పోలీసుల పాత్ర, కృషి ఎంతో ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కమిషనరేట్‌లో ఎలక్షన్ సెల్, పోస్టల్ బ్యాలెట్, నిఘా, పెట్రోల్ విభాగం, సీఏఆర్, ఐటీ, సీటీ ఆర్మ్‌డ్ రిజర్వ్, కంట్రోల్ రూం, సివిల్, ట్రాఫిక్, కమ్యూనికేషన్‌తోపాటు వివిధ అన్ని విభాగాలల్లో పనిచేసిన పోలీసులకు రివార్డ్స్‌ను అందజేశారు. ప్రతి ఒక్కరిని వ్యక్తిగతంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంగా పనిచేయాలని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొని విధుల్లో ప్రతిభ కనబర్చాలని సీపీ కోరారు. నిబద్ధత, అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు సీపీలు, జాయింట్ సీపీలు, డీసీపీలతోపాటు అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర గన్ని మార్చంట్స్ అసోసియేషన్ కృషి అభినందనీయం..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు వ్యాపారుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర గన్నీ మర్చంట్స్ అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు బుధవారు ఆయన డిష్నగంజ్ లోని సంఘం కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర గన్నీ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన పి.జగదీషన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బోనాల శ్రీనివాస్ మాట్లాడుతూ తనకంతో ఆత్మీయుడైన పి. జగదీష్ తెలంగాణ రాష్ట్ర గన్నీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాలు గన్నీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి జగదీష్ నేతృత్వంలో సామాజిక సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గన్నీ మర్చంట్స్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పోడల కైలాసం, పి శేఖర్లతో పాటు దుబ్బాక నియోజకవర్గం ప్రజా ఏక్తా పార్టీ ఇన్‌చార్జి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వివేక్ వర్ధిని 116 ఏండ్ల నాటి ఎడ్యుకేషన్ సొసైటీ



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

1916 సంవత్సరంలో స్థాపించబడిన వివేక్ వర్ధిని కన్యాశాల గొప్ప వారసత్వాన్ని పూర్తి చేసుకుంది. స్వాతంత్ర్యానికి ముందు కాలంలో కూడా బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలను స్థాపించాలనే దృక్పథాన్ని వ్యవస్థాపకులు కలిగి ముందడుగు వేయడంలో సఫలీకృతమయ్యారు. హైదరాబాద్ గౌలిగూడలోని వివేక్ వర్ధిని కన్య శాల ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థుల కోసం నూతనంగా నిర్మించిన తరగతి గదులను బుధవారం అడిషనల్ డైరెక్టర్ జి.రమేష్ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వివేక్ వర్ధిని కన్య శాల ప్రైమరీ స్కూల్‌కు గొప్ప పేరు ఉందని, ఇక్కడ చదువుకున్న వాళ్ళు ఎంతో మంది గొప్ప గొప్ప స్థానాల్లో ఉన్నారన్నారు. టెక్నిప్ ఎఫ్ఎంసి సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలో తరగతి గదులు నిర్మించడం గొప్ప విషయమని, విద్యాశాఖ పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. టెక్నిప్ ఎఫ్ ఎంసీ సంస్థ ఎండి అర్జున్ రుమాల మాట్లాడుతూ.. వందే ళ్లు పూర్తి చేసుకున్న పాఠశాలలో విద్యార్థుల విద్యాభ్యాసం కోసం తరగతి గదులను నిర్మించి ఇచ్చే అవకాశం వచ్చినం దుకు సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో కూడా తమ సంస్థ తరఫున సహాయ సహకారాలు అందజేస్తామ న్నారు. ఈ సందర్భంగా 200 మంది విద్యార్థులకు ఆయన స్కూల్ బ్యాగ్స్ అందజేశారు. టెక్నిప్ ఎఫ్ఎంసీ సంస్థ, హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో పాఠ శాల తరగతి గదులను నిర్మించారు. ఈ కార్యక్రమంలో వివేక్ వర్ధిని ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు సదాశివ్, జాయింట్ సెక్రెటరీ అనిల్ రాజేశ్వర్, వివేక్ వర్ధిని కన్య శాల ప్రైమరీ స్కూల్ చైర్మన్ కాంచన్ జట్కార్, హెడ్మాస్టర్ అశోక్ కరాట్, ప్రిన్సిపాల్ వైశాలి, టెక్నిప్ ఎఫ్ఎంసీ సంస్థ సీఎస్ ఆర్‌హెడ్ నిరంజన్ దేశాయ్, ఫైనాన్స్ హెడ్ నరేందర్ కుమార్, హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో సృజనాత్మక కల దాగి ఉంటుంది

- పద్మశ్రీ నేరెళ్ల వేణు మాధవ్, ఆరో వర్ధంతి సభలో వక్తలు



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రతి ఒక్కరిలో సృజనాత్మక కల దాగి ఉంటుందని దానిని వెలికి తీయాలని పద్మశ్రీ నేరెళ్ల వేణు మాధవ్, ఆరవ వర్ధంతి సభలో వక్తలు తెలిపారు. మిమిక్రీ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి నుండి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్ ఆరవ వర్ధంతి సందర్భంగా స్వరార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ మాజీ చైర్మెన్ ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా, ప్రఖ్యాత మిమిక్రీ కళాకారులు శివారెడ్డి, సంఖ్యా శాస నిపుణులు దైవాజ్ఞ శర్మ, జీవన నైపుణ్య శిక్షణ మిమిక్రీ కళాకారులు జీవీఎస్ రాజు, తదితరులు హాజరై నేరెళ్ల వేణుమాధవ్ కు ఘన నివాళులర్పించారు. మిమిక్రీ రంగంలోకి నూతనంగా అభ్యసిస్తున్న కళాకారులను ఆశీర్వదించారు.



భలే రుచిలే...

ఆకుకూరలు ఆరోగ్యానికి చాలా మంచిది. అందులో పుంటికూర పేరు చెబితే.. నోరూరని వారుండరు. ఈ కూరతో చేసే వంటకాలు మంచి రుచితోపాటు ఆరోగ్యానికీ మేలు చేస్తాయి. ఇందులో విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బి 1, విటమిన్ బి2 , విటమిన్ బి 9, మెగ్నీషియం, కాల్షియం, ఫాస్పరస్, పొటాషియం, ఐరన్, రైబోఫ్లేవిన్, కెరోటిన్ ఉన్నాయి. వారంలో రెండు సార్లయినా పుంటికూర తినాలి. ఇందులోని క్లోరోఫిల్స్ క్యాన్సర్ కణాల పెరుగుదలనూ కంట్రోల్ చేస్తాయి. ఈ కూరలో మెగ్నీషియం, ఫాస్పరస్, కాల్షియం పుష్కలంగా ఉంటుంది. అలాగే దీనిని రెగ్యులర్‌గా తీసుకోవటంవల్ల ఐరన్ లోపం తగ్గుతుంది. కాబట్టి, రక్తహీనతతో బాధపడేవారు దీనిని హ్యాపీగా తినొచ్చు. పుంటికూరను క్రమం తప్పకుండా తింటే ఎముకలు బలంగా మారతాయి. అంతేకాదు, దీని వల్ల జుట్టు ఆరోగ్యంగా మారుతుంది. దీనితో పచ్చడి చేసినా... పప్పులో వేసినా.. నాన్‌వెజ్‌లో మిక్స్ చేసి వండినా దాని రుచే వేరు. ఆరోగ్య ప్రదాయినిగా చెప్పకునే ఈ ఆకుకూరతో వెరైటీ వంటలను ఇప్పుడు చూద్దాం.

పుంటికూర.. చికెన్ పలావ్

కావలసిన పదార్థాలు : బాస్మతి బియ్యం - రెండు కప్పులు, చికెన్ ముక్కలు - ఒక కప్పు, పుంటికూర తురుము - ఒక కప్పు, ఉల్లిపాయలు - రెండు, అల్లం వెల్లుల్లి పేస్ట్ -



ఒక స్పూను, లవంగాలు - మూడు, దాల్చిన చెక్క - చిన్న ముక్క, అనాస పువ్వు - ఒకటి, పచ్చిమిర్చి - నాలుగు, జీలకర్ర పొడి - ఒక స్పూను, ధనియాల పొడి - ఒక స్పూను, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - మూడు స్పూన్లు, యాలుకులు - రెండు.

తయారీ విధానం : బియ్యాన్ని శుభ్రంగా కడిగి 20 నిమిషాల పాటు నానబెట్టాలి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి. ఆ నూనెలో లవంగాలు, దాల్చిన చెక్క, అనాసపువ్వు, యాలకులు వేసి వేయించాలి. తర్వాత నిలువుగా తరిగిన పచ్చిమిర్చి, నిలువుగా తరిగిన ఉల్లిపాయలను వేసి వేయించుకోవాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్టును వేసి వేయించాలి. ధనియాల పొడి, జీలకర్ర పొడి, ఉప్పు వేసి ఉడికించుకోవాలి. ఇప్పుడు చికెన్ ముక్కలను వేసి తొంభైశాతం ఉడకనివ్వాలి. ఆ తర్వాత పుంటికూర ఆకులను వేయాలి. పైన మూత పెడితే ఆకులు మెత్తగా ఉడుకుతాయి. ఈ మిశ్రమం అంతా కూరలాగా దగ్గరగా అయ్యేవరకు ఉడికించుకోవాలి. ఇప్పుడు ముందుగా నీటిలో నానబెట్టుకున్న బియ్యాన్ని ఈ మిశ్రమంలో వేయాలి. ఒకసారి మిశ్రమాన్నంతా కలిపి బియ్యం ఉడకడానికి సరిపడా నీటిని పోయాలి. పావుగంట పాటూ ఉడికిస్తే బియ్యం ఉడికిపోతాయి. పైన కొత్తిమీర తరుగు చల్లుకొని స్టవ్ కట్టేయాలి. ఇది పెద్దలకే కాదు... పిల్లలకూ నచ్చుతుంది. ఒక్కసారి చేశారంటే పదే పదే చేసుకోవాలనిపిస్తుంది.

మటన్ కర్రీ

కావలసిన పదార్థాలు :
మటన్-అరకేజీ, పుంటికూర- మూడు కట్టలు, సన్నగా కోసిన ఉల్లిపాయలు- అర కప్పు, చీల్చిన పచ్చిమిర్చి ముక్కలు- 10, అల్లంవెల్లుల్లి పేస్టు- రెండు టీస్పూన్లు, కారం- 2 టీస్పూన్లు, ఆయిల్ - 6 టీస్పూన్లు, పసుపు- పావు టీస్పూన్, ధనియాల పొడి- ఒక టీస్పూన్, గరం మసాలా- ఒక టీస్పూన్,



కొత్తిమీర తరుగు - కొద్దిగా, ఉప్పు- రుచికి సరిపడా

తయారీ విధానం : ముందుగా మటన్‌ను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నె తీసుకుని స్టవ్ మీద కాసేపు పుంటికూరను ఉడికించుకోవాలి. ఆ తర్వాత స్టవ్ వెలిగించి దాని మీద కుక్కర్ పెట్టి నూనె వేడిచేయాలి. నూనె కాస్త వేడయ్యాక.. తరుగుని ఉంచుకున్న ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు అందులో వేసి గోధుమరంగులోకి వచ్చేంత వరకు వేయించాలి. ఆ తర్వాత అల్లంవెల్లులి పేస్టు వేసి పచ్చివాసన పోయేంత వరకు ఆ మిశ్రమాన్ని వేయించాలి. వేగాక.. ఇప్పుడు శుభ్రం చేసి పక్కన పెట్టుకున్న మటన్ వేయాలి. అందులోనే కారం, ఉప్పు, పసుపు, ధనియాలు, గరం మసాలా పొడి వేసి ఆ మిశ్రమాన్ని బాగా కలపాలి. ఆ తర్వాత మూతపెట్టి తక్కువ మంట మీద కాసేపు మగ్గనివ్వాలి. అనంతరం ఆ మిశ్రమంలో నీళ్ల పోసుకుని మూడు, నాలుగు విజిల్స్ వచ్చేంత వరకు ఉడికించాలి. తర్వాత మీరు ముందుగా ఉడికించి పెట్టుకున్న పుంటికూర వేసి బాగా కలిపి దానిని కాసేపు ఉడికించాలి. ఇక చివరగా కొత్తిమీర తరుగు చల్లి దించేయాలి. అంతే నోరూరించే పుంటికూర మటన్ కర్రీ రెడీ. ఈ కర్రీని తింటే ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే.

నువ్వుల పచ్చడి

కావలసిన పదార్థాలు : పుంటికూర - నాలుగు కట్టలు, నువ్వులు - అరకప్పు, పచ్చి మిర్చి - 15, వెల్లుల్లి - పది రెబ్బలు, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - మూడు స్పూన్లు, మినప్పప్పు- ఒక స్పూను, శెనగ పప్పు - ఒక స్పూను, ఆవాలు - అర స్పూను, జీలకర్ర - అర స్పూను, కరివేపాకు - గుప్పెడు, ఎండుమిర్చి - రెండు,



తయారీ విధానం : పుంటికూర ఆకులను ఏరి శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నువ్వులు వేసి వేయించాలి. వాటిని తీసి పక్కన పెట్టుకోవాలి. అదే కళాయిలో ఒక స్పూను నూనె వేయాలి. ఆ నూనెలో నిలువుగా కోసిన పచ్చిమిర్చిని వేయించాలి. అందులోనే శనగపప్పు, వెల్లుల్లిపాయలను వేసి వేయించాలి. ఆ మిశ్రమంలోనే ముందుగా ఏరుకున్న పుంటికూర ఆకులను కూడా వేసి మెత్తగా ఉడికేలా చేయాలి. ఆ మిశ్రమం చల్లారాక మిక్సీ జార్లో ఈ గోంగూర మిశ్రమాన్ని వేయాలి. ముందుగా వేయించిన నువ్వులను కూడా మిక్సీలో వేసుకోవాలి. ఆ మిక్సీలోని కరివేపాకు, ఉప్పు కూడా వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. దీనికి తాళింపు పెట్టేందుకు స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి. అందులో మినపప్పు, శెనగపప్పు, ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు వేసి వేయించుకోవాలి. ఆ మిశ్రమాన్ని చట్నీలో వేసి కలుపుకోవాలి. అంతే రుచికరమైన గోంగూర నువ్వుల పచ్చడి రెడీ అయినట్టే. దీన్ని గాలి చొరబడని ఒక సీసాలో వేస్తే రెండు మూడు వారాల వరకు నిల్వ ఉంటుంది. ప్రతిరోజు వేడి వేడి అన్నంలో ఈ చట్నీని తింటే ఆ రుచే వేరు.

రొయ్యల ఇగురు

కావలసిన పదార్థాలు : రొయ్యలు - అరకేజీ, గోంగూర - ఒక కట్ట, ఉల్లిపాయ - ఒకటి, అల్లం వెల్లుల్లి పేస్టు - ఒక స్పూను, పచ్చిమిర్చి - అయిదు, ధనియాల పొడి - ఒక టీస్పూను, పసుపు - పావు స్పూను, గరం మసాలా - అర



టీస్పూను, జీలకర్ర పొడి - అర స్పూను, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - తగినంత

తయారీ విధానం : రొయ్యలు శుభ్రంగా కడిగి కాస్త ఉప్పు, పసుపు వేసి బాగా కలిపి ఒక పావుగంట పక్కన పెట్టుకోవాలి. స్టవ్ మీద కళాయి పెట్టి అర స్పూను నూనె వేయాలి. నూనె వేడెక్కాక పుంటికూర, పచ్చి మిర్చి వేసి బాగా ఉడికించుకోవాలి. ఇప్పుడు మరో బాండీలో నూనె వేయాలి. అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయలు వేసి వేయించుకోవాలి. అందులో అల్లంవెల్లుల్లి పేస్టు వేసి పచ్చివాసన పోయే వరకు వేయించాలి. అన్నీ వేగాక పసుపు, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసి కలపాలి. అందులోనే రొయ్యలు, ఉప్పు వేసి కలపాలి. నీరంతా ఇగిరిపోయాక ముందుగా ఉడికించుకున్న గోంగూర పేస్టును వేసి కలపాలి. ఒక గ్లాసు నీళ్ల వేసి మూత పెట్టి చిన్న మంట మీద ఉడికించాలి. అరగంట పాటూ ఉడికించాక చిక్కని గ్రేవీలా అవుతుంది. స్టవ్ ఆఫ్ చేసి.. కూరను కొద్దిగా నూనె వేసి తాలింపు పెట్టుకోవాలి. ■

జ్ఞాపకశక్తి పెరగాలంటే..

మనలో చాలా మంది చిన్నిచిన్న విషయాలు మర్చిపోతూ ఉంటారు. అసలు విషయం గుర్తు పెట్టుకోవడానికి వీలు లేకుండా కొంతమందికి మతిమరుపు వస్తే ఎన్నో చిక్కులు ఎదురవుతాయి. పిల్లలు చదివిన విషయం మర్చిపోతే.. పెద్దవాళ్ల చేయాల్సిన పనులు గుర్తు లేకపోతే ఎన్నో చిక్కులు ఎదురవుతాయి. దగ్గరవారి పుట్టిన రోజు గుర్తించుకోవడానికీ.. చాలా మంది రిమైండర్‌లపై, సోషల్ మీడియా నోటిఫికేషన్‌లపై ఆధారపడుతుంటారు.



చిన్నచిన్న విషయాలు మర్చిపోతే.. మీ అలవాటు అల్జీమర్స్, డిమెన్షియా, వంటి తీవ్రమైన వ్యాధులకు లక్షణం కావచ్చు. ఈ నేపథ్యంలో మీ జ్ఞాపకశక్తిని సకాలంలో మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవడం చాలా అవసరం. మనం జ్ఞాపకశక్తిని పెంచుకోవడానికి నిపుణులు చెప్పే చిట్కాలను ఇప్పుడు చూద్దాం.

రోజూ 7 గంటల నిద్ర అవసరం..

మన జాపకశక్తి పెరగడానికి.. నిద్ర చాలా అవసరం. రాత్రి నిద్రపోయే సమయంలో.. న్యూరాన్‌ల మధ్య కనెక్షన్‌లు (సినాప్సెస్ అని పిలుస్తారు) మీకు ఇకపై అవసరం లేని జ్ఞాపకాలను తొలగించడానికి పని చేస్తాయి. రాత్రి సమయంలో సినాప్సెస్ మరుసటి రోజు కొత్త జ్ఞాపకాలను రూపొందించడానికి మనల్ని సిద్ధం చేస్తుంది. పెద్దలు రోజుకు కనీసం 7-8 గంటల నిద్ర అవసరమని వైద్యులు సిఫర్సు చేస్తున్నారు.

వ్యాయామం...

జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి ప్రతిరోజూ వ్యాయమం చేయాలి. వర్కవుట్ కారణంగా.. శరీరంతో పాటు మెదడులో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. వ్యాయామం వల్ల.. మెదడు మెరుగ్గా పనిచేస్తుంది, జాపకశక్తి మెరుగుపడుతుంది.

రోజూ ఏదొక కొత్త విషయం నేర్చుకోండి..

రోజూ ఏదో కొత్త విషయం నేర్చుకుంటే.. జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. ఇది మీ మీ మనస్సును నిమగ్నం చేయడానికి సహాయపడుతుంది. ఇలా చేస్తే.. మీ మెదడులో కొత్త న్యూరాన్ కనెక్షన్లు ఏర్పడతాయి.

మల్టీ టాస్క్ చేయవద్దు..

బిజీబిజీ లైఫ్‌స్టైల్ కారణంగా.. మల్టీ టాస్కింగ్ పెరిగి పోయింది. మల్టీ టాస్కింగ్ వ్యక్తులకు డిమాండ్ బాగా పెరుగుతోంది. కానీ, మల్టీ టాస్కింగ్ కారణంగా మెదడు దెబ్బతినే ప్రమాదం ఉంది. మీరు ఒకే సమయంలో రెండు పనులు చేసినప్పుడు, మీ ఏకాగ్రత డివైడ్ అవుతుంది.

పోషకాహారం తీసుకోండి..

మెదడు సరిగ్గా, ప్రభావవంతంగా పనిచేయడానికి తగిన పోషకాహారం అవసరం. మీ జ్ఞాపకశక్తిని పెంచుకోవడానికి.. ఆరోగ్యకరమైన, సమతుల్య ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచి స్తున్నారు. మీ బ్రెయిన్ యాక్టివ్‌గా పనిచేయడానికి.. వాల్‌నట్‌లు, బ్రోకలీ, పసుపు, డార్క్ చాక్లెట్ , టమాటా, గుడ్లు, తృణధాన్యాలు, ఆకుకూరలు, టమాటా వంటి ఆహార పదార్థాలు మీ డైట్‌లో చేర్చుకోండి. ■



14 పంటలకు ఎంఎస్పీ

(మొదటిపేజి తరువాయి)

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గ సమావేశం జరిగింది. సమావేశ అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. వరికి రూ.117 ఎంఎస్పీని పెంచారు. 2023-24లో వరి (కామన్) ధరను రూ. 2,183 నుంచి 2024-25లో రూ. 2,300కి పెంచారు. 2023-24లో వరి గ్రేడ్ ఏ ధరను రూ. 2,203 నుంచి 2024-25లో రూ. 2,320కి పెంచారు.

జొన్నకు రూ.191 పెంచారు. 2023-24లో జొన్న (హైబ్రిడ్) ధరను రూ. 3,180 నుంచి 2024-25లో రూ. 3,371కి పెంచారు. జొన్న (మల్దండి) ధర రూ.196 పెంచారు. 2023-24లో రూ.3,225 నుంచి 2024-25లో రూ.3,421కి పెంచారు. బజ్రాకు రూ.125 పెంచారు. 2023-24లో బజ్రా ధరను రూ. 2,500 నుంచి 2024-25లో రూ. 2,625కి పెంచారు. రాగులకు రూ. 444 పెంచారు. 2023-24లో ఈ రాగుల ధరను రూ. 3,846 నుంచి 2024-25లో రూ. 4,290కి పెంచారు. మొక్కజొన్నకు రూ.135 పెంచారు. 2023-24లో మొక్కజొన్న ధరను రూ. 2,090 నుంచి 2024-25లో రూ. 2,225కి పెంచారు. కందులకు రూ. 550 పెంచారు. 2023-24లో కందుల ధరను రూ. 7,000 నుంచి 2024-25లో రూ. 7,550కి పెంచారు. పెసలకు రూ. 124 పెంచారు. 2023-24లో కందుల ధరను రూ. 8,558 నుంచి 2024-25లో రూ. 8,682కి పెంచారు. మినుములకు రూ. 450 పెంచారు. 2023-24లో మినముల ధరను రూ. 6,950 నుంచి 2024-25లో రూ. 7,400కి పెంచారు.

వేరుశనగకు రూ.406 పెంచారు. 2023-24లో వేరుశనగ ధరను రూ. 6,377 నుంచి 2024-25లో రూ. 6,783కి పెంచారు. సన్ ఫ్లవర్‌కు రూ.520కి పెంచారు. 2023-24లో సన్‌ఫ్లవర్ ధరను రూ. 6,760 నుంచి 2024-25లో రూ. 7,280కి పెంచారు. సోయాబీన్ (ఎల్లో) రూ.292కి పెంచారు. 2023-24లో సోయాబీన్ (ఎల్లో) ధరను రూ. 4,600 నుంచి 2024-25లో రూ.4,892కి పెంచారు. నువ్వులను రూ.632కి పెంచారు. 2023-24లో నువ్వుల ధరను రూ. 8,635 నుంచి 2024-25లో రూ. 9,267కి పెంచారు. నైజర్ సీడ్ కు రూ.983కి పెంచారు. 2023-24లో నైజర్ సీడ్ ధరను రూ. 7,734 నుంచి 2024-25లో రూ. 8,717కి పెంచారు. పత్తికి రూ.501 ఎంఎస్పీ పెంచారు. 2023-24లో పత్తి (మీడియం) ధరను రూ. 6,620 నుంచి 2024-25లో రూ. 7,121కి పెంచారు. 2023-24లో పత్తి (మంచి క్వాలిటీ) ధరను రూ. 7,020 నుంచి 2024-25లో రూ.7,521కి పెంచారు.

ఆఫ్‌షోర్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టల అమలు కోసం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (విజిఎఫ్) స్కీమ్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. దేశంలో మొట్టమొదటి ఆఫ్‌షోర్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం ఈ పథకం లక్ష్యమని కేంద్ర మంత్రి తెలిపారు.

సెంట్రల్ సెక్టార్ స్కీమ్ "నేషనల్ ఫోరెన్సిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎన్‌హాన్స్‌మెంట్ స్కీమ్ (ఎన్ఎఫ్ఐఈఎస్)కి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. క్యాంపస్‌లు, ల్యాబ్‌లు, మౌలిక సదుపాయాల పెంపుదల కోసం రూ.2254.43 కోట్ల వ్యయం చేయనుంది. వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ. 2869.65 కోట్లు అంచనా వ్యయంతో ప్రస్తుతం ఉన్న 3.9 మిలియన్ల ప్రయాణికుల(ఎంపీపీఏ) నుంచి 9.9 ఎంపీపీఎకి విమానాశ్రయం ప్రయాణికుల నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించనుంది.

'మహారాష్ట్రలోని వధావన్‌లో ఆల్-వెదర్ గ్రీన్‌ఫీల్డ్ డీప్‌డ్రాఫ్ట్ మేజర్ పోర్ట్ అభివృద్ధి'కి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పూర్తయితే రూ.76,200 కోట్ల ఓడరేవు ప్రపంచంలోని టాప్ 10 పోర్టులలో ఒకటిగా ఉంటుందని పేర్కొంది.

ప్రజాసమస్యల ప్రస్తావన ఏదీ ?

(మొదటిపేజి తరువాయి)

నీటి కోసం గంటల తరబడి వాటర్ ట్యాంకర్ల ముందు క్యూ లైన్లలో నిలబడాల్సి వచ్చింది. దేశ రాజధాని ఢిల్లీలో రోజుకు 1,290 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం కాగా మే 21-31 తేదీల మధ్య రోజుకు 977.79-993.76 మిలియన్ గ్యాలన్లు మాత్రమే సరఫరా అయ్యాయి.

దేశ రాజధానివాసే జనం అల్లాడుతుంటే..ఎన్డీఏ సర్కారు చోద్యంలా చూస్తోంది. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటే కానీ..జల సమస్యవైపు మోడీ సర్కార్ కన్నెత్తి చూడటంలేదని పౌర సమాజం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది..మరోవైపు

బెంగళూరు నగరంలో 14 వేల బోరుబావులు ఉండగా వాటిలో 6,900 వట్టిపోయాయి. నీటి సంక్షోభం సామాజిక లేదా పర్యావరణ సంబంధమైన సమస్యల కంటే తీవ్రమైనది. అది దేశ ఆర్థిక వ్యవస్థనే అతలాకుతలం చేస్తుంది. అరకొర నీటి సరఫరా కారణంగా పట్టణ మౌలిక వసతులే కాదు...వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పాదకతలు కూడా దెబ్బ తింటాయి.

అంతా కలుషితమే

దేశ ప్రజలను పట్టి పీడిస్తున్న మరో సమస్య కలుషిత ఆహారం. దీని పైన కూడా ఏ రాజకీయ పార్టీ పెదవి విప్పలేదు. భారత్ నుండి దిగుమతి అవుతున్న 527 ఆహార ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నాయని యూరోపియన్ యూనియన్ ఆహార భద్రతా అధికారులు తేల్చారు. సీసం, పాదరసం వంటి మెటల్స్ మొదలుకొని దశాబ్దాల క్రితమే నిషేధించబడిన పురుగుమందులు, క్రిమి సంహారకాల అవశేషాల వరకూ వీటిలో కన్పించాయని తెలిపారు. ఆహార ధాన్యాలు, పప్పులు, పండ్లు, కూరగాయలు, మూలికలు, సుగంధ ద్రవ్యాలు...ఒకటన్న మాటేమిటి? కాదేదీ కాలుష్యానికి అనర్హం అన్న చందంగా అన్నీ కల్తీ అయ్యాయట. మన దేశంలో పేరెన్నికగన్న సుగంధ ద్రవ్యాల విక్రయ సంస్థలు ఎవరెస్ట్, ఎండీహెచ్ ఉత్పత్తులను హాంకాంగ్, సింగపూర్‌లో నిషేధించారు. ఆహార పదార్థాలు కలుషితం కావడానికి పురుగు మందులను మితిమీరి వినియోగించడమే ప్రధాన కారణం. భారత్ నుండి వస్తున్న ఆహార ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారక ఇథలిన్ ఆక్సైడ్ ఉన్నట్లు యూరోపియన్ యూనియన్ ఆహార భద్రతాధికారులు తేల్చారు. ఇంత జరుగుతున్నా మన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

కమతాలు చిన్నవై పోతున్నాయి

వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశంలో పెద్ద ఎత్తున చెలరేగిన ఆందోళనల కారణంగా ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకుంది. అయితే రైతుల ఆందోళనలు మాత్రం ఈ సంవత్సరం ప్రారంభం వరకూ కొనసాగాయి. రైతులకు సంబంధించిన అంశాలను అన్ని రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోల్లో చేర్చడం సర్వసాధారణమే. అయితే ఈ పార్టీలన్నీ ఓ కీలకమైన విషయాన్ని విస్మరించాయి. అదే సాగు భూముల విస్తీర్ణం తగ్గిపోవడం. ఇది ఏ పార్టీ మ్యానిఫెస్టోలోనూ చోటుచేసుకోలేదు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు జనాభా పెరుగుదల, కుటుంబ పరిమాణంలో వస్తున్న మార్పుల కారణంగా వ్యక్తిగత కమతాలు తగ్గిపోతున్నాయి. దేశంలోని 80 శాతానికి పైగా రైతులకు రెండు హెక్టార్ల కంటే తక్కువ భూమే ఉంది. సగటున 0.6 హెక్టార్ల భూమి మాత్రమే ఉన్నదని అంచనా. ఇది రైతులను ఏ మాత్రం ఆర్థికంగా ఆదుకోలేదు. చిన్న చిన్న వ్యవసాయ కమతాలు కలిగిన రైతన్నలకు బ్యాంకుల నుండి రుణాలు లభించడం కష్టంగా ఉండడంతో వారు వడ్డీ వ్యాపారులు, కార్పొరేట్ సంస్థలను ఆశ్రయించాల్సి వస్తోంది.

క్షీణిస్తున్న వాయు నాణ్యత

(మొదటిపేజి తరువాయి)

తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో వాయు కాలుష్యాన్ని ప్రస్తావించాయి. 102 నగరాల్లో సమగ్ర స్వచ్ఛ వాయు కార్యక్రమాన్ని చేపడతానని, ఐదేండ్లలో వాయు కాలుష్యాన్ని 35 శాతం మేర తగ్గిస్తానని బీజేపీ తన 2019 మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. కానీ అది అమలుకు నోచుకోలేదు.

రాష్ట్రాభివృద్ధికి తోడ్పడండి

- కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జయంత్ చౌదరీలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటునందించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని పొన్నం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో తెలంగాణకు సంబంధించిన పలు అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరిని ఆయన ఛాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా తెలంగాణలో ఆయా శాఖల పరంగా అభివృద్ధికి సహకరించాలని కోరారు.దేశంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఢిల్లీ తెలంగాణ భవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో కలిసి రాహుల్ బర్త్ డే కేక్‌ను కట్ చేశారు.

కామాంధ ఖాకీ

(మొదటిపేజి తరువాయి)

బాధితురాలి ఇంట్లోకి చొరబడి మళ్లీ దారుణానికి ఒడిగట్టాడు. మరో ముగ్గురు మహిళా కానిస్టేబుల్స్‌ను లైంగిక వేధింపులకు గురి చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. అయినా వేధింపులు ఆగకపోవడంతో చివరికి బాధితురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు ముగ్గురు డీఎస్పీలు, సుమారు పది మంది సీఐలు, ఎస్ఐలు రంగంలోకి దిగి మంగళవారం రాత్రి కాళేశ్వరంలో విచారణ చేపట్టారు. కీచక ఎస్ఐ సర్వీస్ రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో మరోసారి పూర్తి విచారణ చేపట్టి అతనిపై లైంగిక వేధింపులు, లైంగికదాడి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కాగా, ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యి కాళేశ్వరం ఎస్ఐ భవాని సేన్ గౌడ్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు సదరు ఎస్ఐని అరెస్టు చేసి భూపాలపల్లి కోర్టులో హాజరుపరిచారు. 14 రోజుల రిమాండ్‌కు తరలించారు.

గతంలోనే సస్పెండ్..

గతంలో ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడిన భవానీ సేన్ సస్పెండ్ అయ్యారు. 2022 జులైలో రెబ్బన పోలీస్ స్టేషన్‌లో అతనిపై లైంగికవేధింపుల కేసు నమోదైంది. మళ్లీ విధుల్లో చేరినా ఆయన తీరులో మార్పు రాలేదు. ఇటీవల కాళేశ్వరం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన భవాని సేన్ సమస్యల పరిష్కారానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారిని కూడా వేధింపులకు గురిచేశాడని సమాచారం. తాను మంత్రి మనిషిని అని.. తనని ఎవరూ ఏమీ చేయలేరని సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసేవాడు. చోటా మోటా నాయకులు ఎవరైనా పోలిస్ స్టేషన్ వస్తే "బాబన్న (శ్రీధర్ బాబు) బావున్నాడా.. నాకు ఇంతకు ముందే ఫోన్ చేశాడు" అంటూ మాట్లాడేవాడు. ఈయన పనిచేస్తున్న పోలీస్ స్టేషన్ పరిధిలో 15 చికెన్ సెంటర్లు ఉండగా, ప్రతిరోజూ ఒక చికెన్ సెంటర్ నుంచి పావుకిలో చికెన్ పంపాలని హుకుం జారీ చేశాడు. ఆటో డ్రైవర్లు, చిల్లర వ్యాపారులను ఎవరినీ వదలకుండా వసూళ్లకు పాల్పడేవాడనే ఆరోపణలొస్తున్నాయి. మహిళా కానిస్టేబుల్‌పై లైంగికదాడి ఘటనపై ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. ఈ విషయంలో ఎవరినీ క్షమించేది లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని చట్టానికి ఎవరూ అతీతులు కాదని అన్నారు.

సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగింపు

మహిళా పోలీస్ కానిస్టేబుల్‌పై లైంగికదాడి చేసిన ఎస్ఐ భవాని సేన్‌ను సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగిస్తూ మల్టీ జోన్-1 ఐజీపీ ఏవీ రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

కన్న తండ్రే కాలయముడు

- కోరిక తీర్చలేదని కడతేర్చాడు
- కూతురుపై లైంగికదాడికి యత్నం
- ప్రతిఘటించిన బాలిక
- ఆవేశంతో నేలకేసి కొట్టి చంపిన దుర్మార్గుడు
- ఆ తర్వాత కుమార్తె మిస్సయిందంటూ పోలీసులకు ఫిర్యాదు
- తండ్రే నిందితుడని తేల్చిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నరసింహ్మారావు



నవతెలంగాణ-మియాపూర్

చిన్నప్పుడు ఆడించిన.. భుజాన ఎత్తుకుని చందమామను చూపించిన నాన్నే బిడ్డపై అఘాయిత్యానికి ఒడిగట్టలానుకున్నాడు.. మద్యానికి బానిసై, అశ్లీల వీడియోలు చూస్తూ.. వికృత ఆలోచనలతో కన్న బిడ్డపైనే కన్నేశాడు. ప్రతిఘటించడంతో తన కోరిక తీర్చలేదని బాలికను నేలకేసి బాదాడు. తండ్రి క్రూరత్వానికి ఆ పసిబిడ్డ విలవిల్లాడి అక్కడికక్కడే ప్రాణం విడిచింది. ఆ తర్వాత ఏమీ ఎరుగనట్టు.. తన కూతురు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగి విచారణ చేపట్టిన పోలీసులు కన్న తండ్రే నిందితుడని గుర్తించి అరెస్టు చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లో జరిగింది. ఇందుకు సంబంధించి మియాపూర్ ఏసీపీ నరసింహ్మారావు సీఐ దుర్గ రామలింగప్రసాద్, ఎస్ఐ రాజుతో కలిసి బుధవారం మీడియాకు వెల్లడించారు.

మియాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈనెల 7న కనబడకుండా పోయిన బాలిక(12) అనంతరం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేశారు. ఈ కేసును మియాపూర్ పోలీసులు ఛేదించారు. బాలిక హత్య కేసులో తండ్రి ప్రధాన సూత్రధారిగా తేల్చారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట్ గ్రామానికి చెందిన నరేష్, శారద దంపతులు ఈ నెల మొదటి వారంలో మియాపూర్ నడిగడ్డ తండాకు వలస వచ్చారు. ఓ డెలివరీ కంపెనీలో పనిచేస్తున్న నరేష్ మద్యం తాగి.. పోర్న్ వీడియోలు చూస్తూ వ్యసనాలకు అలవాటు పడ్డాడు. రెండ్రోజులు అతని ఫోన్ డిస్‌ప్లే పని చేయకపోవడంతో మరింత ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలో నరేష్ కూతురు ఇక్కడ ఉండలేను.. ఊరు వెళ్తానని చెప్పడంతో.. ఇదే అదునుగా భావించి ఆమెను బస్సు ఎక్కించి వస్తానని చెప్పి బైక్‌పై తీసుకెళ్లి మియాపూర్ మెయిన్ రోడ్డుపైకి వచ్చాడు. అక్కడి నుంచి ఆమెను అదే బండిపై తిరిగి నడిగడ్డ సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకువెళ్లాడు. తన కోరిక తీర్చాలంటూ బాలిక మీద ఒత్తిడి చేశాడు. అమ్మకు చెప్తానని బాలిక గట్టిగా అరవడంతో.. ఇంట్లో వాళ్లకు చెప్తే తన పరువు పోతుందన్న భయంతో ఏ మాత్రం కనికరం లేకుండా కూతురు జుట్టు పట్టుకుని నేలకేసి కొట్టాడు. బాలిక ముక్కు, చెవులలో నుంచి రక్తం కారడంతో అక్కడికక్కడే మృతిచెందింది. అనంతరం అక్కడి నుంచి వచ్చాడు. కాసేపటి తర్వాత బాలిక చనిపోయిందా లేదా అని చూసేందుకు మరోసారి అక్కడికెళ్లి చూసి వచ్చాడు. అలా వరుసగా మూడ్రోజుల పాటు బాలిక మృతదేహాన్ని చూస్తూ వచ్చాడు. ఆ తర్వాత తన కూతురు మిస్ అయిందంటూ భార్యతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏడు రోజుల తర్వాత బాలిక మృతదేహం లభించడంతో పోలీసులు తమదైన స్టైల్‌లో విచారణ చేపట్టారు. నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేసిన మియాపూర్ పోలీసులు సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఈ విచారణలో బాలిక తండ్రి నరేష్‌యే హత్య చేసినట్టుగా నిర్ధారణకు వచ్చారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్టు నరేష్ ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

నవచిత్రం

కోపాలు చాలండి.. శ్రీమతిగారు


దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి

దుల్కర్ సల్మాన్ తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు 'లక్కీ భాస్కర్' అనే మరో వైవిధ్యమైన చిత్రంతో సిద్ధమవు తున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీ స్థాయిలో నిర్మిస్తోంది. ఈ సినిమాలో బ్యాంక్ క్యాషియర్‌గా మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో దుల్కర్ సల్మాన్ కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ విశేషంగా ఆకట్టుకుని, సినిమాపై అంచనాలను పెంచేసింది. జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి 'శ్రీమతి గారు' అనే తొలి పాటను చిత్ర బృందం బుధవారం విడుదల చేసింది.

జి.వి. ప్రకాష్ కుమార్ స్వరపరిచిన ఈ మెలోడీ ఎంతో వినసొంపుగా ఉంది. వయొలిన్‌తో మొదలై, ఫ్లూట్ మెలోడీగా మారి, డ్రమ్ బీట్‌లతో మరో స్థాయికి వెళ్లి.. జి.వి. ప్రకాష్ కుమార్ ప్రత్యేక శైలిలో ఎంతో అందంగా సాగింది ఈ పాట. విశాల్ మిశ్రా, శ్వేతా మోహన్ తమ మధుర స్వరాలతో చక్కగా ఆలపించి, పాటకు మరింత అందాన్ని తీసుకువచ్చారు. గీతరచయిత శ్రీమణి అందించిన సాహిత్యం, ఈ గీతానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'కోపాలు చాలండి శ్రీమతి గారు.. కొంచెం కూల్ అవ్వండి మేడం గారు' అంటూ అందరూ పాడుకునేలా, తేలికైన పదాలతో అర్థవంతమైన సాహిత్యం అందించారు. కోపగించుకున్న భార్య పట్ల భర్త తన వాత్సల్యాన్ని తెలుపుతూ "చామంతి నవ్వు", "పలుకే ఓ వెన్నపూస" వంటి పదబంధాలను ఉపయోగిస్తూ, గాఢమైన ప్రేమను వ్యక్తీకరించారు.

దర్శకుడు వెంకీ అట్లూరి గత చిత్రం 'సార్'లో స్వరకర్త జి.వి. ప్రకాష్ కుమార్, గాయని శ్వేతా మోహన్ కలయికలో వచ్చిన 'మాస్టారు మాస్టారు' గీతం ఎంతటి విజయం సాధించిందో తెలిసిందే. ఇప్పుడు ఈ 'శ్రీమతి గారు' గీతం కూడా ఆ స్థాయి విజయాన్ని సాధించి, ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటుంది అనడంలో సందేహం లేదు అని చెబుతోంది చిత్ర బృందం.

1980-90 కాలంలో అసాధారణ విజయాన్ని సాధించిన ఒక సాధారణ బ్యాంక్ క్యాషియర్ ప్రయాణాన్ని ఈ చిత్రంలో చూడబోతున్నాం. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ పాన్ ఇండియా మూవీ తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది.



అంచనాలు పెంచిన శివం భజే టీజర్

గంగా ఎంటర్టైన్మెంట్స్ మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మాణంలో తెరకెక్కుతున్న తొలి చిత్రం 'శివం భజే'. ఇప్పటికే టైటిల్, ఫస్ట్‌లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ చిత్ర టీజర్ నేడు విడుదలై అమాంతం అంచనాలను పెంచేసింది. అప్సర్ దర్శకత్వంలో న్యూ ఏజ్ కథతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సస్పెన్స్, యాక్షన్, థ్రిల్ ఎలిమెంట్స్‌తో పాటు డివోషన్ కూడా ఉన్నట్టు టీజర్‌లో తెలుస్తోంది.

ఈ సందర్భంగా నిర్మాత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, 'వైవిధ్యమైన కథతో మా సంస్థ గంగా ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణంలో తెరకెక్కుతున్న చిత్రమిది. కొత్త కథ, కథనాలకి తగ్గట్టుగా నటులు, సాంకేతిక విలువలు సమకూర్చు కున్నాం. టైటిల్, ఫస్ట్ లుక్‌కి మించిన స్పందన ఇప్పుడు టీజర్‌కి రావడం చాలా ధైర్యాన్నిస్తుంది. మా హీరో అశ్విన్ బాబు, దర్శకుడు అప్సర్ కూడా ఈ చిత్ర విజయంపై పూర్తి విశ్వాసంతో ఉన్నారు. అర్బాజ్ ఖాన్, సాయి ధీనా, హైపర్ ఆది, మురళీ శర్మ, బ్రహ్మాజీ, తులసి వంటి నటులు, మేటి సాంకేతిక నిపుణుల సహకారంతో ఎక్కడా తగ్గకుండా వినూత్నంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్ర నిర్మాణాంతర కర్యక్రమాలు వేగంగా పూర్తి చేసుకుని జూలైలో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాం' అని తెలిపారు.

"శివం భజే' టైటిల్‌తోనే అందరి దృష్టి ఆకర్షించిన మా చిత్ర టీజర్‌కి అన్ని భాషల ప్రేక్షకులు, వీక్షకుల నుండి అనూహ్యమైన స్పందన రావడం చాలా సంతోషంగా ఉంది. మా నటీ నటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాత మహేశ్వర రెడ్డి పూర్తి సహకారంతో ఈ చిత్రం అద్భుతంగా రూపొందింది' అని దర్శకుడు అప్సర్ చెప్పారు.

హీరో అశ్విన్ బాబు మాట్లాడుతూ, 'టీజర్‌కి వస్తున్న అనూహ్య స్పందనకి అందరికీ ధన్యవాదాలు. అన్ని వర్గాలు ప్రేక్షకులని అలరించే విధంగా సస్పెన్స్, కామెడీ, యాక్షన్, ఎమోషన్‌తో పాటు డివోషన్ కూడా ఈ చిత్రంలో ఉంటుంది. మా దర్శకుడు అప్సర్, నిర్మాత మహేశ్వర రెడ్డి ఈ చిత్రాన్ని ఊహించిన దానికంటే అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. ఆ శివుని అనుగ్రహంతో పాటు మీ అందరి ఆశీర్వాదంతో త్వరలోనే మా చిత్రాన్ని మీ ముందుకి తెస్తాం' అని అన్నారు.

వాస్తవ సంఘటనల ప్రేరణతో నింద


రాజేష్ జగన్నాథం

వరుణ్ సందేశ్ హీరోగా 'నింద' చిత్రం రాబోతోంది. ఈ మూవీని ది ఫెర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజేష్ జగన్నాథం నిర్మిస్తూ, దర్శకత్వం వహించారు. కాండ్రకోట మిస్టరీ అనే క్యాప్షన్‌తో యదార్థ సంఘటనల ఆధారంగా ఈ మూవీని తెరకెక్కించారు. ఈ చిత్రం ఈనెల 21న రిలీజ్ కానుంది. మైత్రీ మూవీస్ ఈ సినిమాను నైజాంలో రిలీజ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో దర్శక, నిర్మాత రాజేష్ జగన్నాథం మీడియాతో చిత్ర విశేషాలను షేర్ చేసుకున్నారు.

మాది నర్సాపురం. చదువుల కోసం నెల్లూరు, చెన్నై, యూఎస్ అంటూ తిరిగాను. యూఎస్‌లోనే ఉద్యోగం చేస్తూ ఉండిపోయాను. ఫిల్మ్ మేకింగ్ మీద ఇంట్రెస్ట్ ఉండేది. అక్కడే ఫిల్మ్ మేకింగ్‌లో కోర్సులతోపాటు షార్ట్ ఫిల్మ్స్ చేశాను. ఓ షార్ట్ ఫిల్మ్‌కి అవార్డు కూడా వచ్చింది.

■ నేను రాసుకున్న 'నింద' కథ వరుణ్ సందేశ్‌కి బాగా సెట్ అవుతుందని నమ్మాను. ఆయనకు ఇది మంచి కమ్ బ్యాక్‌లా ఉంటుందని భావించాను.

■ కాండ్రకోట మిస్టరీ అని నింద పోస్టర్‌ని రిలీజ్ చేసినప్పుడు అందరూ ఘోస్ట్ మీద సినిమా అని రాశారు. సర్లే ఏదో ఒకటి రాశారు. ప్రమోషన్ కల్పిస్తున్నారని అనుకున్నాను. టీజర్ రావడంతో అందరికీ ఓ క్లారిటీ వచ్చింది. ఈ చిత్రంలో రియల్ ఇన్సిడెంట్స్‌ను బేస్ చేసుకుని కొన్ని సీన్లు రాసు కున్నాను. కల్పితం కూడా ఉంటుంది. కథపై నాకు నమ్మకం ఉంది. నిర్మాతల కోసం ప్రయత్నించాను. వేరే వాళ్లు ఎందుకు? నా సినిమాను నేను నిర్మించాలని అనిపించింది. అందుకే నిర్మాతగానూ మారాను. మా నాన్న కూడా ఈ ప్రాజెక్ట్ విషయంలో బాగా హెల్ప్ చేశారు.

■ నా కథకి వరుణ్ సందేశ్‌తోపాటు మిగిలిన నటీ నటులు, సాంకేతిక నిపుణులు అందరూ పూర్తి న్యాయం చేశారు. అవుట్‌పుట్ చాలా బాగా వచ్చింది. సినిమా మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను. ఈ సినిమా నాకు దర్శకుడినే కాకుండా నిర్మాతగానూ మంచి పేరు తీసుకొస్తుందనే నమ్మకం ఉంది.

కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం



వెన్నెల కిషోర్, నందితా శ్వేత, నవమి గాయక్, షకలక శంకర్, రజత్ రాఘవ్, నవిన్ నేని, రఘుబాబు ప్రధాన పాత్రల్లో నటించిన హర్రర్, కామెడీ ఎంటర్ టైనర్ 'ఓఎంజీ' (ఓ మంచి ఘోస్ట్). మార్క్ సెట్ నెట్‌వర్క్స్ బ్యానర్ మీద డా.అబినికా ఇనాబతుని నిర్మించిన ఈ చిత్రానికి శంకర్ మార్తాండ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఈనెల 21న రాబోతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు.

దర్శకుడు శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ, 'అనూప్ రూబెన్స్ వల్లే ఈ సినిమా ప్రారంభమైంది. మా మీద నమ్మకంతో అబినికా ఈ సినిమాను నిర్మించారు. అనూప్ ఇచ్చిన ఆర్ఆర్‌తో సినిమా నెక్ట్స్ లెవెల్‌కు వెళ్లింది. మా ఆర్టిస్టులంతా కూడా అద్భుతంగా నటించారు. ఆండ్రూ కెమెరా వర్క్ బాగుంటుంది. ఫైట్ మాస్టర్ తక్కువ టైంలోనే మాకు కావల్సిన అవుట్ పుట్ ఇచ్చారు. ఆర్ట్ వర్క్ కూడా బాగుంటుంది. మా సినిమాను రిలీజ్ చేస్తున్న ఏసియన్ ఫిల్మ్స్, బాలాజీ ఫిల్మ్స్‌కి థ్యాంక్స్' అని తెలిపారు. 'నిర్మాతగా ఇది మాకు మొదటి చిత్రం. శంకర్ ఎంత బాగా కథ చెప్పారో.. అంతకు మించి అనేలా సినిమాను తీశారు. అందరూ చూడదగ్గ చిత్రమిది' అని నిర్మాత డా.అబినికా ఇనాబతుని చెప్పారు.

అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ, 'కరోనా టైంలో శంకర్ నాకు ఈ కథను చెప్పారు. అప్పుడు చిన్నగా అనుకున్నారు. కానీ ఇప్పుడు పెద్ద పెద్ద ఆర్టిస్టులతో సినిమా అద్భుతంగా వచ్చింది. వెన్నెల కిషోర్, నందిత, షకలక శంకర్ మధ్య సీన్లు బాగా వచ్చాయి. హర్రర్, కామెడీ మిక్స్ చేసి బాగా తీశారు. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని అన్నారు.

నందితా శ్వేత మాట్లాడుతూ, 'నాకు కామెడీ అంటే చాలా ఇష్టం. శంకర్ నాకు ఈ కథను చెప్పినప్పటి నుంచి ఎంతో ఎగ్జైటెడ్‌గా ఉన్నాను. హర్రర్, కామెడీ జోనర్లతో రాబోతున్న ఈ మూవీని కుటుంబ సమేతంగా చూడొచ్చు. అందర్నీ నవ్వించేలా మా సినిమా ఉంటుంది' అని తెలిపారు.

తల్లిదండ్రుల్ని గుర్తు చేసే కథ


షాజ్ఞ శ్రీ వేణున్, ప్రణవ్ ప్రీతమ్

ప్రణవ్ ప్రీతమ్, షాజ్ఞ శ్రీ వేణున్ జంటగా నటిస్తున్న సినిమా 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు-500143'.

ఈ చిత్రాన్ని ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందించారు డైరెక్టర్ శ్రీనాథ్ పులకురం. బ్లాక్ ఆంట్ పిక్చర్స్ బ్యానర్ పై కొవ్వూరి అరుణ సమర్పణలో భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించారు. ఇంటర్మీడియట్ టీనేజ్ లవ్ స్టోరీగా ఈ సినిమా తెరకెక్కింది. సెన్సార్ నుంచి యూ/ఏ సర్టిఫికేట్ అందుకున్న ఈ సినిమా ఈ నెల 21న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. తాజాగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ప్రసాద్ ల్యాబ్స్‌లో నిర్వహించారు.

దర్శకుడు శ్రీనాథ్ పులకురం మాట్లాడుతూ, 'ఇది అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే సినిమా. యువత, ఫ్యామిలీ అందరూ చూడొచ్చు. ఈ సినిమా చూశాక మీరు మీ పేరెంట్స్‌ను గుర్తు చేసుకుంటారు' అని తెలిపారు.

'శ్రీనాథ్‌కి సినిమా మీద ప్యాషన్ అర్థమైంది. ఆయన మాలాంటి చిన్న ప్రొడ్యూసర్ దగ్గర సినిమా చేయాల్సిన దర్శకుడు కాదు. చాలా పెద్ద సినిమాలు చేయాల్సినంత ప్రతిభ, కమిట్ మెంట్, ఉన్నాయి. మేము ఇచ్చిన లిమిటెడ్ బడ్జెట్‌లో ఈ సినిమాను అందరికీ నచ్చేలా రూపొందించాడు. ఈ సినిమా నిర్మాణంలో నాకు సపోర్ట్ చేసి ఆర్థికంగా సహాయం చేసిన మిత్రులకు, మా కుటుంబ సభ్యులకు థ్యాంక్స్ చెబుతున్నా. మా సినిమా చూసి ప్రేక్షకులు బాగా ఆదరిస్తారని ఆశిస్తున్నాం' అని నిర్మాత భువన్ రెడ్డి కొవ్వూరి చెప్పారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఎన్ని ఒడిదొడుకులు, కష్టనష్టాలు వచ్చినా.. ఇక్కడి మూడెంచల వ్యవస్థలో దోపిడీకి గురయ్యేది కార్మికుల కష్టమే.. నష్టం లేకుండా సేఫ్‌జోన్‌లో యజమాని ఉండగా.. ఎటొచ్చీ కిందున్న ఆసాములు, కార్మికులే తీవ్ర ప్రభావానికి గురవుతూ వచ్చారు. అందులోనూ కార్మికుల కష్టాన్నే దోచుకుంటూ సాగిన పరిశ్రమ ప్రస్థానంలో ఎర్రజెండా నీడన ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేస్తేగానీ పాలకుల ఉపశమన చర్యలు దక్కడం లేదు. ఇప్పుడు అవీ దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. మొన్నటి వరకూ యారన్‌పై సబ్సిడీ పేరుతో ప్రభుత్వం కార్మికులకిచ్చిన 10శాతాన్ని కాస్తా.. 20శాతం పేరుతో కార్మికునికి కూలిపై లెక్కించడం ద్వారా వారి ఆదాయానికి గండిపడింది. ఆందోళనలు చేస్తేగానీ ప్రభుత్వాలు సమస్యలను పట్టించుకోవడం లేదు. ఒకవైపు పవర్ రీయింబర్స్‌మెంట్ కోల్పోయి సాంచెలు బంద్ అయితే, ఇంకోవైపు చేసిన కష్టానికి రావాల్సిన యారన్ సబ్సిడీ చేతికందకుండా పోయిన పరిస్థితిపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం.

ఎటొచ్చీ కార్మికుల కష్టమే దోపిడీ

మొన్నటివరకూ 'సర్దుబాటు కూలి' కింద యారన్ సబ్సిడీ

పవర్ రీయింబర్స్‌మెంట్ మొదలు.. యారన్ సబ్సిడీ ఎత్తివేత

- ఇప్పుడు కార్మికుని కూలిపై 20 శాతం అదనంగా ఇస్తామంటున్న ప్రభుత్వం
- పేరుకు మ్యాక్ సొసైటీలు.. యజమానుల చేతుల్లోనే పరిశ్రమ
- మూన్నెళ్ల ముచ్చటగానే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు 'సర్కారు ఆర్డర్లు'
- పోరాటాలు చేస్తే తప్ప దక్కని ఉపశమనం



పార్ట్ 2

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

రూ.కోట్లు పెట్టుబడి పెట్టగలిగే కొద్ది మంది యజమానుల చేతుల్లోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కొనసాగుతోంది. వేళ్ల మీద లెక్కించే సంఖ్యలో ఉన్న ఆ యజమానులే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా, రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా.. కీలక నేతలుగా ఎదిగారు. ఆయా ప్రభుత్వాలు ఎన్ని స్కీములు తెచ్చినా.. రాయితీలు కల్పించినా అవి యజమానుల జేబులే నింపాయి తప్ప ఆసాములు, కార్మికుల బతుకులు మార్చలేదు. ప్రత్యేక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సర్కారు.. ఇక్కడి కార్మికులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వ ఆర్డర్లు కల్పించినా అవి ఎటొచ్చీ యజమానుల దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడ్డాయి. అందులోనూ ఏడాదిలో సగం రోజులే కార్మికులకు ఉపాధి కల్పించాయి.

పేరుకే మ్యాక్స్‌సొటీలు..

సిరిసిల్లలో 10 సాంచెల్లోపు ఉన్న ఆసాములు 12 మంది చొప్పున ఏర్పడిన మ్యాక్ సొసైటీలు 180 వరకూ ఉన్నాయి. 10 నుంచి ఆపై సాంచెలు ఉన్న వారంతా చిన్న తరహా పరిశ్రమ పేరుతో మరో 190 మంది వరకూ ఉన్నారు. ఉత్పత్తుల్లేక గడ్డుపరిస్థితులను ఎదుర్కొంటున్న పరిశ్రమకు ఉపశమనంగా ఆసాములు, కార్మికులకు ఉపాధి కల్పించేందుకు గత ప్రభుత్వం మ్యాక్‌సొసైటీలకు 2017 నుంచి రూ.280కోట్ల నుంచి మొదలు 2023వరకు రూ.350కోట్ల వరకు నేరుగా ఆర్డర్లు ఇవ్వడం ప్రారంభించింది. అయితే ముందస్తుగా ఆ ఉత్పత్తులకు అవసరమైన ముడి సరుకు కోసం అవసరమయ్యే రూ.కోట్ల పెట్టుబడి లేక, అంతమొత్తంలో అప్పులు తెచ్చే ధైర్యమూ లేక చివరికి ఆ పెట్టుబడి పెట్టగలిగే యజమానుల చెంతకే వారంతా వెళ్లారు. దీంతో చీరల తయారీకి అవసరమైన ముడి సరుకుపై పెట్టుబడి పెట్టే యజమానులు ఒక్కో మీటర్‌పై ప్రభుత్వం ఇచ్చే రూ.33లో రూ.7లాభం చూసుకుని.. రూ.10.50 కూలి కింద ఇవ్వగా, అందులో చెరో రూ.5.25 చొప్పున ఆసాములు, కార్మికులు తీసుకునేవారు. ఇలా ఏటా ప్రభుత్వం ఇచ్చే బతుకమ్మ, సర్వశిక్ష అభియాన్, క్రిస్‌మస్, రంజాన్ పండుగలకు అవసరమయ్యే చీరలు, ఇతర ఉత్పత్తులు సుమారు 9.5కోట్ల మీటర్లపైనే ఉండేది. దానిపై పెట్టుబడి పెట్టిన యజమాని ఒక్కో మీటర్‌పై రూ.7చొప్పున రూ.కోట్లు గడిస్తే.. కూలి కింద వచ్చే సొమ్ముతో గిట్టుబాటు కూడా కాక ఆసామి, కార్మికుడు తీవ్రంగా నష్టపోయారు.

కూలి రేట్లు పెంచకుండా 'సర్దుబాటు'

వస్త్ర పరిశ్రమలో శ్రమకోర్చి వస్త్ర ఉత్పత్తులు చేసే ఆసాములు, కార్మికులు పోరాటాలు చేస్తేగానీ ప్రభుత్వాలు ఉపశమన చర్యలు చేపట్టేవి కావు. ఇప్పుడవీ దూరమైన పరిస్థితులు దాపురించాయి. ప్రధానంగా కూలి పెంపు కోసం పోరాటం చేసిన కార్మికులకు గత ప్రభుత్వం నేరుగా కూలి రేట్లు పెంచకుండా 'సర్దుబాటు' పేరుతో ఆర్డర్లు పూర్తయ్యాక ఉత్పత్తులకు వినియోగించిన యారన్ (నూలు)పై 10శాతం సబ్సిడీని ఖాతాల్లో జమ చేసింది. మీటర్ వస్త్రం కోసం వినియోగించిన యారన్‌పై 10శాతం లెక్కన రూ.1.42పైసలు చెల్లించింది. ఈ లెక్కన సుమారు 20వేల మీటర్లు వస్త్ర ఉత్పత్తి చేసిన ఒక్కో కార్మికునికి ప్రభుత్వ ఆర్డర్లు ముగిశాక రూ.28వేల వరకు ఖాతాల్లో జమయ్యేవి. అయితే, ఆ డబ్బుల కోసమూ నెలల తరబడి పోరాటం చేస్తేగానీ వచ్చేవి కావు. ఇప్పుడు ఆ ప్రక్రియకు మంగళం పాడిన ప్రభుత్వం 2022-23 సంవత్సరానికి సంబంధించిన యారన్ సబ్సిడీ స్థానంలో కార్మికుని వాస్తవ కూలిపైనే 20శాతం అదనంగా చెల్లిస్తామని చెబుతోంది. దీంతో మీటర్‌పై వచ్చే కూలి రూ.5.25లో 20శాతం లెక్కన అదనంగా రూ.1.5పైసలు మాత్రమే రావడంతో గతం కంటే 37పైసలు నష్టపోతున్నాడు. టెక్స్‌టైల్ పార్క్‌లో బ్లౌజ్‌పీసు నేసిన కార్మికుని పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఇక్కడ ఒక్కో మీటర్‌పై రూ.3మాత్రమే కూలి వచ్చినా.. అందులో రూ.1.5 మాత్రమే లెక్కలోకి తీసుకుంటున్నారు. దీంతో రూ.1.5కూలిపై 20శాతం లెక్కిస్తే 30పైసలు మాత్రమే వస్తోంది. దీంతో ఒక్కో కార్మికుడు గతంలో 28వేల వరకూ యారన్ సబ్సిడీ పేరుతో అదనపు కూలి సంపాదిస్తే ఇప్పుడు రూ.6వేలు కూడా దాటని పరిస్థితులు దాపురించాయి.

2018 నుంచి 2021 వరకు పవర్‌లూమ్ కార్మికులు ఉత్పత్తిచేసిన వస్త్రం,

అందుకు యారన్ సబ్సిడీపై వచ్చిన కూలి నిధులు

సంవత్సరం	లబ్ధిదారులు	మ్యాక్స్ సంఘాలు /ఎస్ఎస్ఏ	ఉత్పత్తి చేసిన వస్త్రం (మీటర్లలో)	యారన్ సబ్సిడీ నిధులు
2018	4121	196	4.70కోట్లమీటర్లు	రూ.6.69కోట్లు
2019	4971	251	5.99కోట్ల మీటర్ల	రూ.8.51కోట్లు
2020	5374	303	6.19కోట్ల మీటర్లు	రూ.8.79కోట్లు
2021	5058	315	60.18కోట్ల మీటర్లు	రూ.8.77కోట్లు

పనిలేక పస్తుంటున్నం

బాసబత్తిని రాజమౌళి - పవర్‌లూమ్ కార్మికుడు



కొన్ని రోజుల నుంచి సాంచాలు బంద్ పెట్టడంతో పని లేక పస్తులుంటున్నం. గత ప్రభుత్వం సంవత్సరం పొడవునా నేతన్నలకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేసింది. ఇప్పుడున్న ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తోంది. ప్రభుత్వం స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి.

సమస్యలు పరిష్కరించాలి

కూచన శంకర్, టెక్స్‌టైల్ పార్క్ పవర్‌లూమ్ కార్మికుడు



సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. బతుకమ్మ చీరలకు సంబంధించి బకాయిలు చెల్లించకపోవడంతో సాంచెలు బంద్ పెడుతున్నారు. వేలాది మంది కార్మికులం రోడ్డున పడ్డాం. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించి సంక్షోభం నుంచి గట్టెక్కించాలి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.